


అనంత
# జనశక్తి
జనం కోసమే మా అక్షరం

17.09.2026
గురువారం | అనంతపురం
సంపుటి : 11 | సంచిక: 126
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## భద్రతా కారణాలతో ఈవెంట్ రద్దు

- లండన్‌లో సీఎం విజయ్‌కు బిగ్ షాక్
- ది షార్డ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమం



**చెన్నై, సెప్టెంబర్ 16, అనంత జనశక్తి న్యూస్**

తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత సి. జోసెఫ్ విజయ్ బ్రిటన్ పర్యటనలో ఒక అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. లండన్‌లోని అత్యంత ఎత్తైన భవనంగా పేరొందిన 'ది షార్డ్' వద్ద ఏర్పాటు చేసిన సీఎం విజయ్ కార్యక్రమాన్ని అక్కడి పోలీసులు రద్దు చేశారు. ముఖ్యంగా తమ ప్రియతమ నేతను కళ్లారా చూసేందుకు వందలాది మంది అభిమానులు, మద్దతుదారులు భారీ సంఖ్యలో అక్కడకు తరలివచ్చారు. అయితే ఆ జనసందోహాన్ని చూసిన బ్రిటన్ మెట్రోపాలిటన్ పోలీసులు.. ప్రజల భద్రతకు విఘాతం కలుగుతుందనే ఉద్దేశంతో తక్షణమే జోక్యం చేసుకుని ఆ కార్యక్రమాన్ని రద్దు చేశారు.

7లో..

## ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియడం లేదు

- అలాంటి వారు నన్ను ప్రశ్నిస్తున్నారు
- మంత్రి నారా లోకేష్ కామెంట్
- ఐదేండ్ల పాటు డీఎస్సీని పట్టించుకోలేదు
- ఇప్పుడు దాని గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా

7లో..



## పోలీస్ శాఖలో ఉద్యోగ ప్రకటన

- 1,156 పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం
- అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు
- పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ వెల్లడి

**అమరావతి, సెప్టెంబర్ 16, అనంతజనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ పోలీస్, అగ్నిమాపక, జైళ్ల శాఖల్లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. మొత్తం 1,156 ఖాళీల వివరాలు కింది విధంగా ఉన్నాయి.

2లో..



# తిరుమలలో పవిత్రతే ప్రధానం

- రాజకీయాలకు వేదిక కాకూడదు
- సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి
- తిరుపతిని ఆధ్యాత్మిక హబ్‌గా అభివృద్ధి చేస్తాం
- రైల్వే స్టేషన్–బస్టాండ్ మధ్య స్కైవాక్
- 50 ఎకరాల్లో మల్టీస్టోరీ పార్కింగ్
- తిరుమలలో నెట్‌జీరో విధానం అమలు
- టీటీడీ భవనాలపై సోలార్ ప్యానెళ్లు
- అన్నప్రసాదాలు, వైద్య సేవలు మరింత మెరుగ్గా
- టీటీడీ ఆస్తుల వివరాలు ఆన్‌లైన్‌లో
- తిరుమల రాజకీయాలకు వేదిక కాకూడదు



**తిరుమల, సెప్టెంబర్ 16, అనంత జనశక్తి న్యూస్**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలో సుధర్మ సమావేశ మందిరంలో మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్య ప్రసాద్, టీటీడీ ఛైర్మన్ బీ.ఆర్. నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, జిల్లా కలెక్టర్ డాక్టర్ వేంకటేశ్వర్, టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, టీటీడీ జేఈవోలు డా ఎ. శరత్, గోపీనాథ్, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో కే.వి మురళీకృష్ణ ఇతర ప్రజా ప్రతినిధులు, టీటీడీ బోర్డు సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

2లో..

తిరుపతి రైల్వే స్టేషన్ నుంచి బస్టాండ్ వరకూ లింక్ చేసేలా స్కైవాక్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉందని సీఎం చంద్రబాబు చెప్పారు. త్వరలోనే కేంద్ర సహకారంతో ఈ ప్రాజెక్టు చేపడతామన్నారు. తిరుపతి లో ఇటీవల సేకరించిన 50 ఎకరాల్లో మల్టీస్టోరీ పార్కింగ్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నామన్నారు. ఉద్యోగులకు ఇంటి జాగాలకు సంబందించి, మౌలిక సదుపాయాలు కల్పనకు రూ.230 కోట్లు వ్యయం అవుతుందన్నారు.

త్వరలోనే తిరుపతిని వివిధ హైవేలకు కనెక్టు చేసేలా కార్యాచరణ చేపడతామని చంద్రబాబు చెప్పారు. తిరుపతి కేంద్రంగా పెద్ద ఎత్తున ఎకనామిక్ యాక్టివిటీ జరగాలని సీఎం ఆకాంక్షించారు. శ్రీవారిని దర్శించుకోడానికి వచ్చే వారితో తిరుమల తిరుపతి సర్వీస్ హబ్‌గా మారుతుందన్నారు. తిరుమలతో పాటు తిరుపతిలోనూ శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవం కనపడాలన్నారు. ఆధ్యాత్మికంగా ప్రజల్ని కలిపేందుకు ఈ ఉత్సవాలు అత్యంత కీలకమని చెప్పారు..

'తిరుమలలో జరిగే కల్యాణాలకు అత్యంత విశిష్టత ఉంటుంది. వెడ్డింగ్ డెస్టినేషన్‌గా తిరుపతిని మార్చాలన్నది మా ఆలోచన. తిరుపతి, తిరుమల అంతా నెట్ జీరో కాన్సెప్ట్ విధానంలోనే కార్యకలాపాలు నిర్వహించాలి. సౌర, పవన విద్యుత్ తో పాటు బ్యాటరీ స్టోరేజి ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరగాలి. ప్రతీ టీటీడీ భవనంపైనా సౌరవిద్యుత్ ప్యానళ్లు ఏర్పాటు చేయాలని సూచిస్తున్నా. ప్రస్తుతం కోటి యూనిట్లు ఉత్పత్తి చేస్తుంటే 10 కోట్ల యూనిట్లు టీటీడీ వినియోగిస్తోంది.' అని చంద్రబాబు అన్నారు.

## బీఆర్ఎస్ హయాంలో పెద్దఎత్తున భూకబ్జాలు

- కేంద్ర మంత్రి బండి సంజయ్
- లక్షల ఎకరాల భూములను కబ్జా చేశారు
- భూకబ్జాలకు పాల్పడ్డారు 90 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు

2లో..



**హైదరాబాద్, సెప్టెంబర్ 16, అనంతజనశక్తి న్యూస్**

బీఆర్ఎస్ హయాంలో పెద్దఎత్తున భూకబ్జాలు జరిగాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. కరీంనగర్‌లో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు లక్షల ఎకరాల భూములను కబ్జా చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ భూకబ్జాలపై తాను మాట్లాడిన సమయంలో తన తలను ఆరు ముక్కలు నరుకుతానని కేసీఆర్ అన్నారని గుర్తుచేశారు.

## షహజాద్ భట్టి నెట్‌వర్క్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటన

- వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం
- ఉపా చట్టం కింద ఉగ్రవాద సంస్థల జాబితాలోకి..

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16, అనంత జనశక్తి న్యూస్**

షహజాద్ భట్టి నెట్‌వర్క్‌ను కేంద్రం ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. ఉపా చట్టం కింద ఎస్‌బీఎన్‌ను ఉగ్రవాద సంస్థల జాబితాలోకి హోం శాఖ చేర్చింది.

2లో..

## అమెరికా ఒత్తిడికి కేంద్రం లొంగిపోయింది

### కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే



2లో..

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16, అనంతజనశక్తి న్యూస్**

అమెరికా ఒత్తిడికి కేంద్ర ప్రభుత్వం లొంగిపోయిందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎక్స్‌లో విమర్శించారు. భారతీయ వస్తువులపై 100 శాతం టారిఫ్ విధించాలనుకుంటున్న అమెరికా ఒత్తిడిని అడ్డుకోవడంలో దేశ విదేశాంగ, వాణిజ్య విధానాలు ఘోరంగా విఫలమయ్యాయని ఆయన వ్యాఖ్యానించారు. అమెరికా 100 శాతం సుంకాల విధానం అమల్లోకి వస్తే, భారత్‌కు తీవ్రంగా నష్టం తప్పదమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

## సీఎం చెప్పిన భూముల చిట్టాపై నిజాలు నిగ్గు తేలాలి



2లో..

- తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కవిత
- ప్రభుత్వ నిబంధనలకు మించి..
- ఒక్క గజం భూమి నాకు ఎక్కువ లేదు

**హైదరాబాద్, సెప్టెంబర్ 16, అనంతజనశక్తి న్యూస్**

శాసనసభలో 22ఏ భూములపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెప్పారని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కవిత విమర్శించారు. సిద్ధిపేట జిల్లాలో కవిత, ఆమె భర్త పేరు మీద 37.26 ఎకరాల భూమి ఉందని అసెంబ్లీలో సీఎం తెలిపారు. ముఖ్యమంత్రి ప్రకటనపై 'ఎక్స్' వేదికగా కవిత స్పందించారు.

## డ్యూటీ చేయకుండానే నెలకు రూ.70 వేల జీతం

- కర్ణాటక ఎమ్మెల్యే మేనకోడలి 'నమ్మ క్లినిక్' స్కామ్
- మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తూ..
- విధులకు హాజరు కాకుండానే శాలరీ

2లో..

## 'సీమ'పై వర్షాభావం పిడుగు!

- 25 ఏళ్లలో ఎన్నో కుండపోతలు
- 400 మి.మీ. దాటిన వర్షా లూ నమోదు
- 2026లో అసాధారణ స్థితి
- సాధారణ వర్షా లు కరవు
- భూగర్భం అడుగంటుతున్నా సెప్టెంబర్‌పైనే ఆశలు

7లో..



(పులివారి హరిప్రసాద్)

**అనంతపురం, సెప్టెంబర్ 16:**

ఒక్కరోజులో 200, 250, 300... చివరకు 400 మిల్లీమీటర్లకు పైగా వర్షం కురిసిన సందర్భాలను రాయలసీమ ఎన్నిసార్లు చూసింది. కానీ ఈ ఏడాది మాత్రం భిన్నమైన వాతావరణ పరిస్థితి నెలకొంది. భారీ వర్షాలు లేకపోవడమే కాదు... విస్తృతంగా, తరచుగా, విడతలవారీగా కురవాల్సిన వర్షాలు కూడా ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రాయలసీమలో తీవ్ర వర్షాభావ పరిస్థితి కనిపిస్తోంది.

## రెడ్ బుక్ గవర్నెన్స్ గ్లోబల్ అయ్యింది

- మాజీ సీఎం జగన్ విమర్శలు
- ఎఫ్‌బీఐగా పోజులు
- పోలీసుల నకిలీ గుర్తింపు ప్రజాస్వామ్యానికి ముప్పు
- చంద్రబాబు ఇది పోలీసింగ్ నా?

2లో..





## బీఆర్ఎస్ హయాంలో పెద్దఎత్తున భూకబ్జాలు

(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్‌ను మెడలు వంచి బయటకు గుంజుకొచ్చింది తానేనని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం తమకు రావాల్సి ఉండగా తృటిలో కాంగ్రెస్ చేతికి వెళ్లిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన భూకబ్జాలను బయటపెట్టడానికి రేవంత్ రెడ్డికి వెయ్యి రోజులు పట్టిందా? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి, కేసీఆర్ మధ్య డీల్ కుదరలేదా? ఏఐసీసీకి ఈఎంఐ కట్టడం ఇబ్బందిగా ఉందా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. ప్రతి అసెంబ్లీ సమావేశంలోనూ బీఆర్ఎస్‌కు రేవంత్ రెడ్డి ఆఫర్లు ఇస్తున్నారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌లో పనిచేసిన సుమారు 90 మంది ఎమ్మెల్యేలు భూకబ్జాలకు పాల్పడ్డారని బండి సంజయ్ ఆరోపించారు. డ్రగ్స్, ఈఫార్ములా, ఫోన్ ట్యాపింగ్, ఫామ్‌హౌస్ కేసుల దర్యాప్తు ఏమైందని ప్రశ్నించారు. ఈ కేసులపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ ఏం చేస్తోందో చెప్పాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

## సీఎం చెప్పిన భూముల చిట్టాపై నిజాలు నిగ్గు తేలాలి




(మొదటి పేజీ తరువాయి)

“సీఎం ఈ రోజు అసెంబ్లీలో ప్రస్తావించిన నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి సహా అందరి భూములపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించి నిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేస్తున్నా. నా కుటుంబానికి ఎక్కడో భూములు ఉన్నట్టు సీఎం చెప్పారు. ప్రభుత్వ నిబంధనలకు మించి ఒక్క గజం భూమి నాకు ఎక్కువగా ఉన్నా... ఎన్నికల అఫిడవిట్ లో పేర్కొన్న దానికన్నా గజం భూమి అదనంగా ఉన్నా... ప్రభుత్వానికే సరెండర్ చేస్తానని మరోమారు స్పష్టం చేస్తున్నా” అని కవిత తెలిపారు.

## అమెరికా ఒత్తిడికి కేంద్రం లొంగిపోయింది



(మొదటి పేజీ తరువాయి)

ఔషధాలు, వస్త్రాలు, ఇంజినీరింగ్ గూడ్స్, రసాయనాలు, ఆటోమొబైల్ విడిభాగాలు, నగలు, ఎలక్ట్రానిక్ వస్తువులపై ఆ సుంకాల ప్రభావం తీవ్రంగా పడవచ్చన్నారు. మొదట 25%, తర్వాత 50%, ఇప్పుడు 100% సుంకాల హెచ్చరిక వచ్చిందన్నారు.

**మన రైతుల ప్రయోజనాలు తాకట్టు పెట్టారు**

దేశ వ్యవసాయ రంగంలో అమెరికాను ఆహ్వానించే ట్రేడ్ ఫ్రేమ్‌వర్క్‌కు మోదీ ప్రభుత్వం ఒప్పుకుందని, దీంతో మన దేశ రైతుల ప్రయోజనాలను తాకట్టు పెట్టారని ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. మన దేశ వ్యవసాయ రంగంలో అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు ఆధిపత్యం చెలాయించే పరిస్థితి తెచ్చారన్నారు. ఐదేళ్లలో 500 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.48 లక్షల కోట్లు) విలువైన అమెరికా వస్తువులు కొనాల్సిన పరిస్థితి వచ్చిందని దుయ్యబట్టారు. ఇక యూపీఐ చెల్లింపులపై చార్జీలు వసూలు చేయాలన్న నిర్ణయం కూడా ప్రభుత్వ లొంగుబాటుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. సుంకాలు, వాణిజ్యం, హెచ్ 1బీ వీసాలు, డిజిటల్ చెల్లింపుల్లో అమెరికా ఒత్తిడి రోజురోజుకు పెరుగుతోందని ఖర్గే వ్యాఖ్యానించారు. ‘టారిఫ్‌లు, వాణిజ్యం, హెచ్ 1బీ ఇమిగ్రేష్, వీసాలు, డిజిటల్ పేమెంట్లు ఇలా అన్ని విషయాల్లో భారత్‌పై అమెరికా ఒత్తిడి బాగా పెరిగింది. దేశాన్ని అబ్ కీ బార్ ట్రంప్ సర్కారు నియంత్రిస్తోంది. కేంద్ర ప్రభుత్వం చేతగానితనం వల్ల 140 కోట్ల మంది భారతీయులు బాధపడాల్సి వస్తోంది. హౌడీ మోదీజీ..! మీరు ఇలా లొంగిపోతూనే ఉండండి’ అని ఖర్గే విమర్శించారు.

## రెడ్ బుక్ గవర్నెన్స్ గ్లోబల్ అయ్యింది

**అమరావతి, సెప్టెంబర్ 16, అనంతజనశక్తి న్యూస్**

చంద్రబాబు హయాంలో రెడ్ బుక్ గవర్నెన్స్ గ్లోబల్ అయ్యిందంటూ మాజీ సీఎం వైఎస్ జగన్ ఫైర్ అయ్యారు. ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా పోజులిస్తున్నారంటూ విమర్శలు గుప్పించారు. పోలీసుల నకిలీ గుర్తింపు ప్రజాస్వామ్యానికి నిజమైన ముప్పు అంటూ ఎక్స్‌లో వైఎస్ జగన్ ట్వీట్ చేశారు.

చంద్రబాబు ఇది పోలీసింగ్ నా? రాజకీయ కక్ష సాధింపునకు రాష్ట్ర ప్రాయోజిత మోసమా? ఎక్స్‌లో పోస్టులను తొలగించాలని కోరుతూ.. ఏపీ పోలీసులు తమను అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌గా అభ్యర్థన పంపటం దారుణమన్నారు. ఈ చర్య రాష్ట్రం, దేశ ప్రతిష్ఠను దెబ్బతీస్తోందని పేర్కొన్నారు. టేక్‌డౌన్ రిక్వెస్ట్ అధికారిక ఏపీ పోలీస్ ఈమెయిల్ నుంచే వచ్చిందని ఎక్స్ ధృవీకరించింది. అయినా.. ఆ అధికారి పంపిన సంస్థ పేరులో మాత్రం అని పేర్కొన్నారని గుర్తు చేశారు. ఈ టేక్‌డౌన్ రిక్వెస్ట్‌ను ఎవరు ఆదేశించారు? గుర్తింపును ఎందుకు దుర్వినియోగం చేశారు? ఎక్స్‌ను తప్పుదోవ పట్టించి.. మీ ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేసేందుకు ఇది ఉద్దేశపూర్వక ప్రయత్నమా? నెరవేరని సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలపై ప్రశ్నలు అడిగినందుకా? డీఎస్సీ స్కామ్‌పై ప్రశ్నించినందుకా? అమరావతి దోపిడీపై ప్రశ్నించినందుకా? రాష్ట్ర అప్పులు, పాలనా వైఫల్యాలు, వేధింపులపై ప్రశ్నించినందుకా? అని జగన్ ప్రశ్నించారు.

పోలీస్ యూనిఫాం చట్టాన్ని రక్షించేందుకు ఉండాలని.. రాజకీయ సెన్సార్‌షిప్ అమలు చేసేందుకు కాదని మాజీ సీఎం జగన్ అన్నారు.. “రాజకీయ టేక్‌డౌన్ ఆపరేషన్‌లో విదేశీ దర్యాప్తు సంస్థ పేరును లాగడం ద్వారా ఆంధ్రప్రదేశ్, పోలీస్ వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీశారు. విమర్శకుల గొంతులను అణచివేసేందుకు ఖర్చు చేసే శక్తిని.. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల అమలుపై పెట్టాలి. కరవు పరిస్థితుల్లో రైతులకు అండగా నిలవాలి.

# తిరుమలలో పవిత్రతే ప్రధానం

(మొదటి పేజీ తరువాయి)

ఉత్పత్తి అయ్యే వ్యర్థాలు సర్క్యులర్ ఎకానమీకి వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని చంద్రబాబు అన్నారు. పర్యావరణాన్ని కాపాడుకునేలా జీరో వేస్ట్ విధానం అమలు కావాలన్నారు. ఓ మోడల్ గా తిరుమల అభివృద్ధి కావాలని చెప్పారు. దేశంలోని అన్ని దేవాలయాల కంటే తిరుమల తిరుపతి అత్యంత పరిశుభ్రంగా చక్కటి నిర్వహణలో ఉందని కొనియాడారు.

'2300 ఏళ్ల నుంచి ఉన్న ఈ దేవాలయం ప్రపంచంలోనే అత్యుత్తమ దేవాలయంగా ఉండాలి. అత్యంత సేవాభావంతో నిర్వహిస్తున్నాం కాబట్టే దేశవ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా భక్తులు ఇక్కడికి వస్తున్నారు. టీటీడీలో ఎస్వీ అన్నదానం ట్రస్ట్‌కు దాదాపు రూ.3,165 కోట్లు కార్పస్ ఫండ్ ఉంది. భవిష్యత్తులో అన్నప్రసాదాలు మరింత మెరుగ్గా అందించేలా చర్యలు తీసుకోవాలి. ప్రాణదానం ట్రస్ట్ క్రింద రోగులకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందాలి. స్విమ్స్, బర్డ్, రుయా, సెంట్రల్ హాస్పెటల్, కార్డియాలజీ ఆసుపత్రులను అనుసంధానం చేసే దిశగా అధికారులకు సూచించాం. వీటితో పాటు మానవ సేవయే మాధవ సేవ అన్నట్లు శ్రీవారి వైద్య సేవలను విరివిగా అందించేలా పటిష్ట చర్యలు చేపట్టాం.' అని చంద్రబాబు చెప్పారు.

శ్రీవారి సేవలో కల్చరల్ ప్రోగ్రాంలు, కల్చరల్ వింగ్‌లను ఏర్పాటు చేయమన్నామని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. టీటీడీ విద్యాసంస్థల్లో ముఖ్యంగా పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ డెవలప్మెంట్ ఏర్పాటు చేసి ఉపాధికి శిక్షణ ఇస్తున్నట్టుగా చెప్పారు. వృక్ష



గోవిందం కార్యక్రమంలో భాగంగా చెట్లు నాటే కార్యక్రమాన్ని రూపొందించామన్నామని తెలిపారు.

తిరుపతిని ఆధ్యాత్మిక హబ్ గా మార్చేలా ప్రణాళికలు చేస్తున్నట్టుగా సీఎం చంద్రబాబు ప్రకటించారు. దాదాపు 5 వేల ఆలయాలను నిర్మాణం, ఉన్న ఆలయాలకు అవసరమైన చోట పునర్ నిర్మాణం చేసేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించామన్నారు. శిష్ట రక్షణ దుష్ట శిక్షణ అనేది స్వామివారే చూసుకుంటారన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో ఉన్న 65 ఆలయాలను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయమన్నామని, అదేవిధంగా శ్రీవారి ఆస్తులు, ఆభరణాలు, బంగారం, నిధులు, భూములు.. ఇలా అన్ని వివరాలు ఆన్లైన్లో ఉంచేలా చర్యలకు ఆదేశించామన్నారు.

'మారిషస్, న్యూజిలాండ్ లాంటి దేశాల్లో శ్రీవారి ఆలయాలు నిర్మించాలని అడుగుతున్నారు. దీని గురించి కూడా ఆలోచన చేస్తున్నాం. దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ శ్రీవారి ఆలయాలు నిర్మించాలని కోరుతున్నారు వచ్చే ఏడాదికి సోమశిలకు, ఆపై కండలేరు బాలాజి సాగర్‌కు నీరు తీసుకొస్తాం. వచ్చే ఏడాదికి కల్యాణి డ్యామ్‌కు కూడా నీటిని తరలిస్తాం. ఓ మారు తీవ్ర వర్షాభావం కారణంగా దేవాలయం మూసివేయాలన్న ప్రతిపాదన వచ్చింది. కల్యాణి డ్యామ్ నుంచి పైపులైన్‌ను వంద రోజుల్లో వేసి తిరుమలకు నీరు తరలించాం.' అని చంద్రబాబు గుర్తుచేశారు.

శ్రీవారి భక్తుడిగా పనిచేస్తూ.. అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. తిరుమలలో రెండో రోజు పర్యటన సందర్భంగా ఆయన మాట్లాడారు. తాను 1999లో ప్రారంభించిన మ్యూజియం.. ఇవాళ ఆధునికీకరించినట్లు చెప్పారు. వేంకటేశ్వరస్వామి చరిత్ర అందరికీ అర్థమయ్యేలా మ్యూజియం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలకు అండగా నిలిచిన ట్రస్టుకు అభినందనలు తెలిపారు.

“రాబోయే ఐదేళ్లూ.. నిర్వహణ బాధ్యత ట్రస్టుకే అప్పగిస్తున్నాం. ప్రతి భక్తుడికి భద్రత ఇచ్చేందుకు ఎల్ఐసీ తరఫున రూ.2 లక్షల బీమా అందిస్తున్నాం. ఆధార్ ఆధారిత పేపర్‌లెస్ క్లెయిమ్ తీసుకొచ్చాం. తిరుమలలో పవిత్ర భావం ఉండాలి. రాజకీయాలకు వేదిక కాకూడదు. తిరుమలలో వేంకటేశ్వరస్వామి స్మరణ తప్ప మరొకటి వినపడకూడదు. ఇక్కడికి వచ్చే భక్తుడు ఏ విషయంలోనూ ఇబ్బంది పడకూడదు.

ఇవాళ కొత్తగా 32 ఈవీ బస్సులు ప్రారంభించాం. రిలయన్స్ 25, భారత్ బయోటెక్ సంస్థ ఏడు బస్సులు ఇచ్చింది. సేవాభావంతో ముందుకొచ్చే ప్రతి ఒక్కరికి అవకాశం ఉంటుంది. ఇప్పటికే 12 లక్షల మంది శ్రీవారి సేవకులుగా నమోదు చేసుకున్నారు. వీరిలో వైద్య, విద్యా సేవకులు వస్తున్నారు” అని చంద్రబాబు తెలిపారు.

# పోలీస్ శాఖలో ఉద్యోగ ప్రకటన

(మొదటి పేజీ తరువాయి)

పోస్టుల వివరాలు, ఖాళీలు

స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్స్ (సివిల్ పురుషులు/మహిళలు): 542 పోస్టులు

స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్స్ (AR పురుషులు/మహిళలు): 285 పోస్టులు

ఫైర్‌మెన్ (SDR & ఫైర్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్ పురుషులు): 158 పోస్టులు

వార్డర్లు (జైళ్ల శాఖ పురుషులు): 150 పోస్టులు

వార్డర్లు (జైళ్ల శాఖ మహిళలు): 21 పోస్టులు

**అర్హతలు, వయోపరిమితి**

జూలై 1, 2026 నాటికి అభ్యర్థులు ఇంటర్మీడియట్ లేదా దానికి సమానమైన పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. SC, ST అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు హాజరై ఉంటే సరిపోతుంది. అభ్యర్థులకు తగిన శారీరక ప్రమాణాలు మరియు వైద్య ప్రమాణాలు (రెండు కళ్లలోనూ 6/6 దృష్టి) ఉండాలి.

పోస్ట్ కోడ్‌లు 21, 22: జనరల్ అభ్యర్థుల వయస్సు 18 నుండి 24 సంవత్సరాల మధ్య ఉండాలి (02072002 నుండి 01072008 మధ్య జన్మించి ఉండాలి).

పోస్ట్ కోడ్‌లు 42, 53, 54 (మరియు హోం గార్డులు): వయస్సు 18 నుండి 32 సంవత్సరాల మధ్య ఉండాలి (02071994 నుండి 01072008 మధ్య జన్మించి ఉండాలి).

EWS, BC, SC, ST అభ్యర్థులకు 5 సంవత్సరాల వరకు వయోసడలింపు ఉంటుంది. అలాగే మాజీ సైనికులు, ప్రభుత్వ ఉద్యోగులు, NCC ఇన్‌స్ట్రక్టర్లు, విడో/విడాకులు తీసుకున్న మహిళలకు నిబంధనల ప్రకారం వయోసడలింపు వర్తిస్తుంది.

**జీతం, ఎంపిక విధానం**

జీతం నెలకు రూ. 25,220 నుండి రూ. 80,910 వరకు ఉంటుంది. పోస్టుల ఎంపిక ప్రక్రియ ఐదు దశల్లో జరుగుతుంది. ప్రాథమిక రాత పరీక్ష (ప్రైమరీ రిటన్ టెస్ట్) 200 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో 3 గంటల పాటు జరుగుతుంది. శారీరక కొలతల పరీక్ష (PMT) ఎత్తు, ఛాతీ (పురుషులకు), బరువు (మహిళలకు) సరిచూస్తారు. శారీరక సామర్థ్య పరీక్ష 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పోటీలు ఉంటాయి.

ఫైనల్ రాత పరీక్షలో ఇంగ్లీష్, అర్థమెటిక్, రీజనింగ్, జనరల్ సైన్స్, హిస్టరీ, జియోగ్రఫీ, పాలిటీ, ఎకానమీ, కరెంట్ అఫైర్స్ అంశాలపై 200 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఉంటాయి. ఫైనల్ రాత పరీక్షలో వచ్చిన మార్కుల ప్రతిభ ఆధారంగా తుది ఎంపిక జరుగుతుంది.

**దరఖాస్తు రుసుము**

ఓసీ, ఈడబ్ల్యూఎస్, బీసీ అభ్యర్థులకు (ఏపీ లోకల్/నాన్‌లోకల్) రూ.300, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు (ఏపీ లోకల్స్) రూ. 150గా దరఖాస్తు రుసుము ఉంది. అధికారిక వెబ్‌సైట్ https://slprb.ap.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. మొదటి దశ దరఖాస్తు పూర్తి చేసి ఫీజు చెల్లించాలి. ప్రాథమిక పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు PMT/PETకి హాజరయ్యే ముందు రెండో దశ దరఖాస్తు సమాచారాన్ని, ధృవీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

# షహజాద్ భట్టి నెట్‌వర్క్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటన

(మొదటి పేజీ తరువాయి)

యూఏపీఏ చట్టంలోని సెక్షన్ 35(1)(a) కింద ఈ చర్య తీసుకుంది. యూఏపీఏ చట్టంలోని మొదటి షెడ్యూల్‌లో 46వ సంస్థగా షహజాద్ భట్టి నెట్‌వర్క్ చేరింది. ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు ఎస్‌బీఎన్ పాల్పడుతున్నట్లు కేంద్రం ఆరోపించింది. యువతను ఉగ్రవాద కార్యకలాపాల వైపు ఆకర్షిస్తోందని పేర్కొంది. ఇతర నిషేధిత సంస్థలతో కూడా ఎస్‌బీఎన్‌కు సంబంధాలున్నాయని కేంద్రం వెల్లడించింది. హింసాత్మక కార్యకలాపాలతో ఎస్‌బీఎన్ ప్రజాశాంతికి విఘాతం కలిగించే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించింది. సోషల్ మీడియా, డిజిటల్ కమ్యూనికేషన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా రెచ్చగొట్టే సందేశాలు వ్యాప్తి చేస్తోందని కూడా పేర్కొంది.

షహజాద్ భట్టి నెట్‌వర్క్‌పై ఇప్పటికే పలు రాష్ట్రాల్లో అనేక క్రిమినల్ కేసులు నమోదయ్యాయని హోంశాఖ పేర్కొంది. యూఏపీఏతో పాటు ఆయుధాల చట్టం, పేలుడు పదార్థాల చట్టం కింద కేసులు నమోదయ్యాయని పేర్కొంది. వలసల చట్టం కింద కూడా కేసులు నమోదైనట్టు పేర్కొంది. గతనెలలోనే ఎస్‌బీఎన్‌పై 14 రాష్ట్రాల్లో భద్రతా సంస్థలు భారీ ఆపరేషన్‌ను నిర్వహించాయి. సంస్థకు చెందిన 253 మందిని అదుపులోకి తీసుకున్నాయి. ఎస్‌బీఎన్‌పై 80కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని కేంద్రం పేర్కొంది. నిందితుల నుంచి ఐఈడీలు, పిస్టళ్లు,




లైవ్ కార్ట్రిడ్జ్‌లు, గ్రెనేడ్లు స్వాధీనం చేసుకున్నామని పేర్కొంది. ఇటీవల బ్రిక్స్ సదస్సు సందర్భంగా ఎస్‌బీఎన్ నుంచి ముప్పు ఉండవచ్చని నిఘా వర్గాలు హెచ్చరికలు కూడా చేశాయి. ఈ నేపథ్యంలోనే కేంద్రం ఎస్‌బీఎన్‌ను ఉగ్రవాద సంస్థల జాబితాలోకి చేర్చింది.

# డ్యూటీ చేయకుండానే నెలకు రూ.70 వేల జీతం

**బెంగళూరు, సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్**

కర్ణాటకలోని బాగల్‌కోట్ నమ్మ క్లినిక్లో పని చేస్తున్న ఓ మెడికల్ ఆఫీసర్ తీవ్ర అవినీతి, అక్రమాల ఆరోపణల్లో చిక్కుకున్నారు. ప్రైవేట్ మెడికల్ కాలేజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యను అభ్యసిస్తూనే.. మరోవైపు ప్రభుత్వ నమ్మ క్లినిక్ నుంచి నెలకు రూ. 70,000 పైగా వేతనాన్ని తీసుకుంటున్నట్లు ఆధారాలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా సదరు వైద్యురాలు బాగల్‌కోట్ ఎమ్మెల్యే ఉమేష్ మేటి మేనకోడలు డాక్టర్ అంకిత యార్గల్ అని తెలియడంతో ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. విధుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహించడం, ఒకే సమయంలో రెండింటి ద్వారా ప్రయోజనం పొందుతున్నారన్న ఆరోపణలపై ప్రస్తుతం అధికార యంత్రాంగం విచారణ ప్రారంభించింది.

**విధులకు హాజరుకాకుండానే నెల నెలా రూ.70 వేల జీతం!**

డాక్టర్ అంకిత యార్గల్ బాగల్‌కోట్ వాంబే కాలనీలోని నమ్మ క్లినిక్‌లో పని చేస్తున్నారు. ఇందుకోసం ఆమెకు నెలకు రూ.70 వేలకు పైగా జీతం అందుతోంది. అయితే పేరుకే ఆమె అక్కడ పని చేస్తుండగా.. ఒక్కరోజు కూడా ఆమె అక్కడకు వచ్చి విధులు నిర్వహించిన పాపాన పోలేదు. ముఖ్యంగా ఈ ఏడాది మార్చి 3వ తేదీ నుంచి సెప్టెంబర్ వరకు ఆమె ఒక్క రోజు కూడా క్లినిక్‌కు హాజరు కాలేదని అధికారులు జారీ చేసిన నోటీసు ద్వారా తెలుస్తోంది. ఒక మెడికల్ ఆఫీసర్ లేకుండానే క్లినిక్ కొనసాగడం వల్ల స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. అయినప్పటికీ.. ఎస్ఎన్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ నుంచి అనుమతి పొంది ఒక ప్రైవేట్ కాలేజీలో పీజీ చదువుకుంటూనే, క్లినిక్ నుంచి రెగ్యులర్ జీతం పొందుతున్నారని అధికారులు వెల్లడించారు.

విచారణకు గైర్హాజరు.. సీఈవో తీవ్ర ఆగ్రహం!

ఈ అక్రమాలపై విచారణ చేపట్టేందుకు బాగల్‌కోట్ జిల్లా పంచాయతీ సీఈవో గజానన్ బలే ఆదేశాలు జారీ చేశారు. అయితే సీఈవో ఎదుట హాజరు కావాల్సిన విచారణకు డాక్టర్ అంకిత డుమ్మా కొట్టారు. దీనిపై తీవ్రంగా స్పందించిన జిల్లా పంచాయతీ సీఈవో.. సెప్టెంబర్ 18వ తేదీన ఉదయం 10 గంటలకు జిల్లా పంచాయతీ కార్యాలయంలోని రూమ్ నంబర్ 11లో జరగబోయే విచారణకు తప్పకుండా హాజరు కావాలని ఆదేశిస్తూ మరో నోటీసు జారీ చేశారు. ఈసారి కూడా విచారణకు రాకపోతే ఏకపక్షంగా నిర్ణయం తీసుకుంటామని స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు.

కర్ణాటక మెడికల్ కౌన్సిల్ ఫిర్యాదుకు ఆదేశాలు.. రికవరీకి చర్యలు!

కర్ణాటక ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో పనిచేసే రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ల నిబంధనలకు ఇది తీవ్ర విరుద్ధమని అధికారులు తెలిపారు. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎమ్‌సీ) ప్రొఫెషనల్ ఎథికల్ కోడ్‌ను ఉల్లంఘించినందున ఆమెపై తీవ్ర క్రమశిక్షణా చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి. వృత్తిపరమైన దుష్ప్రవర్తన కింద ఈ విషయాన్ని 'కర్ణాటక మెడికల్ కౌన్సిల్' (కేఎమ్‌సీ), ఎన్ఎమ్‌సికి సిఫార్సు చేస్తామని సీఈవో హెచ్చరించారు. అంతేకాకుండా విధులకు హాజరు కాకుండా అక్రమంగా పొందిన మొత్తం వేతనాన్ని



ప్రభుత్వ నిబంధనల ప్రకారం రికవరీ చేస్తామని పేర్కొన్నారు. ఈ వివాదం సంచలనం సృష్టించడంతో జిల్లా వైద్యాధికారి (డీహెచ్ఓ) రాజ్‌కుమార్ యార్గల్ ఆమెను తక్షణమే విధుల నుంచి తొలగించారు.

# రూ.11 ఐవీ సెట్.. రూ.325కి అమ్మకం

**- ఆసుపత్రుల అడ్డగోలు దోపిడీ**
**- ఎఫ్‌డీఏ నివేదికలో విస్తుపోయే వాస్తవాలు**
**- జోక్యం చేసుకోవాలని కోరుతూ ..**
**- తుకారం ముండే లేఖ రాయడం సంచలనం**

**బెంగళూరు, సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్**

రూ. 11 విలువైన ఐవీ సెట్‌ను రూ. 325కి విక్రయిస్తూ దాదాపు 2,800 శాతానికి పైగా లాభం దండుకోవడం.. రూ. 6.75ల సిరంజిలను రూ. 57.20కి విక్రయిస్తూ 747 శాతం మార్జిన్ వేయడం.. రూ. 40 విలువైన నెబ్యులైజర్ మాస్క్‌ను ఏకంగా రూ. 715కి విక్రయించడం.. ఇవన్నీ మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్ పరిధిలోని 'ప్రైస్ మోనిటరింగ్ రీసోర్స్ యూనిట్' నిర్వహించిన మార్కెట్ సర్వేలో వెలుగుచూసిన దిగ్భ్రాంతికర విషయాలు. ఆసుపత్రుల్లో చేరిన రోగుల నుంచి వైద్య పరికరాలు, కన్స్యూమబుల్స్ పేరిట ఏ స్థాయిలో లాభార్జన జరుగుతుందో ఈ నివేదిక స్పష్టం చేసింది.

ఐవీ సెట్లు : హర్యానాకు చెందిన మెడిప్లస్ సంస్థ తయారు చేసిన 'మెడిఫ్యూజన్ ఐవీ సెట్' కొనుగోలు ధర రూ. 11.05 కాగా, దానికి MRP రూ. 325గా ముద్రించి ఏకంగా 2,841 శాతం మార్జిన్ దండుకుంటున్నారు.

సిరంజీలు : లైఫ్‌లాంగ్ మెడిటెక్ సంస్థ తయారు చేసిన 10 ml సిరంజీ కొనుగోలు ధర రూ. 6.75 కాగా, దాన్ని రోగులకు రూ. 57.20కి విక్రయిస్తున్నారు.

కెన్యులా, మాస్క్‌లు: రూ. 22.50 విలువైన ఐవీ కెన్యులాను రూ. 424కి, అలాగే రూ. 45 విలువైన నెబ్యులైజర్ మాస్క్ కిట్‌ను రూ. 652కి విక్రయిస్తున్నారు.

ఇతర పరికరాలు: విన్‌జో హెల్త్‌కేర్, రోమ్‌సన్, రిబ్బెల్ వంటి సంస్థలు తయారు చేసే కథేటర్లు, నీడిల్స్ కొనుగోలు ధర కంటే 10 నుంచి 19 రెట్లు ఎక్కువ ధరకు అమ్ముడుపోతున్నాయి.

కేంద్రానికి తుకారం ముండే లేఖ

ఈ అడ్డగోలు దోపిడీని మహారాష్ట్ర ఎఫ్‌డీఏ కమిషనర్ తుకారామ్ ముండే తీవ్రంగా ఖండించారు. తయారీదారులు తమ ఉత్పత్తి, రవాణా, మార్కెటింగ్ ఖర్చులు, లాభాలను కలిపిన తర్వాతే ప్రాథమిక కొనుగోలు ధర నిర్ణయమవుతుందని, దానిపై మళ్ల ఇన్ని రెట్లు ధరలు పెంచడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఆసుపత్రి అత్యవసర చికిత్సలో ఉండే రోగులకు ఈ పరికరాల ధరలపై బేరమాడే అవకాశం ఉండదని, అందుకే డ్రగ్స్ ఆర్డర్ (DPCO) 2013 పరిధిలోకి ఈ మెడికల్ పరికరాలను తీసుకొచ్చి ధరలపై పరిమితి (Price Cap) విధించాలని కోరుతూ కేంద్ర విలేఖర రసాయనాలు, ఫార్మాస్యూటికల్స్ శాఖ కార్యదర్శికి ఆయన లేఖ రాశారు. విధానపరమైన చర్యలు తీసుకోవడం ద్వారానే ప్రజలపై పడుతున్న ఈ తీవ్రమైన ఆర్థిక భారాన్ని తగ్గించవచ్చని స్పష్టం చేశారు.ఆసుపత్రుల అడ్డగోలు దోపిడీ.. రూ.11 ఐవీ సెట్ రూ.325కి అమ్మకం.. ఎఫ్‌డీఏ నివేదికలో విస్తుపోయే వాస్తవాలు ఆసుపత్రుల అడ్డగోలు దోపిడీ.. రూ.11 ఐవీ సెట్ రూ.325కి అమ్మకం.. ఎఫ్‌డీఏ నివేదికలో విస్తుపోయే వాస్తవాలుఆసుపత్రుల అడ్డగోలు దోపిడీ.. రూ.11 ఐవీ సెట్ రూ.325కి అమ్మకం.. ఎఫ్‌డీఏ నివేదికలో విస్తుపోయే వాస్తవాలుఆసుపత్రుల అడ్డగోలు దోపిడీ.. రూ.11 ఐవీ సెట్ రూ.325కి అమ్మకం.. ఎఫ్‌డీఏ నివేదికలో విస్తుపోయే వాస్తవాలు బయటపడ్డాయి.

# తయారీకి రూ.11.. బిల్లులో రూ.325: ఆసుపత్రుల్లో ధరలపై తుకారాం ముండే పోస్ట్ వైరల్



ఆహార భద్రత విషయంలో కఠిన నిబంధనలు అమలు చేస్తూ ఇటీవల వార్తల్లో నిలిచారు మహారాష్ట్ర ఎఫ్‌డీఏ చీఫ్ తుకారాం ముండే. తాజాగా ఆసుపత్రుల్లో ఔషధాలు, ఇతర ఉత్పత్తుల ధరల్లో భారీ వ్యత్యాసాల పై ఆయన చేసిన పోస్ట్ నెట్టింట చర్చనీయాంశమైంది. చికిత్స సమయంలో రోగులకు అందించే కొన్ని ఔషధాల తయారీ ఖర్చులు నామమాత్రంగా ఉంటున్నప్పటికీ.. వాటిని చాలా రెట్లు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని ఆయన వెల్లడించారు. దీని వల్ల సామాన్య పౌరులపై అధిక భారం పడుతోందని పేర్కొన్నారు. మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్) ఆధ్వర్యంలోని స్టేట్ ప్రైస్ మానిటరింగ్ రిసోర్స్ యూనిట్ ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ఔషధాల ధరలపై సర్వే నిర్వహించింది. ఇందులో బయటపడిన కొన్ని వాస్తవాలను తుకారాం ముండే తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ''ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో రోగికి కొన్ని ఔషధాలు అందిస్తారు. వాటి తయారీ ధర ఎంత ఉంటుందో మనకు కనీస అవగాహన కూడా ఉండదు. ప్యాకెట్‌పై రేటు మాత్రమే కన్పిస్తుంది. అది అసలైందో.. మార్చిన ధరో తెలియదు. ఈ సమాచార లోపమే.. అసలైన ప్రజా ఆరోగ్య సమస్యగా మారుతోంది. ఇటీవల నిర్వహించిన సర్వేలో.. ఒక ఐవీ ఇన్‌ఫ్యూషన్ సెట్ తయారీ ధర రూ.11.05 అని తెలిసింది. కానీ, ప్యాకెట్‌పై ఎంఆర్‌పీ మాత్రం రూ.325 అని ఉంది. అంటే 2841శాతం అధిక ధరకు విక్రయిస్తున్నారు. ఇక, సిరంజీ తయారీ ధర రూ.6.75 అయితే.. రూ.57.20కి అమ్ముతున్నారు. మూత్రం పైపు అసలు ధర రూ.29.41 ఉంటే.. ఎంఆర్‌పీ రూ.310గా ఉంటోంది'' అని తుకారాం వెల్లడించారు.

''ఇవి ఎంపిక చేసుకుని కొనుగోలు చేసే వస్తువులు కాదు. చికిత్స సమయంలో వీటి ధరలను ఎవరూ ప్రశ్నించరు. సాధారణంగా ఈ ఎంఆర్‌పీని తయారీదారులు, డిస్ట్రిబ్యూటర్లే నిర్ణయిస్తారు. వారు సామాన్యులకు అందుబాటులో ఉండరు కదా..! అంతిమంగా ప్రజలే ఈ అధిక ఖర్చులు భరించాల్సి వస్తోంది'' అని తుకారం రాసుకొచ్చారు. ఈ ధరలు చాలా అహేతుకంగా, అన్యాయంగా ఉన్నాయని ఆయన అన్నారు. ఈ వ్యత్యాసాన్ని పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

స్టార్ హీరోలకు నోటీసులతో పాటు పలు ప్రముఖ ఫుడ్ అవుట్‌లెట్లను సీజ్ చేయడంతో తుకారం ముండే పేరు ఇటీవల దేశవ్యాప్తంగా మార్మోగింది. ఆయన ఆధ్వర్యంలోని ఎఫ్‌డీఏ తాజాగా ఓ ప్రముఖ కేఫ్ లైసెన్స్‌ను సస్పెండ్ చేసింది. అపరిశుభ్రత, ఆహార పదార్థాల్లో నాణ్యత లేని కారణంగా మొండేగర్ కేఫ్ లైసెన్స్‌ను నిలిపివేసింది.

# యూపీఐ ఛార్జీలపై ఆరోపణలు.. ఖండించిన కేంద్రం

యూపీఐ లావాదేవీలపై నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మర్చంట్ డిస్కౌంట్ రేటును విధించడంపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఇందులో ఎలాంటి విదేశీ ఒత్తిళ్లు లేవని.. తాము స్వతంత్రంగా తీసుకున్న నిర్ణయమని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఆర్థికంగా నిలదొక్కుకోగలిగే.. అందరికీ అందుబాటులో ఉండే డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను సృష్టించడమే ఈ కొత్త విధానం వెనుక ఉన్న లక్ష్యమని పేర్కొంది. స్వయం సమృద్ధి, సమ్మిళితమైన డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను అభివృద్ధి చేయడానికే ఈ ఆలోచన చేసినట్లు తెలిపింది.

రూ.2వేల్లోపు లావాదేవీలకు ఎలాంటి ఛార్జీలూ వర్తించబోవని, ఆపైబడిన నిర్దిష్ట లావాదేవీలకు మాత్రం 0.4 శాతం ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుందని ఎన్‌పీసీఐ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. అక్టోబర్ 15 నుంచి ఈ ఛార్జీలు అమల్లోకి రానున్నాయని వెల్లడించింది. అలాగే, వ్యక్తుల మధ్య జరిగే నగదు లావాదేవీలు (P2P), రూ.2000లోపు వ్యాపార చెల్లింపులు (P2M) ఎండీఆర్ పరిధిలోకి రావని స్పష్టంచేసింది.

ఈ ఛార్జీలపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే. భారత్‌లోని జీరో ఎండీఆర్ పాలసీని అమెరికా పేమెంట్ కంపెనీలు ఎప్పటినుంచో వ్యతిరేకిస్తున్నాయని, ఆ కంపెనీల ఆకాంక్షలకు అనుగుణంగా మోదీ ప్రభుత్వం ఈ మార్పు చేసిందని ఆ పార్టీ దుయ్యబట్టింది.

**ఇది యూపీఐ ట్యాక్స్: రాహుల్ గాంధీ**

కాగా.. ఈ ఛార్జీలపై కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు చేశారు. దీనిని 'యూపీఐ ట్యాక్స్'గా అభివర్ణించారు. ఈ మేరకు వీడియో సందేశం విడుదల చేశారు. అందులో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ గురించి ప్రస్తావించారు. ''మీరు ఏ పక్షంవైపు మొగ్గుచూపుతారని ఒకసారి ఇందిరాగాంధీకి ప్రశ్న ఎదురైంది. నేను ఎటువైపు మొగ్గుచూపను.. నిటారుగా ఉంటానని ఆమె సూటిగా బదులిచ్చారు. కానీ, మోదీజీ భిన్నమైన వైఖరి ప్రదర్శిస్తున్నారు. ఆయన ఏ పక్షం వైపు వెళ్లకుండా.. ట్రంప్ ముందు తలవంచుతున్నారు. ప్రతి భారతీయుడిపై యూపీఐ ట్యాక్స్ విధించి, ఆ డబ్బును అమెరికాకు ఇస్తున్నారు. మోదీజీ అమెరికా ముందు తలవంచ




డం ఆపండి. ధైర్యం తెచ్చుకొని నిటారుగా నిల్చోండి. యూపీఐ ట్యాక్స్‌ను వెనక్కి తీసుకోండి'' అని రాహుల్ విమర్శించారు.

ఇక, నోటా కు మోదీ కొత్త అర్థం చెప్పారని కాంగ్రెస్ విమర్శించింది. అని పేర్కొంది. ఈ దేశ వ్యతిరేక నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని, మునుపటిలానే యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు లేకుండా చూడాలని డిమాండ్ చేసింది.

# నిషేధిత ఉగ్రసంస్థగా షహజాద్ భట్టీ నెట్‌వర్క్

పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న షహజాబ్ భట్టీ నెట్‌వర్క్ ను 'చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం' (యూఏపీఏఉపా) కింద నిషేధిత ఉగ్రసంస్థగా కేంద్రం ప్రకటించింది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఈ విషయాన్ని వెల్లడించారు. ''ఈ నెట్‌వర్క్.. సరిహద్దుల గుండా ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడుతోంది. యువతను, నేరస్థులను ఉగ్రవాదం దిశగా ప్రేరేపిస్తోంది. భారత ప్రజాస్వామ్య వ్యవస్థను, మత సామరస్యాన్ని లక్ష్యంగా చేసుకుని.. విద్వేషపూరిత డిజిటల్ కంటెంట్ వ్యాప్తి చేస్తోంది'' అని అమిత్ షా తెలిపారు.

ప్రభుత్వ వివరాల ప్రకారం.. ఎస్‌బీఎన్ అనేది పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఒక ఉగ్రవాద గ్రూప్. భారత్‌లో పలు బాంబు దాడులు, హత్యల వెనుక దీని హస్తం ఉంది. పోలీస్, రక్షణ, మతపరమైన ప్రదేశాలను రెక్కీ చేసేందుకు, గూఢచర్యం కోసం సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు స్థానిక మధ్యవర్తులకు డబ్బు చెల్లిస్తోంది. దిల్లీ, పంజాబ్ ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, హరియాణా, ఉత్తరాఖండ్‌లో భట్టీపై కేసులు నమోదయ్యాయి. భారత్ నిషేధించిన ఉగ్రసంస్థల జాబితాలో ఎస్‌బీఎన్ 46వది. పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌కు చెందిన షహజాద్ భట్టీ.. దోపిడీలతో నేర ప్రపంచంలోకి అడుగుపెట్టాడు. తర్వాత అతడు పాక్ నుంచి యూఏఈకి మకాం మార్చాడు.





# దొంగతనానికి వచ్చి ఇలా ఇరుక్కుపోయాడు!

చాలాకాలంగా తాళం వేసి ఉన్న ఎన్‌ఆర్‌ఐ ఇంట్లో చోరీకి వెళ్లిన ఓ దొంగకు అనూహ్యమైన పరిస్థితి ఎదురైంది. రాత్రి వేళ.. భవనానికి ఉన్న ఇనుప గ్రిల్స్‌లో చిక్కుకుపోయాడు. ఎంత ప్రయత్నించినా లాభం లేకపోయింది. తెల్లారాక అతణ్ని గమనించిన స్థానికులు కర్రలతో దాడి చేశారు. గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన కిశోర్‌భాయ్ అమెరికాలో నివసిస్తున్నారు. స్థానిక రాజారాం నగర్ సొసైటీలో ఆయన భవనం చాలాకాలంగా ఖాళీగానే ఉంది. ఈ ఇంట్లో చోరీకి వచ్చిన దొంగ గ్రిల్స్‌లో ఇరుక్కుపోయిన దృశ్యాలను కొందరు వీడియోలు తీసి వైరల్ చేయడంతో పోలీసులు విచారణ చేపట్టారు. అమెరికాలో ఉంటున్న ఇంటి యజమాని కిశోర్‌భాయ్ తెలిపిన వివరాల మేరకు ఆ ఇంట్లో నగదు లేదా విలువైన వస్తువులు ఏమీ లేవని నగరంలోని కపోద్రా ఠాణా ఇన్‌స్పెక్టరు ఎం.ఆర్.సోలంకి తెలిపారు. పోలీసులు వీడియోలో కనిపిస్తున్న వ్యక్తి వివరాలను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు.

# భూవివాదం.. మోదీ స్కూల్‌మేట్‌కు దక్కిన ఊరట



ఏళ్ల నాటి భూవివాదంలో ప్రధాని మోదీ స్కూల్‌మేట్ అస్గర్‌అలీ వోహ్రాకు ఊరట లభించింది. ఈ వివాదం నుంచి వెనక్కి తగ్గిన స్థానిక భాజపా ఎమ్మెల్యే.. ప్రధాని స్నేహితుడికి భూమిని అప్పగించారు.

ఈ ఆస్తి వ్యవహారం గురించి అస్గర్ అలీ ఇటీవల మోదీ ని కలిసిన కొన్ని రోజులకే తాజా పరిణామం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..

మహారాష్ట్రలోని ఠాణె జిల్లాలో నివసిస్తోన్న 81 ఏళ్ల అస్గర్‌అలీ వోహ్రా.. గుజరాత్‌లోని భయందర్ ఈస్ట్‌లో గల నవ్‌ఘర్ రోడ్డులో ఉన్న సుమారు 2,810 చదరపు మీటర్ల భూమిని 1989లో కొనుగోలు చేశారు. ఈ భూమిని 2011లో స్వయం బిల్డర్స్, సెవెన్ ఎలెవన్ కన్‌స్ట్రక్షన్స్ అనే రెండు సంస్థలు ఆక్రమించుకున్నాయని ఆయన ఆరోపించారు. ఈ రెండు సంస్థలతో భాజపా ఎమ్మెల్యే నరేంద్ర మెహతాకు సంబంధం ఉందని తెలిపారు. ఈ విషయం పై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని.. మున్సిపల్ కార్పొరేషన్, రెవెన్యూ శాఖ అధికారులు సైతం ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.

2015లో పోలీసులు దీనిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయగా.. దాదాపు 11ఏళ్ల తర్వాత ఇటీవల కోర్టుకు నివేదిక సమర్పించారు. మరోవైపు, ఈ వ్యవహారానికి సంబంధించి గతేడాది ఆ రెండు సంస్థలు.. వోహ్రాపై పోలీసులకు ఫిర్యాదు చేశాయి. దీంతో మనస్తాపానికి గురైన అస్గర్‌అలీ వోహ్రా.. సెప్టెంబరు 8న ప్రధాని మోదీని కలిసి తన ఆవేదనను విన్నవించుకున్నారు. ఈ వ్యవహారంలో సీబీఐ దర్యాప్తు జరిగేలా చూడాలని అభ్య

కాగా.. సెప్టెంబరు 16న ఈ కేసుపై మున్సిపల్ కార్పొరేషన్‌లో విచారణ జరగాల్సి ఉంది. ఆ లోగానే కేసు పరిష్కారమైనట్లు తెలిసింది. వోహ్రాతో భూవివాదం నుంచి ఆ రెండు సంస్థలు వెనక్కి తగ్గాయి. ఆయనకు భూమిని తిరిగిచ్చేందుకు అంగీకరించడంతో పాటు కేసును ఉపసంహరించుకున్నాయి. గుజరాత్‌లోని వాడ్‌నగర్‌లో గల బీఎన్ స్కూల్‌లో వోహ్రా చదువుకున్నారు. ఇదే పాఠశాలలో మోదీ కూడా విద్యనభ్యసించారు.

# మామను చంపించిన కోడలి కేసులో.. మరో ట్విస్ట్



**- ఇంటి నిండా సీసీటీవీల నిఘాతో ఆంక్షలు పెట్టిన మామ**

వైఖరికి విసిగి వేసారిన ఓ కోడలు పనిమనిషితో ఆయన్ని హత్య చేయించిన ఘటన ఇటీవల ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పుర్‌లో చోటుచేసుకుంది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు కీలక విషయాలు వెల్లడించారు. వ్యాపారి వినీత్ మనోచా (60) హత్య కేసులో ఆయన కోడలు శాలుతో పాటు కొడుకు సుబ్రత్‌కు కూడా సంబంధం ఉందని తెలిపారు. నిందితుడు తన కొత్త సిమ్ కార్డుతో సుబ్రత్‌కు ఆరుసార్లు ఫోన్ చేసినట్లు విచారణలో తేలడంతో ఈ విషయం బయటకు వచ్చింది.

**కోడలు పథకం వేయగా.. సహకరించిన కొడుకు**

వినీత్ మనోచా ఇంట్లో సీసీటీవీ కెమెరాలు అమర్చి కుటుంబసభ్యుల కదలికలపై నిరంతరం నిఘా పెట్టడం, ఆర్థిక వ్యవహారాల్లో నిక్కచ్చిగా వ్యవహరిస్తుండడంతో విసిగిపోయిన శాలు ఆయనను హతమార్చడానికి పథకం వేసింది. దానిని హత్యగా చిత్రీకరించేందుకు గతంలో వారి ఇంట్లో పని చేసిన విశాల్ సాయం తీసుకుంది. వీరికి వ్యాపారి కుమారుడు సుబ్రత్ సైతం సహకరించినట్లు తెలుస్తోంది. మే 1 నుంచి సెప్టెంబర్ 5 మధ్య సుబ్రత్, విశాల్ సుమారు 309 సార్లు ఫోన్‌లో మాట్లాడుకున్నట్లు గుర్తించామని పోలీసులు పేర్కొన్నారు. హత్య జరగడానికి రెండు రోజుల ముందు కూడా సుబ్రత్‌తో నిందితుడు కొత్త సిమ్‌తో ఫోన్‌లో మాట్లాడారన్నారు. దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది.

# 35వేల అడుగుల ఎత్తులో వినాయక పూజ..



దేశవ్యాప్తంగా గణేశ్ చతుర్థి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. అయితే కొందరు తమ ఉద్యోగ బాధ్యతల కారణంగా కుటుంబంతో కలిసి పండగ చేసుకోలేకపోయారు. ఫ్లైట్ షెడ్యూల్‌లో చివరినిమిషంలో మార్పుతో ఎయిరిండియా క్యాబిన్ క్రూ అనురాధా సోని కూడా పండగను మిస్ అయ్యారు. దాంతో ఆమె కొంచెం బాధలో ఉండిపోయారు. అప్పుడే ఆమెకు ఒక అనూహ్య అవకాశం లభించింది. ఒక ప్రయాణికురాలు వినాయకుడి విగ్రహం తీసుకురావడం కనిపించింది. దాంతో ఆమె సంతోషానికి అవధులు లేకుండాపోయింది. ఆ గణపతి విగ్రహానికి సోని భక్తితో స్వాగతం పలికారు. ఆ దృశ్యాలను అనురాధ ఇన్‌స్టా వేదికగా షేర్ చేశారు. ''అసలు ఆరోజు నేను బాధలో ఉన్నాను. చివరి నిమిషంలో ఫ్లైట్ షెడ్యూల్ మారడంతో ఇంటికి వెళ్లలేకపోయాను. కానీ అప్పుడే ఒక ప్రయాణికురాలు విమానంలోకి విగ్రహాన్ని తీసుకురావడంతో ఆశ్చర్యపోయాను. 35వేల అడుగుల ఎత్తులో పూజ చేసి, ఆశీస్సులు తీసుకున్నాను'' అంటూ ఆమె సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇది క్యూట్ మూమెంట్, అద్భుతం అంటూ నెటిజన్లు స్పందించారు.

# మిస్ యూనివర్స్ ఇండియా ఫైనలిస్ట్.. తిరిగి ఉద్యోగంలోకి..!



దేశం మెచ్చిన అందాల పోటీలు, టాప్ 20లో చోటు.. సాధారణంగా ఎవరైనా ఈ స్థాయిలో సక్సెస్ సాధిస్తే మోడలింగ్ లేదా సినిమా రంగం వైపు అడుగులు వేస్తారు. కానీ ఆమె మాత్రం పోటీలు ముగిసిన కొద్ది రోజులకే మళ్లీ ఫార్మల్స్ ధరించి, ల్యాప్‌టాప్ పట్టుకుని ఆఫీస్‌కు వెళ్లారు. ఇటీవల జైపుర్‌లో జరిగిన మిస్ యూనివర్స్ ఇండియా పోటీల్లో 52 మంది ఫైనలిస్టులతో పోటీపడి.. మధ్యప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహించిన ఉమంగా కమావత్ టాప్20లో స్థానం దక్కించుకున్నారు. ఆ వెలుగుల ప్రపంచం నుంచి బయటకు రాగానే ఆమె మళ్లీ ఉద్యోగంలో చేరారు. బెంగళూరులోని తన ఆఫీసులో విధులకు హాజరయ్యారు. ఆమె ప్రస్తుతం గూగుల్ క్లౌడ్ ఇంజినీర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గ్లామర్‌ను కేవలం ఒక అభిరుచిగానే ఉంచుకుంటూ.. తన కెరీర్‌నే ప్రాధాన్యతగా ఎంచుకున్న ఈ బ్యూటీ ఇన్‌స్టాగ్రాం వేదికగా పంచుకున్న వీడియా నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఆ వీడియోలో ఉదయం లేచినప్పటి నుంచి.. రాత్రి పడుకునే వరకూ తన ప్రయాణం ఎలా సాగుతుందో వివరించారు.

# 45 ఏళ్ల వయసులో 10వ తరగతి పూర్తిచేసిన మహిళ

45 ఏళ్ల వయసులో పదోతరగతి పరీక్షలకు హాజరై.. చదువుకు వయసు, వైకల్యం అడ్డుకాదని నిరూపించారు జమ్మూకశ్మీర్‌కు చెందిన రేణు హన్స్ . బధిరురాలు అయినప్పటికీ కుమారుడి సాయంతో చదువుకొని పదో తరగతి పరీక్షల్లో 82 శాతం మార్కులు సాధించారు.

జమ్మూలోని లోయర్ రూప్ నగర్‌కు చెందిన రేణు హన్స్ 22 ఏళ్ల క్రితం పదో తరగతి పరీక్ష రాసి ఫెయిల్ అయ్యారు. వివాహం అనంతరం ఆమె చదువుకు దూరమయ్యారు. ప్రస్తుతం 12వ తరగతి చదువుతున్న ఆమె కుమారుడు నమన్ కౌల్ ప్రోత్సాహంతో మళ్లీ పదో తరగతి పరీక్ష రాయడానికి సిద్ధమయ్యారు. దర్జీ పని చేస్తూ.. కుటుంబాన్ని పోషిస్తున్న ఆమె భర్త కూడా రేణును ప్రోత్సహించారు. దీంతో కష్టపడి చదివి.. ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన పరీక్షలో మంచి మార్కులు సాధించారు. పై చదువులు కూడా అభ్యసించాలనుకుంటున్నట్లు ఆమె తెలిపారు.



# దొంగ యాప్‌లతో జాగ్రత్త!

దాదాపు అందరి చేతుల్లోనూ స్మార్ట్‌ఫోన్లు కనిపిస్తున్నాయి. ఇతరులతో మాట్లాడటం కంటే యాప్‌ల ద్వారా వీడియోలు చూడటానికీ, చాటింగ్ చేయడానికీ, ఆర్థిక లావాదేవీలు జరపడానికే వాటిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. న్యూస్, గేమ్స్, వీడియోలు, షార్ట్స్, రీల్స్ కోసమే కాదు- విద్య, వైద్యం, బ్యాంకింగ్ వంటి సేవలకూ మొబైల్ అప్లికేషన్లు అక్కరకు వస్తున్నాయి. మరోవైపు, కొందరు వీటి ద్వారానే ఆర్థిక మోసాలకు పాల్పడటం, అశాంతినీ హింసనూ ఎగదోయడం చేస్తున్నారు. కాబట్టి, యాప్‌ల దుర్వినియోగాన్ని అరికట్టడం ఇప్పుడు చాలా అవసరం.

ప్రపంచవ్యాప్తంగా యాప్ స్టోర్లలో 50లక్షలకు పైగా మొబైల్ యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటికి తోడు ప్రతినెలా 75వేల నుంచి 1.20లక్షల వరకు కొత్తవి వస్తున్నాయి. 13శాతానికి పైగా వృద్ధిరేటుతో స్థిరంగా కొనసాగుతున్న ప్రపంచ మొబైల్ అప్లికేషన్ మార్కెట్ 2030 నాటికి 71,700 కోట్ల డాలర్లకు చేరుతుందని అంచనా. భారతీయ యాప్ మార్కెట్ ఏమో 35శాతం వృద్ధిరేటుతో కొనసాగుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రికార్డు స్థాయిలో 34.5 కోట్ల డాలర్ల రాబడిని ఆర్జించింది. భారతీయ నిపుణులు ప్రపంచస్థాయి యాప్‌లను ఆవిష్కరించి, విజయవంతంగా నిర్వహిస్తున్నారు. వాటితోపాటు ఇతర దేశాలకు అప్లికేషన్ డిజైన్, డెవలప్‌మెంట్, టెస్టింగ్ సేవలను 40-60శాతం తక్కువ ఖర్చుకే అందిస్తున్నారు. అలా మొబైల్ యాప్ ఆఫ్‌షోర్ రంగంలో ఇండియాను అగ్రస్థానంలో నిలుపుతున్నారు. అయితే, యాప్ మార్కెట్లో 0.01శాతం కన్నా తక్కువ అప్లికేషన్లే ఆర్థికంగా విజయం సాధిస్తున్నాయి. రకరకాల కారణాలతో దాదాపు 80-90 శాతం మొదటి ఏడాదిలోనే విఫలమవుతున్నాయి. సుమారు 68-78శాతం యాప్‌లు అయితే కనీసం వెయ్యి డౌన్‌లోడ్లకు కూడా నోచుకోవట్లేదు. అందులోను, చాలామంది వినియోగదారులు 90శాతం యాప్‌లను నెల రోజుల్లోనే అన్‌ఇన్‌స్టాల్ చేసేస్తున్నారు.

**మన దగ్గరే ఎక్కువ...**

ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు ఏటా 15వేల కోట్లకు పైగా యాప్‌లను డౌన్‌లోడ్ చేస్తున్నారు. ఏటా ఎనిమిది శాతం పెరుగుతున్న డౌన్‌లోడ్‌ల సంఖ్యలో గేమ్ యాప్‌సదే అగ్రభాగం. యాప్ స్టోర్ల రాబడిలో 50-60శాతం వీటి అమ్మకాల ద్వారానే సమకూరుతోంది. ఇక వినోదం, సామాజిక మాధ్యమాల డౌన్‌లోడ్లు రెండో స్థానంలో; ఆన్‌లైన్ షాపింగ్, ఆర్థిక, విద్యా సంబంధమైనవి మూడోస్థానంలో కొనసాగుతున్నాయి. మన యువత గేమింగ్ యాప్‌ల కంటే ఫొటోలు, చిన్న వీడియోలు, రీల్స్ పంచుకునే సోషల్ మీడియా వేదికలు, యుటిలిటీ టూల్స్, జనరేటివ్ ఏఐ యాప్‌లనే ఎక్కువగా ఇష్టపడుతున్నారు. స్మార్ట్‌ఫోన్లు, మొబైల్ డేటా అందుబాటు ధరల్లో లభిస్తుండటంతో దేశంలో కంటెంట్ క్రియేషన్ ఎకోసిస్టమ్ శరవేగంగా విస్తరిస్తోంది. గత నాలుగేళ్లలోనే కంటెంట్ క్రియేటర్ల సంఖ్య 320 శాతం చొప్పున పెరుగుతూ నేడు 53లక్షలు దాటింది. ప్రపంచంలోనే అత్యధిక సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు కలిగిన మూడో దేశం మనదే.

వార్తలు, వినోదం, విద్య, ఆరోగ్యం, బ్యాంకింగ్, ఫైనాన్స్, వ్యవసాయం, పర్యాటకం, వ్యక్తిత్వ వికాసం, ఆధ్యాత్మికం వంటి అంశాలకు సంబంధించిన యాప్‌లు బాగా ప్రాచుర్యం పొందుతున్నాయి. ప్రపంచంలోని స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు సగటున 35కు పైగా యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకుని, రోజూ వాటిలో కనీసం తొమ్మిది అప్లికేషన్లను కనీసం 4-5 గంటల పాటు వాడుతున్నారని మొబైల్ మార్కెట్ పరిశోధనా సంస్థలు వెల్లడిస్తున్నాయి. నిరుడు విశ్వవ్యాప్తంగా యాప్‌ల ద్వారా సుమారు 22.95లక్షల కోట్ల డాలర్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిగాయి. ఈ ఏడాది చివరినాటికి ఇవి 37.45లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంటాయని మార్కెట్ విశ్లేషకుల అంచనా.

మొబైల్ యాప్‌ల ద్వారా పెద్దయెత్తున ఆర్థిక లావాదేవీలు జరుగుతుండటంతో ప్రపంచవ్యాప్తంగా నేరగాళ్లు వీటిపై కన్నేసి, యాప్ తయారీదారులుగా, వినియోగదారులుగా మార్కెట్లోకి ప్రవేశిస్తున్నారు. గతేడాది ఈ అప్లికేషన్ల ద్వారా 44,200 కోట్ల డాలర్ల మేర మోసాలకు పాల్పడ్డారు. మొబైల్ యాప్‌లు, డిజిటల్ మోసాలకు సంబంధించి నిరుడు భారత్‌లో పాతిక లక్షలకు పైగా ఫిర్యాదులు అందాయి. వీటి విలువ సుమారు రూ.22,500 కోట్లు. అయితే, సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా రూ.11,158 కోట్లకు పైగా ప్రజాధనాన్ని రక్షించినట్లు చెబుతున్నారు. కేంద్రం మొన్న జులై నాటికి ఇండియన్ సైబర్‌క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ తోడ్పాటుతో నకిలీ ఆర్థిక, డిజిటల్ రుణయాప్‌లు సహా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తున్న 3,718 మొబైల్ అప్లికేషన్లను నిలిపివేసింది. ఉగ్ర మూకలు తమ నెట్‌వర్క్‌ను విస్తరించుకోవడానికీ, పేలుడు పదార్థాల తయారీలో శిక్షణ ఇవ్వడానికి యాప్‌లను వినియోగిస్తుండటం ఆందోళనకరం. డ్రగ్స్ మాఫియా, అక్రమ ఆయుధ రవాణా ముఠాలు సైతం యాప్‌ల ద్వారా దందాలకు పాల్పడుతున్నాయి.

**విద్వేషాల వ్యాప్తికి...**

నిరుడు ఆరంభమైన 'బిట్‌చాట్' సెల్యూలార్ నెట్‌వర్క్ వైఫై లేకుండానే స్మార్ట్‌ఫోన్ బ్లూటూత్ యాంటెన్నా ద్వారా సందేశాలు, గ్రూప్ చాట్ చేయగల మెసేజింగ్ యాప్‌గా గుర్తింపు పొందింది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడూ... విద్యుత్, సెల్యులార్ సేవలు నిలిచిపోయినప్పుడూ... కమ్యూనికేషన్ వ్యవస్థ లేని సరిహద్దు ప్రాంతాల్లో భద్రతా దళాలకు సాయపడగల ఈ యాప్‌ను చాలామంది వదంతుల వ్యాప్తికీ, హింసను పురిగొల్పడానికీ వినియోగిస్తున్నారు. సోషల్ మీడియా వేదికల ద్వారా వివాదాలను సృష్టించడం, విద్వేషాలను రెచ్చగొట్టడం చేస్తున్నారు. సున్నితమైన ప్రాంతాల్లో నిరసనలు, ఆందోళనలు జరుగుతున్నప్పుడు ప్రభుత్వాలు మొబైల్ అప్లికేషన్లను మూసివేయాలని, బ్లాక్ చేయాలని, యాప్ స్టోర్ల నుంచి తొలగించాలని ఆదేశిస్తుంటాయి. అయితే ఒక యాప్‌ను నిషేధిస్తే, అలాంటి ఫీచర్లతోనే మరింత పటిష్ఠమైన యాప్‌లు పుట్టుకొస్తున్నాయి. అలాంటి వాటిని నియంత్రించడం ముఖ్యం. నిబంధనలను పాటించనందుకు గూగుల్, వాట్సాప్, ఎక్స్ వంటి దిగ్గజ సంస్థలపైనా అనేక దేశాలు భారీ జరిమానాలు వేస్తుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో నిజాయతీ, నైతిక నిబద్ధత, స్వీయ నియంత్రణలకు యాప్ సంస్థలు, సాంకేతిక నిపుణులు ప్రాధాన్యమివ్వాలి. అప్లికేషన్ల అభివృద్ధి, నియంత్రణకు ప్రభుత్వాలు కట్టుదిట్టమైన విధానాలను తీసుకురావడం అత్యవసరం.




# బ్యాంకింగ్ సంస్కరణలు?

**మన దేశ ప్రభుత్వరంగ బ్యాంకింగ్ వ్యవస్థలో పెనుమార్పులు జరగబోతున్న సంకేతాలు, ప్రకటనలు అనేకం చూస్తున్నాం. ప్రభుత్వ బ్యాంకుల సేవల మీద ఆధారపడ్డ విస్తృత ప్రజానీకం, మధ్యతరగతి మేధావివర్గం, ప్రజాస్వామ్యవాదులు, చిన్న–మధ్యతరహా పరిశ్రమల అధిపతులు మారుతున్న పరిస్థితులను అర్థం చేసుకోవాలి, స్పందించాలి. ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఉన్న పొదుపు ప్రజలది. బ్యాంకుల మూలధనం (కాపిటల్) ప్రజలు కట్టిన పన్నుల ఆదాయం నుంచి సమకూర్చినది. లక్షల కోట్ల రూపాయల లాభాలు ఉద్యోగుల శ్రమశక్తితో సంపాదించినవి. భారత ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటిస్తున్న 'వికసిత్ భారత్–2047' సాధనలో బ్యాంకుల పాత్ర ఎలా ఉండాలో అధ్యయనం చేయడం కోసం ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయబోతున్నట్లు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 2026–27 బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. తదనుగుణంగా, ఆగస్టు 17, 18 తేదీల్లో ఆర్థికమంత్రిత్వ శాఖ నిర్వహించిన ప్రభుత్వరంగ బ్యాంకుల శిఖరాగ్ర సమావేశం ఆ ఉన్నతస్థాయి కమిటీకి నివేదించాల్సిన ప్రతిపాదనల మీద చర్చించింది. దీనికితోడు ప్రధానమంత్రి తన స్వాతంత్ర్యదినోత్సవ ప్రసంగంలో ప్రపంచస్థాయి ఐదు పెద్ద బ్యాంకులలో కనీసం ఒక భారతీయ బ్యాంకు ఉండాలనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఇవన్నీ బ్యాంకింగ్ రంగంలో పెనుమార్పులకు సంకేతం. అద్భుతమైన ఈ నినాదాల వెనుక దాగి ఉన్న నిజాలేమిటి?**




ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఉన్న పొదుపు (డిపాజిట్లు)లో 60శాతం పైగా సొమ్ము సామాన్యులు, ఉద్యోగులు తమ భవిష్యత్తు కోసం, పిల్లల చదువులు, పెళ్లిళ్లకోసం దాచుకున్నదే. ఈ కష్టార్జితాన్ని సేవింగ్స్ ఖాతాలో పెట్టుకుంటే బ్యాంకులు చెల్లించే వడ్డీ 2.5 శాతం నుంచి 2.7శాతం. అదే ఫిక్స్‌డ్ డిపాజిట్ అయితే 6.5శాతం. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఈ సంవత్సరం ద్రవ్యోల్బణం 6శాతానికి చేరువలో ఉంది. అంటే ప్రతి ఏటా సామాన్యుడు దాచుకున్న పొదుపు విలువ తగ్గుతోంది తప్ప, రూపాయి విలువకు రక్షణ లేదు.

బ్యాంకు రుణాల విషయంలో కూడా ప్రజలు ఆర్థికదోపిడీకి గురవుతున్నారు. సంస్కరణల పేరుతో బ్యాంక్ విధానాలలో వచ్చిన మార్పులే దీనికి కారణం. బ్యాంకులు మొత్తం ఇచ్చే రుణాలలో 40శాతం ప్రాధాన్యతా రంగాలైన వ్యవసాయం, చేతి వృత్తులు, చిన్న మధ్యతరహా పరిశ్రమలకు ఇవ్వాలి. ఈ రుణాలు ఇవ్వని బ్యాంకుల మీద ఒకప్పుడు పెనాల్టీలు వేసేది రిజర్వ్ బ్యాంక్. కానీ బ్యాంకింగ్ సంస్కరణల అమలుతో మైక్రోఫైనాన్స్ కంపెనీలకు, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలకు (ఎన్‌బీఎఫ్‌సీ) ఇచ్చిన రుణాలనే ప్రాధాన్యతా రంగాలకు ఇచ్చినట్టుగా పరిగణించడం మొదలయ్యింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు రైతులు, సామాన్యులకు ఇవ్వవలసిన రూ.14 లక్షల కోట్ల సొమ్మును ఎన్‌బీఎఫ్‌సీలకు ఇచ్చాయి. ఇదే సొమ్మును మైక్రోఫైనాన్స్ కంపెనీలు, ఎన్‌బీఎఫ్‌సీలు సామాన్య ప్రజలకు అప్పుగా ఇచ్చి, 20-30శాతం వడ్డీ వసూలు చేస్తూ వేల కోట్ల రూపాయల లాభాలు సంపాదిస్తున్నాయి. ఆ రుణభారం, అప్పుల ఊబి నుంచి బయటపడలేక అనేక కుటుంబాలు బలవన్మరణానికి పాల్పడుతున్న వార్తలు నిత్యం చూస్తూనే ఉన్నాం. బ్యాంకులే నేరుగా అప్పులివ్వొచ్చుగా... మధ్యలో ఈ మధ్యవర్తులెందుకు? వైపరీత్యం ఏమిటంటే బ్యాంకులలో తన పొదుపు సొమ్ము దాచుకునే సామాన్యుడు ఒకవైపు దోపిడీకి గురవుతున్న రుణదాత. రెండోవైపు ఎన్‌బీఎఫ్‌సీల వద్ద అధిక వడ్డీ దోపిడీకి గురయ్యే రుణగ్రహీత. ఈ దోపిడీలను కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఎందుకు అనుమతిస్తున్నాయి? దీనికితోడు, గత ఐదేళ్ల కాలంలో ఖాతాలో మినిమం బ్యాలెన్స్ లేదనో, తగిన బ్యాలెన్స్ లేకుండా చెక్కులు ఇచ్చారనో, ఇంకా అనేక కారణాలతో పెనాల్టీల రూపంలో ప్రభుత్వ ప్రైవేట్ బ్యాంకులు ఖాతాదారుల నుంచి రూ.28,495 కోట్లు వసూలు చేశాయి.

పార్లమెంటు చట్టాల ద్వారా ఏర్పడిన ప్రభుత్వ రంగ సంస్థలు లేబర్ చట్టాలను అమలుచేస్తూ 'మోడల్ ఎంప్లాయర్'గా ఉండాలి, పర్మినెంట్ ఉద్యోగులను నియమించాలి. ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలు సక్రమంగా అందించడానికి, పెరుగుతున్న వ్యాపారానికి తగినట్టుగా ఉద్యోగ నియామకాలు చేపట్టాలి. కానీ ప్రభుత్వరంగ బ్యాంకులలో పర్మినెంట్ ఉద్యోగులకంటే ఎన్నోరెట్లు అధికంగా క్యాజువల్, టెంపరరీ, అప్రెంటిస్, కాంట్రాక్టు, ఫిక్స్‌డ్ టర్మ్, బిజినెస్ కరస్పాండెంట్లు తదితర అనేక రూపాలలో పర్మినెంట్ ఉద్యోగులు చెయ్యాల్సిన పనులే చేస్తున్నారు. వీరికి సరైన జీతాలు, ఇతరత్రా సౌకర్యాలు లేవు. బ్యాంకుల్లో కనీసం లక్షా నలభైవేల పర్మినెంట్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి.

ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొండి బాకీలను సమర్థవంతంగా వసూలు చెయ్యబోతున్నట్టు ప్రకటించింది. ఆ పేరుతో 'ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టీ చట్టం-2016' చేసింది. ప్రత్యేకంగా నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్స్, ఎన్‌సీఎల్‌టీలు సైతం ఏర్పాటు చేశానని చెప్పింది. కానీ, అప్పటివరకూ లేని విధంగా బ్యాంకులు పెద్ద ఎత్తున మొండి బాకీలు రద్దు చేసుకుంటున్నాయి. రిలయన్స్ కమ్యూనికేషన్స్, వీడియోకాన్ ఇండస్ట్రీస్, జీ నెట్వర్క్ లాంటి ఏడు కంపెనీలు అవి చెల్లించాల్సిన సొమ్ములో 97శాతం రద్దయి, 3శాతమే వసూలయ్యింది. ఈ ప్రభుత్వకాలంలో రూ.18 లక్షల కోట్లను మొండి బకాయిలుగా పరిగణించాయి. లక్షలాదిమంది బ్యాంకు ఉద్యోగుల శ్రమతో సంపాదించిన లాభాలు, ప్రజలపై పన్నుల ద్వారా సంపాదించిన పెట్టుబడి ఇలా బాకీల రూపంలో కార్పొరేట్ కంపెనీలకు చేరింది. ప్రభుత్వం చేసిన చట్టాలు బాకీలను వసూలు చెయ్యడం కాక, కార్పొరేట్ రుణాల రద్దును చట్టబద్ధం చేశాయి. ఇదే సొమ్ము సామాన్య ప్రజలకు, వ్యవసాయరంగానికి, ఎంఎస్ఎంఈలకు రుణాలుగా ఇచ్చి ఉంటే దేశ ఆర్థికవ్యవస్థ ఎంతో వృద్ధిచెందేది. ఎంప్లాయిమెంట్ పెరిగేది. కార్పొరేట్ శక్తులు, బ్యూరోక్రసీ, రాజకీయ శక్తుల అపవిత్ర కూటమి (నెక్సస్) వలనే ఇంత ప్రజాధనం దోపిడీకి వీలుకలిగిందనేది వాస్తవం కాదా? ఇది కాకులను కొట్టి గద్దలకు వెయ్యటం కాక మరేమిటి?

ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలలో అనుభవం ఉన్నవారిని ప్రభుత్వ రంగ బ్యాంకుల మేనేజింగ్ డైరెక్టర్లు, చైర్మన్లు తదితర ఉన్నతాధికారులుగా నియమించాలని, బ్యాంకుల మూలధనంలో విదేశీ పెట్టుబడిని 49శాతానికి పెంచాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. విదేశీ పెట్టుబడి లాభాల కోసమే వస్తుంది, లాభాలు లేకపోతే వాపసు వెళ్తుంది. అప్పుడు బ్యాంకులు ఆర్థిక ఒడుదుడుకులకు లోనవుతాయి, ప్రజల పొదుపు ప్రమాదంలో పడుతుంది.

అందుకే, ఈ పరిస్థితులను అధ్యయనం చేసి వాస్తవాలను సామాన్య ప్రజానీకానికి, ప్రజాస్వామ్య శక్తులకు, రైతు, కార్మిక సంఘాలకు, దేశ యువతకు తెలియజేయాలని బ్యాంకు ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక -యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్- నిర్ణయించింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రజల పొదుపుతో నడుస్తున్న ప్రజాసంస్థలు. ప్రజల పొదుపునకు ద్రవ్యోల్బణం నుంచి రక్షణనిచ్చేవిధంగా వడ్డీ రేట్లు పెంచాలని, దేశ ఆర్థికవ్యవస్థ సమ్మిళిత వృద్ధికి వెన్నెముకలైన వ్యవసాయ రంగానికి, గ్రామీణాభివృద్ధికి, చిన్న మధ్యతరహా పరిశ్రమలకు, మౌలిక వసతుల రంగానికి ఎటువంటి మధ్యవర్తి సంస్థలు లేకుండా నేరుగా తక్కువ వడ్డీకి రుణాలనివ్వాలని సంఘాలు కోరుతున్నాయి. విధాన నిర్ణయాలు చేసే బ్యాంకు బోర్డులలో ఉద్యోగ సంఘాలకు, రైతు, కార్మిక, ఎంఎస్ఎంఈ రంగాల నిపుణులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలి. దీనివలన రుణాల మంజూరు, వసూలు లాంటి అంశాలమీద పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులను కాపాడుకోవటం ప్రజలందరి కర్తవ్యం. అది దేశ ఆర్థిక స్వావలంబనకు, సమ్మిళిత వృద్ధికి ఆధారంగా నిలుస్తుంది.

# శ్రమదోపిడీ ఆగేదెన్నడు?

**ఒకవైపు ప్రపంచస్థాయి ప్రమాణాలతో విద్యాసంస్థల నిర్మాణం.. నలందా–తక్షశిలల నాటి ఘనత... ఏఐ యుగంలో సవాళ్లను ఎదుర్కొనే విద్యార్థుల తయారీ... అంటూ వెలువడే ప్రకటనల వెనక ఒక చేదు నిజం దాగి ఉంది. రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో గత పాతికేళ్లుగా యూజీసీ నిర్దేశించిన అత్యున్నత విద్యార్హతలు (పీజీ, పీహెచ్‌డీ, నెట్/సెట్) కలిగి బోధిస్తున్న దాదాపు 1,200 మంది కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు తీవ్ర ఆర్థిక, ఉద్యోగ భద్రతా సంక్షోభంలో ఉన్నారు. ద్రవ్యోల్బణం పెరుగుతున్నా వీరి వేతనాలు 2019 నాటి స్థాయిలోనే నిలిచిపోయాయి. అదే తరగతి గదిలో, అదే సిలబస్‌ను బోధిస్తూ, అదే విశ్వవిద్యాలయ పరీక్షా బాధ్యతలు నిర్వహిస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్ అధ్యాపకుల మధ్య వేతనాల్లో 167 శాతం వరకు వ్యత్యాసం ఉండటం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16లు కల్పించిన సమానత్వ హక్కుకే భంగం. షా సమీర్ భరత్‌భాయ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ గుజరాత్ (2025), స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ జగ్జిత్‌సింగ్ (2016) వంటి సుప్రీంకోర్టు తీర్పులు సమాన పనికి సమాన వేతనం అనే సూత్రాన్ని బలపరిచాయి. జీవోఎంఎస్ నెంబర్ 15 (2019) ద్వారా రెగ్యులర్**



**విశ్వవిద్యాలయ అధ్యాపకులకు ఏడో యూజీసీ పే స్కేల్ అమలైంది. దీంతో బేసిక్ పే రూ.21,600 నుంచి రూ.57,700కు, అంటే 167.6శాతం పెరిగింది. ఇందులో ఇంకా డీఏ, ఇతర అలవెన్సులు కలపలేదు. కాంట్రాక్ట్ అధ్యాపకుల బేసిక్ పే రూ.37,800 నుంచి రూ.57,700కు, అంటే కేవలం 52.6 శాతం మాత్రమే పెంచి ఫిట్‌మెంట్ బెనిఫిట్‌ను నిరాకరించారు. అలాగే జీవో ఆర్టీ నంబర్ 222 ప్రకారం డిగ్రీ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్లకు 12 నెలల జీతం ఇస్తూ, విశ్వవిద్యాలయ కాంట్రాక్ట్ అధ్యాపకులకు సంవత్సరానికి ఒక రోజు 'బ్రేక్' పేరుతో వేతనం కోత విధించడం వివక్షగా కనిపిస్తోంది. హర్యానా సెంట్రల్ యూనివర్సిటీ, ఢిల్లీ యూనివర్సిటీల్లో కాంట్రాక్ట్ అధ్యాపకులకు రూ.57,700 బేసిక్ పేతో పాటు సుమారు రూ.16,156 డీఏ, అంటే నెలకు రూ.73,856కు పైగా గ్రాస్ శాలరీ లభిస్తోంది. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ యూనివర్సిటీ 2021 నుంచే డీఏ, హెచ్‌ఆర్‌ఏలను చెల్లిస్తోంది. తెలంగాణలో మాత్రం డీఏ, హెచ్‌ఆర్‌ఏ, పీహెచ్‌డీ ఇన్సెంటివ్ వంటి ప్రయోజనాలు లేక ఇతర ప్రాంతాలతో పోలిస్తే సుమారు 25శాతం ఆదాయ వ్యత్యాసం ఉందని కాంట్రాక్ట్ అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**

రాష్ట్ర ఉన్నత విద్యలో 74శాతం ఖాళీల సమస్య మరింత ఆందోళనకరం. మొత్తం 2,878 రెగ్యులర్ పోస్టుల్లో కేవలం 753 పోస్టులు మాత్రమే భర్తీ కాగా, 2,125 పోస్టులు అంటే 74శాతం ఖాళీగా ఉన్నాయి. ఈ ఖాళీలను భర్తీ చేయకుండా కాంట్రాక్ట్ అధ్యాపకులతో చౌకగా పనిచేయించుకుంటూ దీర్ఘకాలంగా శ్రమదోపిడీ చేస్తున్నారు. దీనివల్ల బోధన, పరిశోధన ప్రమాణాలు దెబ్బతింటున్నాయి. దీర్ఘకాలంగా పనిచేస్తున్న 1,200 మంది అధ్యాపకులు ఉండగా వారికి న్యాయం చేయకుండా కొత్త నియామకాలకు వెళ్లడం కూడా ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం తక్షణమే కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఏడో యూజీసీ పే స్కేల్ రూ.57,700 నుంచి రూ.1,82,400 వరకు, డీఏ, హెచ్‌ఆర్‌ఏ, పీహెచ్‌డీ ఇన్సెంటివ్, మెడికల్ అలవెన్స్ అమలు చేయాలి. ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న 1,200 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులను వారికి ఖాళీగా ఉన్న రెగ్యులర్ పోస్టుల్లో క్రమబద్ధీకరిస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలి. గ్యాప్ శాలరీ విధానాన్ని రద్దు చేసి పన్నెండు నెలల పూర్తి వేతనం చెల్లించాలి. ఉన్నత విద్యకు నిధులు పెంచి, విశ్వవిద్యాలయాలకు స్వయంప్రతిపత్తి కల్పిస్తూ పారదర్శక నియామకాలు చేపట్టాలి. కోటి ఆశలతో తెలంగాణ ఏర్పడి దశాబ్దం దాటింది. విద్యా వికాసం అంటే కేవలం భవనాలు నిర్మించడం కాదు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే అధ్యాపకుడికి గౌరవప్రదమైన జీవితం, న్యాయమైన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించడమే నిజమైన విద్యా వికాసం. 1,200 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులకు న్యాయం చేయడం తెలంగాణ ఉన్నత విద్య భవిష్యత్తును కాపాడటమే.

# ఎన్నో నామాలు... ఎన్నెన్నో మర్మాలు!

**'గణం' అంటే- బృందం. సమూహం. మొత్తం దేవగణాలకు అధినేత- గణపతి! ఆ ఆధిపత్యాన్ని ఆయన బుద్ధిబలంతో సాధించుకున్నాడు. నెమలి వాహనం మీద రివ్వున ఎగిరి ముల్లోకాలను చుట్టివచ్చిన కుమారస్వామిని- అదే పోటీలో ఓడించాడంటుంది వినాయక వ్రత కథ. 'ఎలుక గుర్రము మీద నీరేడు భువనాలు పరుగెత్తి వచ్చిన పందెకాడు' అన్న కరుణశ్రీ వర్ణనలోని లోగుట్టు అదే! (జీవిత)చదరంగంలో పావులను పడగొట్టాల్సింది- బుద్ధిబలంతోనేకానీ, భుజబలంతో కాదన్నది ఈ కథలో పాఠం! అమ్మానాన్నల చుట్టూ భక్తితో ప్రదక్షిణం చేస్తే ముల్లోకాలనూ (త్రిగుణాలనూ) జయించగలమన్నది- అందులో సూచన. నారములంటే నీళ్లు. నారములయందుండేవాడు నారాయణుడు. నారాయణ నామం జపిస్తూ ప్రదక్షిణాలు చేశాడు కాబట్టే- స్నానంకోసం కుమారస్వామి ఏ నదికి పోయినా వినాయకుడు ఆయనకు ఎదురొచ్చాడు. ఉపద్రవాలలో, ఉత్పాతాలలో ఎదురైనప్పుడు ఉపాయాలు వెతకాలే తప్ప- బెంబేలు పడరాదన్నది ఇందులోని నీతి. అలాగే, మంత్రశాస్త్రంలోని మొత్తం 32 గణపతుల విభిన్న రూపురేఖలు, గణేశ పురాణంలోని 92 అధ్యాయాల ఉపాసనాఖండం, 155 అధ్యాయాల క్రీడాఖండాలు చెబుతున్నదల్లా- అంతరార్థాలను, తత్త్వాన్ని గుర్తించమనే!**

అమ్మ పసుపుబొమ్మను చేసింది. అయ్య ఏనుగు తలను పెట్టాడు. 'తొండమును ఏకదంతమును తోరపుబొజ్జ'తో కనపడే ఆ గజముఖుడే పురాణగణపతి. 'త్వం మూలాధార స్థితోసి నిత్యమ్' అంటూ అధర్వశీర్షం కీర్తించింది వేదగణపతిని! ఆయన గజముఖుడు కాదు. 'కవిం కవీనాం ఉపమశ్రవ స్తవం...' అంటూ గణపతిని 'విద్యాధిదేవత'గా స్తుతించింది వేదం. రుద్రుడి దగ్గరుండే హేరంబగణపతిని 'విశిష్ట మంత్రమూర్తి' అన్నాయి మంత్రశాస్త్రాలు. 'త్రికోణ మధ్యగతుడు' అంటాయి తంత్రశాస్త్రాలు. సృష్టిలో ప్రతిదానికీ పుట్టుక, మనుగడ, మరణం సర్వసహజం. ఆ మూడూ ఉన్నదాన్ని 'జగత్తు' అనీ, లేనిదాన్ని 'బ్రహ్మము' అనీ చెబుతాయి ఉపనిషత్తులు. ఓంకారం పరబ్రహ్మస్వరూపం. గణపతిని ఓంకారాత్మకుడిగా సంభావించారు శంకర భగవత్పాదులు. 'వాతాపి గణపతిం భజే' ప్రసిద్ధకృతిలో 'ప్రణవ స్వరూప వక్రతుండం' అని ముత్తుస్వామి దీక్షితర్ చెప్పిన ప్రణవమంటే ఓంకారమే! కాబట్టి వినాయకుడు 'శబ్ద బ్రహ్మస్వరూపుడు' అనేది పెద్దల తీర్మానం. గణపతి తత్త్వాన్ని అర్థం చేసుకోవాలనుకుంటే ఈ భేదాలను జాగ్రత్తగా అధ్యయనం చేయాలి. పరబ్రహ్మతత్త్వాన్ని పట్టుకోవడమే గణపతి ఆరాధనల పరమ లక్ష్యం!

లోకకల్యాణం కోసం అవతారాలను, స్త్రీరూపాలను ధరించడం దేవుళ్లకు ఆనవాయితీ. వినాయకి, గజానని, విఘ్నేశ్వరి, గణేశ్వరి, ప్రజాదేవి... వంటివి వినాయకుడి స్త్రీరూపాలు. సప్తమాతృకల గురించి తెలిసిందే. తోడుగా మహాలక్ష్మిని ఎనిమిదిగా, 'వినాయకి'ని తొమ్మిదో మాతృకగా ఆరాధించడం ఆచారం. విఘ్ననాయకుని శక్తిరూపమే 'వినాయకి' అంటుంది దేవీపురాణం. ఆమెనే 'ప్రజాదేవి'గా పిలిచింది ముద్గలపురాణం. కాశీని రక్షించేందుకు శివుడు నియమించిన శక్తుల్లో విఘ్నేశ్వరి ఒకరని స్కాందపురాణం చెబుతోంది. తమిళనాడులోని మధురమీనాక్షి ఆలయంలో ఆమెను దర్శించవచ్చు. శుచీంద్రంలో పూజలందుకొనేది 'గణేశ్వరి'. మనుచరిత్రలో పెద్దన 'అంకము చేరి శైలతనయా స్తనదుగ్ధములు ఆనువేళ' పద్యంలో ఇమిడ్చిన అర్ధనారీశ్వర తత్త్వం అర్థమైతే దానిలోంచే ఆవిర్భవించిన గణపతికి చెందిన స్త్రీతత్త్వం కూడా తేలిగ్గా బోధపడుతుంది.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
గురువారం | అనంతపురం | 17.09.2026 | 01

# వినాయక నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు

**- అధికారుల సమన్వయంతో ప్రశాంతంగా నిర్వహించాలి: ఎమ్మెల్యే కందికుంట**

**కదిరి, సెప్టెంబర్ 16: అనంత జనశక్తి న్యూస్**



కదిరి పట్టణంలో నిర్వహించనున్న వినాయక నిమజ్జన కార్యక్రమానికి సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను కదిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు.పట్టణంలోని దేవరచెరువు వద్ద నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్న ప్రదేశాన్ని ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లన్నింటినీ ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి జాప్యం, లోటుపాట్లు లేకుండా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ముఖ్యంగా భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచ...

# వైసీపీ నేతలకు ధైర్యముంటే డీఎస్సీపై ఆరోపణలు కాదు.. ఆధారాలు చూపండి

**- రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో 90 శాతం టీడీపీ హయాంలో నియమితులైనవారే**

**- ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, బదిలీల్లో పారదర్శకతకు బీజం వేసిందే చంద్రబాబు నాయుడు**

**- వైసీపీ హయాంలోని ఏపీపీఎస్సీ స్కాం నుండి దృష్టి మరల్చేందుకే డీఎస్సీపై ఆరోపణలు**

**- గుడ్డకాల్చి మొహాన పడేస్తామంటే ప్రజలు తాటతీస్తారని వైసీపీ నేతలకు మంత్రి కొల్లు రవీంద్ర వార్నింగ్**

**అమరావతి సెప్టెంబర్ 16, అనంత జనశక్తి ప్రతినిధి**



ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, బదిలీల్లో పారదర్శకతకు బీజం వేసిందే నారా చంద్రబాబు నాయుడు అని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు మచిలీపట్నంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశాం. పారదర్శకంగా నియామకాలు పూర్తి చేశాం. కానీ ఏదో జరిగిపోయిందంటూ వైసీపీ నేతలు ఆరోపణలు చేయడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ఒకప్పుడు టీచర్ల బదిలీలు జిల్లా పరిషత్ చైర్మన్లు నడిపించేవారు. ఎవరికి ఎక్కడ రాస్తే అక్కడకు బదిలీ చేసేవారు. కానీ చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక దేశంలోనే మొట్ట మొదటిసారి కౌన్సిలింగ్ విధానం తీసుకొచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలను పారదర్శకంగా నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల్లో 90 శాతం టీడీపీ హయాంలో నియమితులైనవారే. మెరిట్ ప్రకారమే నియామకాలు జరగాలనే సిద్ధాంతంతో పని చేశాం. వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ ఉద్యోగుల్ని జలగల్లా పీడించారు.ఉపాధ్యాయుల్ని మద్యం షాపుల ముందు కాపలా పెట్టారు. మరుగుదొడ్లు కడిగించి ఫోటోలు తీయించారు. కానీ నేడు ఉపాధ్యాయులకు మెరుగైన శిక్షణ కోసం విదేశాలకు పంపిస్తున్నాం. అత్యుత్తమ విద్యా విధానాలను అధ్యయనం చేసే అవకాశం కల్పించాం. బదిలీలు కావాలంటే డబ్బు తీసుకోవడంలో తప్పేముందని బందరులోని వైసీపీ నేత నిస్సిగ్గుగా మాట్లాడుతున్నాడు. ప్రభుత్వ ఉద్యోగులు 'గిఫ్ట్'లు ఇస్తే తప్పేముంది, ఉద్యోగస్తులు గిఫ్ట్ లు తీసుకుంటే తప్పేముందని సిగ్గులేకుండా మాట్లాడుతున్నాడు. వాళ్లు అసలు మనుషులేనా? కూటమి ప్రభుత్వంలో అత్యంత పారదర్శకంగా ఉద్యోగ బదిలీలు జరిగాయి. నియామకాలు జరిగాయి. యువత జీవితాలు నాశనం చేసేలా వైసీపీ నేతలు వ్యవహరిస్తున్నారు. నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా చేపట్టిన సంస్కరణల వల్ల 19వ స్థానంలో ఉన్న రాష్ట్ర విద్యా రంగం ప్రస్తుతం అగ్రస్థానానికి చేరింది. ఎయిడెడ్ స్కూల్స్ అన్నింటిని దోచుకోవాలని వైసీపీ నేతలు ప్రయత్నిస్తే.. నేడు స్కూల్స్ అన్నింటినీ ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం. పేరెంట్స్ టీచర్ కమిటీలు ఏర్పాటు చేశాం. నాలెడ్జ్ స్టేట్ గా ఏపీని మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ప్రయత్నం చేస్తున్నారు. బీసీ హాస్టల్స్, రెసిడెన్షియల్స్, రెసిడెన్షియల్ స్కూల్ స్‌గా, ఎస్సీ హాస్టల్స్‌ని భారతదేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నాం. బడుగు బలహీన వర్గాలకు ఇంటిగ్రేటెడ్ హాస్టల్స్ నిర్మాణం చేపట్టాం. రాష్ట్ర విద్యా రంగంలో జరుగుతున్న పురోగతిని నచ్చక కడుపు మంటతో ప్రభుత్వంపై నిందలేస్తున్నారు. మంచిని అడ్డుకోవాలని చూస్తే ప్రజలు ఎప్పటికీ క్షమించరనే విషయాన్ని వైసీపీ నేతలు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిన రోజు నుండి సుమారు 300కి పైగా కేసులు వేశారు. వాటన్నింటినీ పరిష్కరించుకుని నియామకాలు పూర్తి చేశాం. పేకాట ఆడినోళ్లకు ఉద్యోగాలిచ్చారని పేర్ని నాని చెబుతున్నాడు. బ్రిడ్జ్ గేమ్‌ను కేంద్ర ప్రభుత్వం స్పోర్ట్స్ కోటాలో ఉంది. అందులో తప్పేముందో పేర్ని నాని సమాధానం చెప్పాలి. ఆ కేటగిరీలో ఎవరికైనా ఉద్యోగాలిచ్చామా? పేర్ని నానికి ఛాలెంజ్ చేస్తున్నా.. ధైర్యముంటే వచ్చి నిరూపించు. నోరుంది కదా అని... ఏది పడితే అది వాగితే ప్రజలు తోలు వలిచేయడం తథ్యం. డీఎస్సీ గురించి రోజుకో మాట మాట్లాడుతున్న జగన్ రెడ్డి.. ఏపీపీఎస్సీలో జరిగిన అక్రమాలకు సమాధానం చెప్పాలి. వైసీపీ హయాంలో జరిగిన ఏపీపీఎస్సీలో అక్రమాలను కోర్టు ఆదేశాల మేరకు సిట్ నిగ్గుతేల్చింది. అక్రమాలు వాస్తవమని కూడా కోర్టుకు నివేదించింది. ఏపీపీఎస్సీ ప్రశ్నా పత్రాలను రిసార్టులో వేల్యేయేషన్ చేసినట్లు సిట్ పేర్కొంది. యువత జీవితాలకు మార్గం చూపే ప్రశ్నా పత్రాలను రిసార్ట్‌లో వాల్యుయేషన్ వేపిస్తారా? ఏపీపీఎస్సీలో కోట్లాది రూపాయలు దండుకున్న దుర్మార్గుడు.. డీఎస్సీపై నిందలేయడం సిగ్గుచేటు. దాదాపు 630 ఓఎంఆర్ షీట్లు రిసార్టులో ఉంచినట్లు సిట్ నివేదికలో ప్రస్తావించింది. సెంట్రల్ ఫోరెన్సిక్ ల్యాబ్... 736 మంది అభ్యర్థుల పరీక్షా పత్రాలతో కూడినటువంటి ఫైల్‌ని... ఈ ల్యాబ్‌స్‌కు పంపించడం జరిగింది. ఇది జగన్ రెడ్డి చేసిన స్కాం కాదా? 97.55% పత్రాల్లో అవకతవకలు జరిగినాయని సిట్ నివేదికలో పేర్కొనడం వాస్తవం కాదా? ఏపీపీఎస్సీ లో చేయాల్సిన ఘోరాలన్నీ చేసి.. ట్రాన్స్‌పరెంట్‌గా జరిగిన మెగా డీఎస్సీపై నిందలేస్తున్నారు. ఇప్పటికే అధికారులు డీఎస్సీ గురించి స్పష్టంగా చెప్పారు. వైసీపీ ఆరోపణలన్నింటికీ సమాధానమిచ్చారు. ఇప్పటికీ మీకు అనుమానాలుంటే..ఆధారాలతో రండి. విచారణ చేయిద్దాం. అంతేగానీ బురద జల్లేసి చేతులు కడుక్కుంటాం. గుడ్డకాల్చి మొహాన పడేద్దాం అనే ధోరణిలో వ్యవహరిస్తే ఉపేక్షించే పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమం పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారు. 16th ఫైనాన్స్ కమిషన్ నిధులు సాధించుకోవడం కోసం స్థానిక ఎన్నికలు జరపాల్సిందే. ఎన్నికలు పూర్తి చేయాలని నిర్ణయించాం. ఈ వ్యవహారంపై కూడా వైసీపీ నేతలు కోర్టుకు వెళ్లారు. ఎన్నికలు జరపకుండా ఆపాలనే ప్రయత్నం చేశారు. జనాభా ప్రాతిపదికన డివిజన్ల పెంపు జరుగుతోంది. త్వరలోనే రిజర్వేషన్లు కూడా పూర్తి చేస్తాం. బీసీ రిజర్వేషన్ల విషయం కోర్టులో ఉంది. అది కూడా క్లియర్ అయిపోయిన తర్వాత ఎన్నికల షెడ్యూల్ విడుదల చేస్తాం. మచిలీపట్నం మున్సిపాలిటీలో 60 డివిజన్ల ప్రకారమే ఎన్నికలు జరుగుతాయి. ప్రజల అభిప్రాయం మేరకు ప్రజల కోసం పాలిస్తున్నాం. అలాంటి ప్రజాస్వామ్య రాష్ట్రంలో వైసీపీ లాంటి పార్టీ ఉండడం, జగన్ రెడ్డి లాంటి దుర్మార్గులు ఉండడం మన దౌర్భాగ్యం. ప్రభుత్వ వ్యవహారాలపై ఎలాంటి అనుమానాలున్నా.. రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్ ద్వారా ఏ ఇన్ఫర్మేషన్ కావాలన్నా తెచ్చుకోవచ్చు. ప్రజలకు పారదర్శకమైన పాలన అందించడం మా బాధ్యత. ఆ మాటకు ఎప్పుడూ కట్టుబడి ఉంటాం. ఎక్కడైనా అవకతవకలు గుర్తిస్తే ఫిర్యాదు చేయాలి. అవసరమైతే కోర్టుకు వెళ్లి న్యాయపోరాటం చేయాలి. అంతేగానీ.. అబద్దాలు ప్రచారం చేస్తే మాత్రం ఎట్టి పరిస్థితుల్లో కూడా ప్రజలు క్షమించరనే విషయాన్ని జగన్ రెడ్డి అండ్ కో గుర్తుంచుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

# అభివృద్ధి, సంక్షేమమే మా అజెండా: మంత్రి సవితమ్మ

**- కక్ష సాధింపు రాజకీయాలు మా విధానం కాదు**

**- సూపర్ సిక్స్ హామీల్లో 90 శాతం అమలు చేశాం**

**- మున్సిపాలిటీలో 20 కోట్లతో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు**

**- పెనుకొండ మున్సిపాలిటీలోని 17, 18వ వార్డుల్లో పర్యటించిన మంత్రి సవిత**

**పెనుకొండ సెప్టెంబర్ 16, అనంత జనశక్తి న్యూస్**



నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర చేనేత మరియు బీసీ సంక్షేమ శాఖల మంత్రి, పెనుకొండ నియోజకవర్గ శాసనసభ్యురాలు శ్రీమతి సవితమ్మ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 26 నెలల కాలంలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. పెనుకొండ మున్సిపాలిటీ లో 17, 18వ వార్డుల్లో మంత్రి సవితమ్మ పర్యటించారు. ఈ సందర్భంగా 35 సంవత్సరాలుగా ఉన్న డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేయడంతో స్థానిక మహిళలు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం పట్టణంలో సీసీ రోడ్లను మంత్రి ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించడంతో స్థానికులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.ప్రయాణికుల సౌకర్యార్థం అంబేద్కర్ సర్కిల్‌లో సొంత నిధులతో ఏర్పాటు చేసిన నూతన బస్ షెల్టర్‌ను మంత్రి పరిశీలించారు. బస్ షెల్టర్‌ను ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉండేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.అనంతరం జూనియర్ కళాశాల మైదానాన్ని మంత్రి పరిశీలించారు. కాలేజీ గ్రౌండ్‌లో ఉన్న సమస్యలు, అభివృద్ధి చేయాల్సిన అంశాలపై అధికారులతో చర్చించారు. విద్యార్థులు, యువతతో పాటు ప్రజలకు ఉపయోగపడేలా మైదానాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో అర్హులైన 1,200 కుటుంబాలకు ఇంటి పొజిషన్ పత్రాలు అందించేందుకు చర్యలు చేపట్టామని, స్థలం ఉన్న అర్హులైన కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.పెనుకొండ మున్సిపాలిటీ అభివృద్ధికి ఇప్పటికే ₹20 కోట్ల నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే ఆయా నిధులతో అభివృద్ధి పనులను చేపడతామని మంత్రి సవితమ్మ తెలిపారు. పట్టణంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని చెప్పారు.ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. "కేసులు పెట్టడం మా నైజం కాదు.. కక్ష సాధింపు రాజకీయాలు చేయడం మా విధానం కాదు. గతంలో అధికారంలో ఉన్న సమయంలో వైసీపీ నాయకులు, అప్పటి మంత్రులు తమ సొంత కార్యకర్తలపైనా కేసులు పెట్టిన సందర్భాలు ఉన్నాయి. మేము మాత్రం కక్ష సాధింపు రాజకీయాలకు దూరంగా ఉంటూ అభివృద్ధి, సంక్షేమానికే ప్రాధాన్యత ఇస్తున్నాం" అని మంత్రి సవితమ్మ స్పష్టం చేశారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ హామీల్లో 90 శాతం హామీలను అమలు చేశామని మంత్రి తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు.మేము చేసిన అభివృద్ధి పనులను ప్రజల ముందుంచి, అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ప్రజలను అడుగుతాం. ప్రజల కోసం చేసిన పనులే మా బలం. ప్రజలకు సేవ చేయడమే మా లక్ష్యం అని మంత్రి సవితమ్మ పేర్కొన్నారు. నియోజకవర్గంలో రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల వైద్యానికి భరోసా.. కూటమి ప్రభుత్వం

**- 34 మంది లబ్ధిదారులకు రూ.46.01 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేత**

**కదిరి, సెప్టెంబర్ 16: అనంత జనశక్తి న్యూస్**



పేద కుటుంబాల్లో అనారోగ్యం కారణంగా ఎదురయ్యే ఆర్థిక ఇబ్బందులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. పేదల ఆరోగ్యం, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.కదిరి పట్టణంలోని ఆర్అండ్‌బీ వసతి గృహంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో 34 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.46,01,038 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేద కుటుంబాలకు వైద్య ఖర్చులు భారంగా మారుతున్నాయని, అలాంటి వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో భరోసా కల్పిస్తోందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. పేదలు, బలహీన వర్గాల వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు.

**కదిరి నియోజకవర్గంలో రూ.5.95 కోట్లకు పైగా సహాయం**

కదిరి నియోజకవర్గంలో ఇప్పటివరకు 688 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.5,95,46,823 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేసినట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు.ప్రజలకు ఏ కష్టం వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. కదిరి నియోజకవర్గ ప్రజల ఆరోగ్యం, సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తానని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ప్రభుత్వానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందడంతో తమ కుటుంబాలకు ఎంతో ఊరట లభించిందని లబ్ధిదారులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# మంత్రి నారా లోకేష్ రాప్తాడు పర్యటనకు చురుగ్గా ఏర్పాట్లు



**- ఈనెల 22న రాప్తాడుకు రానున్న మంత్రి నారా లోకేష్**

**- టిడిపి నాయకులతో కలసి ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే పరిటాల సునీత**

**రాప్తాడు సెప్టెంబర్ 16, అనంత జనశక్తి న్యూస్**

ఐటి విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ పర్యటనకు రాప్తాడు మండల కేంద్రంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈనెల 22వ తేదీన మంత్రి నారా లోకేష్ రాప్తాడులో పర్యటించనున్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావుతో పాటు మాజీ మంత్రి పరిటాల రవి కాంస్య విగ్రహాలను రాప్తాడులో ఏర్పాటు చేస్తున్నారు. ఈ విగ్రహాలను ఆవిష్కరించేందుకు ఆయన 22వ తేదీన రాప్తాడుకు రాన్నారు. ఈ నేపథ్యంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిటాల సునీత స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని సునీత సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ రాప్తాడుకు రానున్న నేపథ్యంలో పార్టీ శ్రేణుల్లో ఒక కొత్త ఉత్సాహం కనిపిస్తోందన్నారు. రాప్తాడు నియోజకవర్గ కేంద్రంలో ఎన్టీఆర్ తో పాటు పరిటాల రవి విగ్రహాలను ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నామని ఇన్ని రోజులకు ఆ కల నెరవేరబోతోందని అన్నారు. ఈ విగ్రహాల ఆవిష్కరణకు మంత్రి నారా లోకేష్ రావడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ పర్యటనకు సంబంధించి భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె వివరించారు...

# మోదీ జన్మదినం సందర్భంగా 108 కొబ్బరికాయలతో ప్రత్యేక పూజలు



**శింగనమల, సెప్టెంబర్ 16, అనంత జనశక్తి న్యూస్**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా శింగనమలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్సీ కాలనీలోని శ్రీశ్రీశ్రీ నల్లలమ్మ అమ్మవారి దేవాలయంలో 108 కొబ్బరికాయలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.కార్యక్రమంలో భాగంగా తొలుత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డప్పు వాయిద్యాలతో 108 కొబ్బరికాయలను తీసుకుని పాదయాత్రగా శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరి దేవి ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి నల్లలమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకుని అమ్మవారికి చీర, గాజులు, పసుపు, కుంకుమ సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా బీజేపీ ఎస్సీ మోర్చా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి పి. రామాంజనేయ ప్రసాద్ మాట్లాడుతూ పేదలు, దళితులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఎస్సీ విద్యార్థులు, యువతకు అందుబాటులో ఉన్న విద్య, ఉపాధి, స్వయం ఉపాధి పథకాలపై అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రధాని నరేంద్ర మోదీ సంపూర్ణ ఆరోగ్యంతో, ఆయురారోగ్యాలతో, దీర్ఘాయుష్షుతో దేశ సేవలో కొనసాగాలని నల్లలమ్మ అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని చెప్పారు.కార్యక్రమంలో బీజేపీ శింగనమల మండల అధ్యక్షుడు బొమ్మన ఓబులరెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మలోబుల్ శివ, నరేంద్ర యాదవ్, మదిరేపల్లి నరేష్, అంజన్ రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎండిపోతున్న పంటలు.. రైతులను ఆదుకోవాలి

**- బీటీపీ కాలువల పూర్తికి చర్యలు తీసుకోవాలి**

**: మాజీ ఎంపీ తలారి రంగయ్య**

**కళ్యాణదుర్గం సెప్టెంబర్ 16, అనంత జనశక్తి న్యూస్**

కళ్యాణదుర్గం మండలంలోని సాగునీరు అందక ఎండిపోతున్న పంట పొలాలు, తోటలను మాజీ ఎంపీ తలారి రంగయ్య క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దానిమ్మ, చీని తోటలు నీరందక ఎండిపోతున్నాయని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా తలారి రంగయ్య మాట్లాడుతూ బీటీపీ కాలువల పనులు పూర్తికాకపోవడంతో రైతులకు సాగునీరు అందడం లేదని ఆరోపించారు. 2018 నుంచి ఇప్పటివరకు కాలువల పనులు పూర్తి కాకపోవడానికి స్థానిక ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే విఫలమయ్యారని ఆరోపించారు.పలు గ్రామాల్లో తాగునీటి సమస్య కూడా తీవ్రంగా ఉందని, వసతి గృహాల విద్యార్థులకు సైతం నీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఎండిపోయిన పంటలు, తోటలకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.రైతులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని తలారి రంగయ్య స్పష్టం చేశారు.



## కలెక్టర్ బంగ్లాలో ఘనంగా
# వినాయక నిమజ్జనం



**- పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్**

**పుట్టపర్తి,సెప్టెంబర్,16:అనంత జనశక్తి న్యూస్**

శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలోని కలెక్టర్ బంగ్లాలో నిర్వహించిన శ్రీ వినాయక చవితి వేడుకలు బుధవారం నిమజ్జనోత్సవంతో ఘనంగా ముగిసాయి. రెండు రోజులుగా కలెక్టర్ బంగ్లాలో ప్రత్యేక పూజలు అందుకున్న గణపతి విగ్రహానికి జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ప్రత్యేక పూజలు, హారతి సమర్పించి యథావిధిగా నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... విఘ్నేశ్వరుని ఆశీస్సులతో శ్రీ సత్యసాయి జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.జిల్లాలో చేపడుతున్న అన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఎలాంటి విఘ్నాలు లేకుండా విజయవంతంగా పూర్తవ్వాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరేట్ సిబ్బంది ఇతర అధికారులు మరియు కలెక్టర్ కుటుంబ సభ్యులు పాల్గొని స్వామివారికి వీడ్కోలు పలికారు.

## పుట్టినరోజు నాడూ
# ప్రజా సమస్యలపై మంత్రి దృష్టి



**- హిందూ స్మశాన వాటిక కోసం స్థల పరిశీలన.....**

**ధర్మవరం సెప్టెంబర్ 16 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పట్టణంలోని హిందూ స్మశాన వాటికకు స్థల కొరత కారణంగా అంత్యక్రియల సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టిసారించారు. తన పుట్టినరోజు సందర్భంగా వేడుకలకు పరిమితం కాకుండా ప్రజా సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చారు. ధర్మవరం పట్టణంలోని తిక్కస్వామి నగర్ వద్ద మున్సిపల్ ఐ డి ఎస్ ఎం టీ పరిధిలో ఉన్న స్థలాన్ని హిందూ స్మశాన వాటిక ఏర్పాటుకు అనుకూలంగా ఉందా అనే అంశాన్ని మంత్రి పరిశీలించారు. స్థల లభ్యత, అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుపై సంబంధిత అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. పట్టణంలో స్మశాన వాటికకు స్థలం కొరతతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# డివిజన్‌లో మద్యం దుకాణాల

**- రెన్యువల్‌కు గెజిట్ విడుదల.....**

**- 21న సాయంత్రం 5 గంటల్లోపు రెన్యువల్ ఫీజు చెల్లించాలి.....**

**- రెన్యువల్‌కు ముందుకు రాని షాపులకు 22 నుంచి కొత్త టెండర్ల ప్రక్రియ....**

**ధర్మవరం సెప్టెంబర్ 16 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం ధర్మవరం, ముదిగుబ్బ, తాడిమర్రి, బత్తలపల్లి ప్రాంతాల్లోని మద్యం దుకాణాల రెన్యువల్‌కు సంబంధించి గెజిట్ విడుదలైనట్లు అనంతపురం డిప్యూటీ కమిషనర్ వరప్రసాద్, ధర్మవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఎన్. చంద్రమణి తెలిపారు. మొత్తం 18 ఓపెన్ క్యాటగిరీ, 2 రిజర్వుడ్ క్యాటగిరీ మద్యం దుకాణాలకు సంబంధించి లైసెన్సుదారులతో నిర్వహించిన సమావేశంలో రెన్యువల్ నిబంధనలు, ఫీజుల చెల్లింపు వివరాలను వెల్లడించారు. 2026–27 సంవత్సరానికి ఓపెన్, రిజర్వేషన్ కేటగిరీల కింద ఉన్న మద్యం దుకాణాల లైసెన్స్ ఫీజును నాలుగు వాయిదాల్లో చెల్లించుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే పర్మిట్ రూమ్ మొత్తాన్ని మూడు వాయిదాల్లో చెల్లించవచ్చని పేర్కొన్నారు. రెన్యువల్ చేసుకునే మద్యం దుకాణాల యజమానులు ప్రభుత్వం నిర్దేశించిన రెన్యువల్ రుసుమును ఈ నెల 21వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు చెల్లించాలని అధికారులు సూచించారు. నిర్ణీత గడువులోగా ఫీజు చెల్లించని, రెన్యువల్‌కు ముందుకు రాని దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. అలాంటి దుకాణాల స్థానంలో ఈ నెల 22వ తేదీ నుంచి కొత్త మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియను ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు రెన్యువల్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని లైసెన్సుదారులకు సూచించారు. ఈ సమావేశంలో ధర్మవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.చంద్రమణి, ఎస్సైలు చాంద్ బాషా, నాగరాజు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, మద్యం దుకాణాల లైసెన్సుదారులు పాల్గొన్నారు.



## కాలువపల్లిలో ఘనంగా బృందావనం
# వినాయక బృందం 11వ వార్షికోత్సవం

**- రూ.25 వేలకు లడ్డూ వేలం.. దక్కించుకున్న కమిటీ సభ్యులు**

**- భక్తిశ్రద్ధలతో సాగిన వినాయక ఉత్సవ వేడుకలు**

**కాలువపల్లి, సెప్టెంబర్ 15:అనంత జనశక్తి న్యూస్**

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా కాలువపల్లి గ్రామంలో బృందావనం వినాయక బృందం 11వ వార్షికోత్సవ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించింది.ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.బృందావనం వినాయక బృందం ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా ఈసారి కూడా పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా వినాయకుడి లడ్డూ ప్రసాదానికి బహిరంగ వేలంపాట నిర్వహించారు. భక్తులు, గ్రామస్థుల సమక్షంలో ఉత్సాహభరితంగా సాగిన ఈ వేలంపాటలో లడ్డూకు మంచి డిమాండ్ ఏర్పడింది.చివరకు రూ.25 వేల ధరకు సోమశేఖర్, పవన్ కుమార్, మణికంఠ, షేక్‌షావలి కలిసి లడ్డూను దక్కించుకున్నారు.లడ్డూను దక్కించుకున్న నలుగురూ బృందావనం వినాయక బృందం కమిటీ సభ్యులు కావడం ఈ వేలంపాటలో ప్రత్యేకతగా నిలిచింది. కమిటీపై తమకున్న అభిమానం, వినాయకుడిపై ఉన్న భక్తిని చాటుకుంటూ వారు లడ్డూను వేలంలో దక్కించుకున్నారు.అనంతరం కమిటీ సభ్యులు మల్లికార్జున, శివకుమార్, రామకోటి, బాలు, రాము, ఓబులేసు, చరణ్ కుమార్, చిన్న, సర్ధాని, శ్రీనివాసులు, లోకేష్ తదితరులు లడ్డూను వేలంలో దక్కించుకున్న వారికి అందజేశారు.

**భక్తిశ్రద్ధలతో వినాయక ఉత్సవాలు**

బృందావనం వినాయక బృందం 11వ వార్షికోత్సవం సందర్భంగా గ్రామంలో నిర్వహించిన కార్యక్రమాలకు భక్తులు, గ్రామస్థులు విశేషంగా హాజరయ్యారు.వినాయకుడి పూజలు, భక్తి కార్యక్రమాలతో పాటు లడ్డూ వేలంపాటను ఉత్సాహంగా నిర్వహించారు. వేలంపాట సందర్భంగా గ్రామస్థులు ఆసక్తిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.వినాయకుడి లడ్డూ ప్రసాదాన్ని వేలంలో దక్కించుకోవడం శుభప్రదంగా భావిస్తూ భక్తులు ఆసక్తి చూపడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ క్రమంలో కాలువపల్లి గ్రామంలో నిర్వహించిన వేలంపాటలో రూ.25 వేల ధర పలకడం పట్ల కమిటీ సభ్యులు, భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

**11 ఏళ్లుగా కొనసాగుతున్న ఉత్సవ సంప్రదాయం**

బృందావనం వినాయక బృందం ఆధ్వర్యంలో గత 11 ఏళ్లుగా వినాయక ఉత్సవాలను నిర్వహిస్తూ గ్రామంలో భక్తి భావాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఏడాది భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహిస్తూ గ్రామస్థులను భాగస్వాములను చేయడం ద్వారా ఐక్యతను చాటుతున్నామని పేర్కొన్నారు.ఈ ఏడాది నిర్వహించిన 11వ వార్షికోత్సవంలో లడ్డూ వేలంపాట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కమిటీ సభ్యులే లడ్డూను రూ.25 వేలకు దక్కించుకోవడంతో కార్యక్రమంలో ఉత్సాహం నెలకొంది. అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఉత్సవాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.



# ఎన్నికలొస్తున్నాయని దీక్షల డ్రామాలకు తెర లేపారు



**- మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డిపై ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం**

**- రాప్తాడులో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సునీత**

**- నీ అసమర్ధత వల్లే పేరూరు ప్రాజెక్టు పూర్తి కాలేదన్న పరిటాల సునీత**

**- సొంత ఊరికి రోడ్డు, విద్యుత్ సబ్ స్టేషన్ తెచ్చుకోలేని అసమర్ధుడు ప్రకాష్ రెడ్డి అంటూ విమర్శలు**

**- వారి వెంట వెళ్లేవారు వాస్తవాలు తెలుసుకోవాలని సూచన**

**రాప్తాడు సెప్టెంబర్ 16, అనంత జనశక్తి న్యూస్**

స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డితో పాటు వైసిపి నాయకులు దీక్షల పేరుతో డ్రామాలకు తెరలేపారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విమర్శించారు. రాప్తాడు మండలం, హార్మోని సిటీ సమీపంలో 3కోట్ల నిధులతో నిర్మించిన, 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. స్థానిక ప్రజలు, టిడిపి నాయకులు ఎమ్మెల్యే సునీతకు ఘన స్వాగతం పలికారు. అనంతరం అధికారులు, స్థానిక నాయకులతో కలిసి సబ్ స్టేషన్ ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక...తోపుదుర్తి, గొరిదిండ్ల, ముత్తవకుంట్ల విద్యుత్ సబ్ స్టేషన్లను నిర్మించి ప్రారంభించామన్నారు. రాప్తాడు విద్యుత్ సబ్ స్టేషన్ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడం వల్ల స్థానికంగా విద్యుత్ సమస్యలు ఉండవని అన్నారు. త్వరలో బండమీదపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తామన్నారు. ఆలమూరు, వేపకుంట విద్యుత్ సబ్ స్టేషన్ లు మంజూరవుతున్నాయని.. ప్యాదిండి, న్యామద్దల, దాదులూరు, కొండపల్లి, సోమలదొడ్డి, మన్నీలలో విద్యుత్ సబ్ స్టేషన్ల అవసరం ఉందన్నారు. రైతులకు నిరంతర విద్యుత్ లభించడం వలన పంటల సాగుకు ఎలాంటి అవాంతరాలు ఉండవన్నారు. ఇప్పటివరకు రైతులకు సుమారు 11వందల ట్రాన్స్ ఫార్మర్లతో పాటు కండక్టర్ కేబుల్ అందజేశామని, మంత్రి గొట్టిపాటి రవికుమార్ తో పాటు అధికారులు ఎప్పుడు ఏమి అడిగినా వెంటనే స్పందిస్తున్నారని అన్నారు. ప్రజలు కూడా సోలార్ ఏర్పాటు చేసుకోవడం వల్ల విద్యుత్ ఆదా చేసుకోవచ్చన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల దేశవ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడడంతో పాటు, ప్రస్తుతం రాప్తాడు నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా నీటి సమస్య ఉందని అయితే గ్రామాల్లో ఎక్కడ తాగునీటికీ ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక తీసుకొని నీటికి విద్యుత్ కి సమస్య లేకుండా చేస్తున్నారన్నారు. అయితే అధికారంలో ఉండగా ఏమీ చేయని కొందరు నాయకులు ఇప్పుడు జల దీక్షల పేరుతో నాటకాలు ఆడుతున్నారంటూ విమర్శలు చేశారు.

ప్రకాష్ రెడ్డి గత ఐదేళ్లలో పేరూరు ప్రాజెక్టుకు నీరు అందించే పనులు పూర్తి చేసి ఉండి ఉంటే ఈరోజు ఇలాంటి పరిస్థితి ఉండేది కాదన్నారు. అధికారంలో ఉండగా కనీసం సొంత గ్రామానికి రోడ్డు, విద్యుత్ సబ్ స్టేషన్ తెచ్చుకోలేని వ్యక్తి ఈరోజు మాపై విమర్శలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఎక్కడ తాగునీటి సమస్యకు ఇబ్బంది లేదన్నారు. హంద్రీనీవాతో పాటు పీఏబీఆర్ ద్వారా వీలైనంత చెరువులకు నీరు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎవరు నీటి విషయంలో, ప్రజలకు మంచి చేసే విషయంలో బాగా పనిచేస్తున్నారో ఆ పార్టీ నాయకులు కూడా ఒకసారి ఆలోచించుకోవాలన్నారు. ప్రజలు అలాంటి వారిని గుర్తించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత స్పష్టం చేశారు....



# రూ.13.41 కోట్లతో డీఎస్ఆర్ పాఠశాలకు ఆధునిక రూపం



**- పునర్నిర్మించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ప్రారంభించిన మంత్రి నారా లోకేష్**

**- విద్యార్థుల సమగ్ర వికాసానికి అధునాతన వసతులు: మంత్రి**

**నెల్లూరు సెప్టెంబర్ 16, అనంత జనశక్తి న్యూస్**

నెల్లూరు మూలాపేటలో ఆధునిక వసతులతో పునర్నిర్మించిన డీఎస్ఆర్ (దేవిరెడ్డి శారద) ప్రభుత్వ ఉన్నత పాఠశాలను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. దేవిరెడ్డి శారద ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు రూ.13.41 కోట్ల సీఎస్ఆర్ నిధులతో పాఠశాలను ఆధునీకరించారు.పాఠశాలకు చేరుకున్న మంత్రి లోకేష్‌కు ట్రస్ట్ ఫౌండర్, మేనేజింగ్ ట్రస్టీ డి.సుధాకర్ రెడ్డి, జాయింట్ మేనేజింగ్ ట్రస్టీ డి.ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి పాఠశాలను ప్రారంభించిన మంత్రి. శిలాఫలకాన్ని, దేవిరెడ్డి శారద విగ్రహాన్ని ఆవిష్కరించారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు.రెండంతస్తుల్లో సుమారు 24 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో 24 తరగతి గదులను నిర్మించారు. ఆధునిక బోధన కోసం 15 ఎల్ఈడీ తెరలు, 300 బెంచీలు ఏర్పాటు చేశారు. కంప్యూటర్, రోబోటిక్స్, ఖగోళ, భౌతిక, రసాయన, జీవశాస్త్ర ప్రయోగశాలలను అందుబాటులోకి తీసుకువచ్చారు. గ్రంథాలయం, కళలు, సంగీతం, భాషా గదులతో పాటు ఆధునిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు.విద్యార్థుల సమగ్ర వికాసానికి బాస్కెట్‌బాల్, పికిల్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, కోకో కోర్టులతో పాటు పిల్లల ఆటస్థలం, సెన్సరీ పార్క్, బహిరంగ వ్యాయామశాల, క్రికెట్ సాధన వలలను ఏర్పాటు చేశారు.అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యు.పద్మలత, అధికారులతో మంత్రి పాఠశాల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల హాజరు తక్కువగా ఉండటానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అభ్యసన ఫలితాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గతేడాదితో పోలిస్తే ప్రవేశాలు పెరగడంపై హర్షం వ్యక్తం చేశారు. పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా విద్యార్థులను ప్రోత్సహించాలని, మధ్యాహ్న భోజనంపై ఉపాధ్యాయుల నుంచి నిరంతరం అభిప్రాయాలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు, మంత్రి పి.నారాయణ, పి.షరణి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.







# రూ.8.3 కోట్లతో ఆర్ఎస్ఆర్ ప్రభుత్వ పాఠశాలకు ఆధునిక హంగులు

**- ఆధునీకరించిన పాఠశాలను ప్రారంభించిన మంత్రి నారా లోకేష్**
**- ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యా, క్రీడా సదుపాయాలు**

**నెల్లూరు సెప్టెంబర్ 16, అనంత జనశక్తి న్యూస్**

నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో ఆధునీకరించిన ఆర్ఎస్ఆర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం ప్రారంభించారు. వీపీఆర్ ఫౌండేషన్ రూ.8.3 కోట్ల సీఎస్ఆర్ నిధులతో పాఠశాలను ఆధునిక వసతులతో అభివృద్ధి చేసింది.పాఠశాలకు చేరుకున్న మంత్రి లోకేష్‌కు నెల్లూరు ఎంపీ, వీపీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పాఠశాల భవనాలను ప్రారంభించిన మంత్రి తరగతి గదులు, ప్రయోగశాలలు, భోజనశాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి చదువు, వసతులపై వివరాలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీశారు.రెండు అంతస్తుల్లో 43 తరగతి గదులను నిర్మించారు. డిజిటల్ బోధన కోసం ఎల్ఈడీ తెరలు, ఆధునిక బెంచీలు ఏర్పాటు చేశారు. కంప్యూటర్, రోబోటిక్స్, ఖగోళ, భౌతిక, రసాయన, జీవశాస్త్ర ప్రయోగశాలలతో పాటు కళలు, సంగీతం, నృత్యం, భాషా గదులను అందుబాటులోకి తీసుకొచ్చారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ ఆధునిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు.

**విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం**

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించేలా ఎకరా విస్తీర్ణంలో ఆటస్థలాన్ని అభివృద్ధి చేశారు. ఫుట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడా ప్రాంగణాలతో పాటు సుమారు 21 వేల చదరపు అడుగుల సింథటిక్ క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. చిన్నారుల ఆట స్థలం, ఇంద్రియ వికాస పార్కు, బహిరంగ వ్యాయామశాల వంటి సదుపాయాలు కల్పించారు.

**విద్యా ప్రమాణాల పెంపుపై దృష్టి**

పాఠశాల ప్రారంభం అనంతరం మంత్రి లోకేష్ ప్రధానోపాధ్యాయుడు కే. ప్రసాద్, అధికారులతో పాఠశాల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల అభ్యసన ఫలితాలు, హాజరు, ప్రవేశాలపై వివరాలు తెలుసుకున్నారు. గత ఏడాది పదో తరగతిలో 60.19 శాతం ఉత్తీర్ణత నమోదైన నేపథ్యంలో ఈ ఏడాది ఫలితాలను మరింత మెరుగుపరచాలని సూచించారు. విద్యార్థుల హాజరు, ప్రవేశాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మంత్రి పి. నారాయణ, నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పి. షరణి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.






# జర్నలిస్టుల ప్రతిభకు రాష్ట్ర ప్రభుత్వ పురస్కారం

2025 ఉత్తమ జర్నలిస్టు అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం - 12 విభాగాల్లో పురస్కారాలు
రూ.2 లక్షల నుంచి రూ.1 లక్ష వరకు నగదు పురస్కారాలు - సెప్టెంబరు 28లోగా దరఖాస్తులు
రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్

విజయవాడ, సెప్టెంబరు 16: 2026: జర్నలిజం రంగంలో విశేష సేవలందిస్తూ, వృత్తిపరమైన ప్రతిభను కనబరిచిన పాత్రికేయులను ప్రోత్సహించి, వారి సేవలను గుర్తించి గౌరవించేందుకు 2025 సంవత్సరానికి 12 విభాగాల్లో ఉత్తమ జర్నలిస్టు అవార్డులు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ అవార్డులకు అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు ఆయా విభాగాలకు చెందిన జర్నలిస్టుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్ ఒక ప్రకటనలో తెలిపారు.

అర్హులైన జర్నలిస్టులు తమ దరఖాస్తులను 2026 సెప్టెంబరు 28వ తేదీ సాయంత్రం 5.00 గంటల్లోగా కింది చిరునామాకు పంపించాలని ఆయన సూచించారు.

డైరెక్టర్,
సమాచార పౌరసంబంధాల శాఖ,
2వ అంతస్తు, ఎన్టీఆర్ పరిపాలన భవనం,
పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్,
విజయవాడ 520013.

కమిటీ విచక్షణాధికారంతో ఎంపిక చేసే పురస్కారాలు
కింది మూడు పురస్కారాలకు జర్నలిస్టుల నుంచి ప్రత్యేకంగా దరఖాస్తులు స్వీకరించకుండా, ఎంపిక కమిటీ తన విచక్షణాధికారంతో పురస్కార గ్రహీతలను ఎంపిక చేస్తుంది.
1. వి.ఆర్. నార్ల జీవిత సాఫల్య పురస్కారం
2. కొక్కు అహోబలరావు ఉత్తమ ఫోటో జర్నలిస్టు అవార్డు
3. మద్దూరి అన్నపూర్ణయ్య పేరిట రాష్ట్రంలోని చిన్న, మధ్యతరహా వార్తాపత్రికల సంపాదకులకు అందించే అవార్డు

దరఖాస్తుల ఆధారంగా కమిటీ ఎంపిక చేసే అవార్డులు
1. కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు ఉత్తమ జర్నలిస్టు అవార్డు
నగదు పురస్కారం: రూ.2 లక్షలు
అర్హతలు:
జర్నలిజం వృత్తిలో కనీసం 10 సంవత్సరాల అనుభవం కలిగి, వృత్తిపరమైన ప్రతిభను కనబరిచిన పూర్తికాలపు జర్నలిస్టులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రచురితమవుతున్న పేరొందిన తెలుగు, ఆంగ్ల వార్తాపత్రికలు లేదా పీరియాడికల్స్ కోసం ఆంధ్రప్రదేశ్‌లో లేదా రాష్ట్రం వెలుపల పనిచేస్తున్న జర్నలిస్టులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
2. ఉత్తమ గ్రామీణ జర్నలిస్టు అవార్డులు
గ్రామీణ జర్నలిజంలో విశేష ప్రతిభ కనబరిచిన ముగ్గురు జర్నలిస్టులకు ప్రముఖ పాత్రికేయుల పేర్లతో మూడు అవార్డులు అందజేస్తారు.
ఖాసా సుబ్బారావు ఉత్తమ గ్రామీణ జర్నలిస్టు అవార్డు
ముట్నూరి కృష్ణారావు ఉత్తమ గ్రామీణ జర్నలిస్టు అవార్డు
మద్దుకూరి చంద్రశేఖరరావు ఉత్తమ గ్రామీణ జర్నలిస్టు అవార్డు
ఒక్కో అవార్డు నగదు పురస్కారం: రూ.1 లక్ష
అర్హతలు:
ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రచురితమవుతున్న తెలుగు, ఆంగ్ల దినపత్రికల్లో గ్రామీణ ప్రాంతాల్లో కనీసం 3 సంవత్సరాల అనుభవం కలిగిన పాత్రికేయులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. గ్రామీణ రిపోర్టింగ్‌లో విశేష అనుభవం గడించిన మాజీ జర్నలిస్టులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
3. సావిత్రిబాయి పూలే ఉత్తమ మహిళా జర్నలిస్టు అవార్డు
నగదు పురస్కారం: రూ.1 లక్ష
అర్హతలు:
రాష్ట్రంలో వెలువడే తెలుగు, ఆంగ్ల వార్తాపత్రికలు లేదా పీరియాడికల్స్‌లో పనిచేస్తున్న మహిళా రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.
4. ఉత్తమ కార్టూనిస్టు అవార్డు
నగదు పురస్కారం: రూ.1 లక్ష
అర్హతలు:
ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రచురితమవుతున్న తెలుగు, ఆంగ్ల దినపత్రికల్లో పనిచేస్తున్న కార్టూనిస్టులు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 10 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలి.
5. అబుల్ కలాం ఆజాద్ ఉత్తమ ఉర్దూ జర్నలిస్టు అవార్డు
నగదు పురస్కారం: రూ.1 లక్ష
అర్హతలు:
ఉర్దూ పత్రికల్లో జర్నలిస్టుగా పనిచేస్తూ కనీసం 10 సంవత్సరాల అనుభవం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఉర్దూ జర్నలిజానికి అందించిన సేవలు, గ్రామీణ ప్రాంతాల సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై చేసిన రిపోర్టింగ్, మొత్తం వృత్తిపరమైన పనితీరును ప్రామాణికంగా తీసుకుని అవార్డు గ్రహీతను ఎంపిక చేస్తారు.
6. ఉత్తమ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు అవార్డు
నగదు పురస్కారం: రూ.1 లక్ష
అర్హతలు:
కనీసం 5 సంవత్సరాల అనుభవం కలిగి, ఆంధ్రప్రదేశ్‌లో ప్రసారమయ్యే ఎలక్ట్రానిక్ మీడియా ఛానళ్లు, కేబుల్ నెట్‌వర్క్‌లలో పనిచేస్తున్న జర్నలిస్టులు దరఖాస్తు చేసుకోవచ్చు. దూరదర్శన్, రేడియోలో పనిచేస్తున్న జర్నలిస్టులు కూడా దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.
7. ఉత్తమ వీడియో జర్నలిస్టు అవార్డు
నగదు పురస్కారం: రూ.1 లక్ష
అర్హతలు:
కనీసం 5 సంవత్సరాల అనుభవం కలిగి, ఎలక్ట్రానిక్ మీడియా ఛానళ్లలో పనిచేస్తున్న వీడియో జర్నలిస్టులు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు విధానం - ముఖ్య నిబంధనలు జర్నలిస్టులు తాము పనిచేస్తున్న సంస్థ, ఉద్యోగ వివరాలు, తమ అర్హతలకు సంబంధించిన పూర్తి వివరాలతో వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుతో పాటు కనీసం 5 వ్యాసాలు, వార్తా కథనాలు, ఫొటోలు, కార్టూన్లు లేదా వీడియో క్లిప్పింగ్స్ జతచేయాలి. అవి 2025 క్యాలెండర్ సంవత్సరంలో (01012025 నుంచి 31122025 వరకు) ప్రచురితమైనవి/ప్రసారమైనవి అయి ఉండాలి.వ్యాసాలు, వార్తా కథనాలు తదితర ఆర్టికల్స్‌ను ఫొటోకాపీల రూపంలో కూడా దాఖలు చేయవచ్చు.అవార్డు గ్రహీతల ఎంపికకు సంబంధించి ఎంపిక కమిటీదే తుది నిర్ణయం. ఈ విషయంలో ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు అనుమతించబడవు.ఏదైనా విభాగంలో తగిన సంఖ్యలో లేదా తగిన ప్రమాణాలతో దరఖాస్తులు అందలేదని కమిటీ భావించినట్లయితే, సంబంధిత అవార్డును ప్రకటించకుండా నిలిపివేసే అధికారం ఎంపిక కమిటీకి ఉంటుంది.ఉత్తమ జర్నలిస్టు పురస్కారాలకు సంబంధించిన అర్హతలు, దరఖాస్తు విధానం, ఇతర నిబంధనలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలోని మీడియా రిలేషన్స్ వెబ్‌సైట్‌లో పరిశీలించవచ్చు: (https://mediarelations.ap.gov.in/media)

# స్థానిక ఎన్నికలకు టీడీపీ శ్రేణులు సమర సన్నద్ధం కావాలి

**- ప్రతి క్లస్టర్, యూనిట్‌లో పటిష్ట సమన్వయంతో ముందుకు సాగాలి**
**- సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి.. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**

**అనంతపురం సెప్టెంబర్ 16, అనంత జనశక్తి న్యూస్**



రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో సమర సన్నద్ధం కావాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు పిలుపునిచ్చారు. అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జులు, పార్టీ నాయకులతో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు సమావేశం నిర్వహించారు. రానున్న స్థానిక ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, క్షేత్రస్థాయి సమన్వయం, నాయకులు-కార్యకర్తల మధ్య అనుసంధానం, ప్రజలతో మమేకం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికలు పార్టీకి అత్యంత కీలకమైనవి. ప్రతి క్లస్టర్, ప్రతి యూనిట్, బూత్ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు.

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా క్షేత్రస్థాయిలో సహకరించాలని సూచించారు. అనంతపురం నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని తెలిపారు.

**పింఛన్ దరఖాస్తులకు మరో రెండు రోజుల అవకాశం**

అర్హులైన పింఛన్ లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం మరో రెండు రోజుల సమయం కల్పించిందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా టీడీపీ నాయకులు, కార్యకర్తలు చొరవ చూపాలని సూచించారు. అర్హత ఉన్న ఒక్క లబ్ధిదారుడు కూడా అవకాశం కోల్పోకూడదని, తమ పరిధిలోని ప్రజలకు పింఛన్ దరఖాస్తు ప్రక్రియపై అవగాహన కల్పించి, అవసరమైన సహకారం అందించాలి. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రజలకు తెలియజేయడంలో పార్టీ శ్రేణులు చురుకైన పాత్ర పోషించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు పేర్కొన్నారు.

## మౌలిక సదుపాయాలు కల్పించాలి...



**- జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్**

**అనంతపురం ,సెప్టెంబర్16:అనంత జనశక్తి న్యూస్**

బుక్కరాయసముద్రం మండలపరిధిలోనికేంద్రీయ విశ్వవిద్యాలయం అభివృద్ధి లో భాగంగా పెండింగ్ లో ఉన్న పనులను సత్వరమే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ తో కలిసి వివిధ శాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ పనితీరుపై సంబంధిత విశ్వవిద్యాలయ ప్రతినిధులతో అడిగి తెలుసుకున్నారు.

అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూయూనివర్సిటీలో ఇదివరకే చేపట్టిన పనులను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని ముఖ్యంగా జంతులూరు నుండి కొర్రపాడువైపు ఉన్న యూనివర్సిటీ ప్రహరీ గోడ నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. అలాగే యూనివర్సిటీలోని పాత బోర్లనుమినహాయించి నూతనంగా జంతలూరు లో ప్రజల నూతనంగా 3 నీటి బోర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా కాంపౌండ్ వాల్ , మట్టిరోడ్డుపనులమంజూరు కు సంబంధించి ప్రతిపాద నలుసమర్పించాలనిఇంజనీరింగ్అధికారులను ఆదేశించారు .యూనివర్సిటీ భూమి వివరాలను సమర్పించాలని బుక్కరాయ సముద్రం తాసిల్దార్ కు జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ కివాడే, ప్రొ. హనుమాన్ కెనడి, బుక్కరాయసముద్రం తాసిల్దార్ శ్రీధర్ మూర్తి, పంచాయతీరాజ్ ఎస్. ఈ. సుబ్బరాయుడు,ఆర్డబ్ల్యూ ఎస్ .ఎస్. ఈ. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన దృష్టి



**- గుంటూరు పార్లమెంట్ పరిధిలో కీలక సమావేశం..**
**- విజయవాడ, గుంటూరు పార్లమెంట్ స్థానిక ఎన్నికల నిర్వహణ సమన్వయకర్త, మంత్రి కందుల దుర్గేష్‌కి బలమైన స్థానాల నివేదిక అందజేత**
**స్థానిక పోరులో జనసేన గెలుపే లక్ష్యంగా మంత్రి కందుల దుర్గేష్ దిశానిర్దేశం**

**మంగళగిరి సెప్టెంబర్ 16, అనంత జనశక్తి న్యూస్**

క్షేత్రస్థాయిలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా జనసేన అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడమే ధ్యేయంగా మంత్రి కందుల దుర్గేష్ నేతృత్వంలో గుంటూరు పార్లమెంట్ పరిధిలోని డివిజన్లు, వార్డుల వారీగా జనసేన వ్యూహాలు సిద్ధం చేస్తోంది. ఈ నేపథ్యంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతలో భాగంగా జనసేన పార్టీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమన్వయ సమావేశం బుధవారం మంగళగిరిలో నిర్వహించారు. మంగళగిరి-తెనాలి ఫ్లైఓవర్ సమీపంలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి స్థానిక ఎన్నికల నిర్వహణ సమన్వయ కమిటీ సభ్యులు, ఏపీఎంఎస్ఐడీసీ (ఏపీ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్)చైర్మన్, మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి విజయవాడ, గుంటూరు పార్లమెంట్ స్థానిక ఎన్నికల నిర్వహణ సమన్వయకర్త, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గుంటూరు పార్లమెంట్ పరిధిలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో డివిజన్లు, వార్డుల వారీగా పార్టీకి బలమైన పట్టున్న స్థానాల సమగ్ర జాబితాను నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు, నాయబ్ కమల్, బిట్రగుంట మల్లికలతో పాటు ఎన్నికల నిర్వహణ సహాయక బృందం సభ్యులు మంత్రి కందుల దుర్గేష్‌కి సమర్పించారు. అనంతరం రాబోయే స్థానిక పోరులో క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన వ్యూహాలు, పొత్తుల సమన్వయం, తదుపరి కార్యాచరణ ప్రణాళికపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ సమావేశంలో జనసేన పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, నియోజకవర్గ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## కిరికెర ఎల్ఆర్జీ విద్యాలయంలో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన

**హిందూపురం సెప్టెంబర్ 16 అనంత జనశక్తి న్యూస్**

హిందూపురం పట్టణం కిరికెరలోని ఎల్ ఆర్ జి విద్యాలయం లో పోషణ, మానసిక ఆరోగ్యం, సామర్థ్యాభివృద్ధి, భద్రతపై అవగాహన అఖిల భారత చిన్నపిల్లల వైద్యుల సమాఖ్య ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఓజస్' పాఠశాలల్లో చిన్నపిల్లలు, కిశోర బాలబాలికల ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమం కార్యక్రమంలో భాగంగా బుధవారం కిరికెరలోని ఎల్ఆర్జీ విద్యాలయంలో పాఠశాల విద్యార్థులు, కిశోర బాలబాలికలకు ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పోషకాహారం, మానసిక ఆరోగ్యం, సామర్థ్యాభివృద్ధి (సక్షమ్), భద్రత (సురక్ష) అనే నాలుగు ప్రధాన అంశాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, మానసిక ఆరోగ్య పరిరక్షణ, వ్యక్తిగత సామర్థ్యాల పెంపు, సురక్షితమైన జీవన విధానంపై వైద్యులు విద్యార్థులకు వివరించారు. శ్రీ సత్యసాయి జిల్లా చిన్నపిల్లల వైద్యుల సమాఖ్య అధ్యక్షులు డా. కె. కేశవులు, కార్యదర్శి డా. రామచంద్రరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ డా. ఆదినారాయణ ఈ కార్యక్రమ వివరాలను తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుధ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, ఉపాధ్యాయుల సమక్షంలో కార్యక్రమం నిర్వహించారు.



# జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉమ్మడిగా కృషి చేయాలి..

- కేంద్ర ప్రభుత్వ పథకాలను జిల్లాలో సజావుగా అమలు చేయాలి
- పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ
- జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి
- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**అనంతపురం, సెప్టెంబర్ 16 : అనంత జనశక్తి న్యూస్**

జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉమ్మడిగా కృషి చేయాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను జిల్లాలో సక్రమంగా, మరింత బాగా అమలు చేయాలని పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలోని డిపిఆర్సీ సమావేశ మందిరంలో దిశా (జిల్లా అభివృద్ధి సమన్వయ & పర్యవేక్షణ కమిటీ) సమావేశాన్ని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించగా, జడ్పి చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి, ఆయా శాఖల జిల్లా అధికారులు, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు అంబికా మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజాప్రతినిధులు మరియు జిల్లా అధికారులు కలసికట్టుగా ముందుకు సాగాలన్నారు. జిల్లాలోని ప్రధాన సమస్యలను గుర్తించి, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో అధికారుల బాధ్యతను మరింత సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా జిల్లాను 'సస్యశ్యామలం' చేయడమే ప్రధాన లక్ష్యం అన్నారు. ప్రతి మూడు నెలలకొకసారి దిశా సమావేశం ఏర్పాటు చేయనున్నామన్నారు. దాదాపు 108 కేంద్ర ప్రయోజిత పథకాలు అమలులో ఉన్నాయని, జిల్లా ప్రయోజనాల కోసం నిధుల విడుదలకు కేంద్ర స్థాయిలో బలంగా స్వరం వినిపిస్తున్నామన్నారు.ప్రధానమంత్రి గారిని నేరుగా కోరిన మీదట 'జలజీవన్ మిషన్' ద్వారా జిల్లాకు అవసరమైన నిధుల మంజూరు ప్రక్రియ వేగవంతమైందన్నారు.రాయలసీమ వెనుకబడిన జిల్లాల అభివృద్ధి ఫండ్ కింద గతంలో నిలిచిపోయిన నిధులను, పార్లమెంట్ లో ప్రశ్నించడం ద్వారా తిరిగి ప్రతి సంవత్సరం ₹50 కోట్లు చొప్పున జిల్లా అభివృద్ధికి వచ్చేలా కృషి చేయడం జరిగిందన్నారు. నిధుల వినియోగం, పథకాల పురోగతిపై అధికారులు సరైన వివరాలు మరియు సమాచారాన్ని ప్రజాప్రతినిధులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మరిన్ని నిధులు తీసుకురావడానికి అవకాశం ఉంటుందన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో ముందంజలో ఉంచేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఐక్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు.ఎంపీ నిధులకు సంబంధించి 12.54 కోట్ల రూపాయలు 154 పనులకు మంజూరు కాగా, అందులో 6.31 కోట్ల రూపాయలకు సంబంధించి పనులను గుర్తించాలన్నారు. ఎంపీ నిధుల కింద ఎక్కువ నిధులు జిల్లాకు తీసుకురావడం జరిగిందని, పూర్తయిన పనులకు ప్రారంభోత్సవాలు చేపట్టాలన్నారు. జిజిహెచ్ లో విశ్రాంతి భవనంలో అవసరమైన సదుపాయాలు కల్పించి దానిని త్వరగా ప్రారంభించాలన్నారు. ప్రజలకు అవసరమైన అత్యాసర పనులను వేగంగా చేపట్టాలని, త్రాగునీటికి అవసరమైన నిధులు కేటాయిస్తామని, ఎక్కడైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలన్నారు. జల్ జీవన్ మిషన్ పనులను తొందరగా చేయించాలని, 136 కోట్ల రూపాయలు ఇప్పటివరకు ఖర్చు చేయగా, ఆన్లైన్లో మాత్రం 7.68 కోట్లు ఖర్చు చేసినట్లు వస్తోందని, పూర్తయిన పనులకు బిల్లులు అప్లోడ్ పెండింగ్ ఉంచరాదన్నారు. జల్ జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి సురక్షితమైన త్రాగునీరు అందించాలన్నారు. అనంతపురం నగరంలోని ట్రెల్లిస్ స్కూల్ ఘటనలో చిన్నారి తల్లిదండ్రులను బెదిరిస్తున్నారని చెబుతున్నారని, ట్రెల్లిస్ పాఠశాల లైసెన్స్ ని రద్దు చేయించాలని, త్రీ మెన్ కమిటీ నివేదిక వచ్చాక తగిన చర్యలు తీసుకోవాలని డిఈఓని ఆదేశించారు. ఓఎన్జిసి వారు ఐదువేల యూనిఫార్మ్స్ ఇవ్వడం జరిగిందని, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టల్స్ లలో యూనిఫాం అందించేందుకు విద్యార్థులను గుర్తించాలన్నారు. మధ్యాహ్న భోజనంపై ఫిర్యాదులు వస్తే క్షేత్రస్థాయిలో డీఈవో పర్యటించాలని, స్పెషల్ డ్రైవ్ చేయాలని, సోమవారం నుంచి శుక్రవారం వరకు పాఠశాలల్లో తనిఖీలు చేపట్టాలన్నారు. ఆయా పాఠశాలల్లో అవసరమైతే ఆర్ఓ ప్లాంట్ల ఏర్పాటుకు ఎంపీ నిధులను కేటాయిస్తామన్నారు. పాఠశాలల్లో బాలికలకు సమాజంలో పరిస్థితి ఎలా ఉంది, భవిష్యత్తుపై భయాలు తొలగించేలా, వారిలో ధైర్యం నింపేలా మోటివేట్ చేయాలన్నారు. అర్హత కలిగిన వారికి పెన్షన్స్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత ఎల్.నినో పరిస్థితులలో వరి, మిరప సాగు చేయొద్దని రైతులకు తెలియజేశామని అధికారులు తెలపగా, వచ్చే జూన్ వరకు వర్షాలు వచ్చే పరిస్థితి లేదని, మొదట త్రాగునీటికి, తర్వాత పశుగ్రాసం సాగు కోసం నీటిని అందించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఈ విషయమై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఎల్.నినో వేళ ఉద్యాన మొక్కలను సంరక్షించుకోవాలని, నీటి సమస్య వల్ల మొక్కలు ఎండిపోయే ప్రమాదం ఉందని, వాటికి నీరు ఇచ్చేలా చూడాలన్నారు. జాతీయ రహదారి కింద రుద్రంపేట జంక్షన్ లో వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఇబ్బంది పడడం జరుగుతుందని, అక్కడ రహదారిని విస్తరించాలన్నారు. కల్లూరు ఆర్ఓబిలో ఎప్పుడు నీరు నిల్వ ఉంటుందని, రైల్వే బ్రిడ్జి కిందకు నీరు వెళ్లకుండా డైవర్ట్ చేయాలన్నారు. వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి ప్రోటోకాల్ పాటించాలన్నారు. ఆయా శాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకు వస్తే వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.ఈ సందర్భంగా జడ్పి చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ ప్రస్తుత ఎల్.నినో పరిస్థితుల్లో త్రాగునీటికి నిధులను కేటాయించాలని, కమ్యూనిటీ భవనాలకు కూడా ఎంపీ నిధులను కేటాయించాలన్నారు. జిల్లా పరిషత్ నుంచి త్రాగునీటికి నిధులు కేటాయిస్తున్నామని, ఆర్డబ్ల్యూఎస్, మున్సిపాలిటీల నుంచి యూజర్ చార్జెస్ రావడంలేదని, అవి వచ్చేలా చూడాలన్నారు. పాఠశాలలు, గురుకులాల్లో చిన్నారులకు భద్రత కరువైందని, బాలికలను ఇబ్బంది పెడుతున్న వారికి కఠిన శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలన్నారు. పిల్లల ఆరోగ్యం, భద్రత, రక్షణ చాలా ముఖ్యమైనదని, ట్రెల్లిస్ ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కంబదూరు, నార్పల, తదితర ప్రాంతాల్లో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అమలు చేయడం లేదని, డిఈఓ క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. ప్రస్తుతం టీనేజీ ప్రెగ్నెన్సీలు ఎక్కువ అవుతున్నాయని, వాటిని అరికట్టాలన్నారు. కొన్ని పాఠశాలల్లో పైకప్పు పెచ్చులు ఊడుతున్నాయని, వాటికి మరమ్మతులు చేయించాలన్నారు. పెన్షన్స్ కోసం దరఖాస్తు చేయడానికి సచివాలయానికి వెళ్తే అక్కడ సిస్టమ్స్ పనిచేయడం లేదని, వాటిని సరిచేయాలన్నారు. మహిళలకు బ్యాంకు లింకేజీ, రుణాల మంజూరులో సమస్యలను పరిష్కరించాలన్నారు. జిల్లా పరిషత్ కి 16వ ఫైనాన్స్ నిధులు రావడం లేదని, వచ్చేలా చూడాలన్నారు. ఎల్.నినో పరిస్థితులతో నష్టపోయిన వ్యవసాయ, ఉద్యాన రైతులకు సహాయం చేయాలన్నారు. ఎల్.నినో పరిస్థితిలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ దిశా సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ఇంజనీరింగ్ శాఖల అధికారులు ఆయా నియోజకవర్గాల్లో పూర్తయిన పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం నెలకొన్న ఎల్.నినో పరిస్థితుల నేపథ్యంలో ఉద్యాన పంటల మొక్కలను బతికించాలని ఇందుకు అధికారులు సన్నద్ధంగా ఉండాలన్నారు. ఏపీఎంఐపి నుంచి నాన్ సబ్సిడీ కనెక్షన్స్ లక్ష్యం మేరకు చేపట్టాలన్నారు. మహాప్రస్థానం వాహనం కోసం డ్రైవర్ నియామకానికి అవసరమైన ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఆయా పాఠశాలల్లో అవసరమైన చోట అదనంగా గదులను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించాలన్నారు. అందరు హెచ్వోడీలు స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలు చేపట్టాలని, ఇందులో క్షేత్రస్థాయిలో సిబ్బందిని కూడా భాగస్వామ్యం చేయాలన్నారు.ఈ సమావేశంలో సిపిఓ బాలాజీ నాయక్, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ కె.శ్రీనివాసులు, డిపిఓ నాగరాజునాయుడు, డ్వామా పిడి సలీమ్ భాష, పంచాయతీరాజ్ ఎస్ఈ సుబ్బరాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి సాలురెడ్డి, పశుసంవర్ధక శాఖ జెడి ప్రేమ్ చంద్, ఎపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, హౌసింగ్ పిడి శైలజ, డిఆర్డీఏ పిడి శైలజ, మైన్స్ డిడి ఆదినారాయణ, నాబార్డు ఏజిఎం అనురాధ, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాసరావు, మెప్మా పిడి విశ్వజ్యోతి, ఎస్సి కార్పొరేషన్ ఈడి కుముద, డిఎంహెచ్ఓ కట్ట వెంకటేశ్వర్లు, డిఎండబ్ల్యూఓ రామసుబ్బారెడ్డి, డిటిడబ్ల్యూఓ శ్రీనివాసరావు, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి అర్చన, డిఈఓ అయూబ్ హుస్సేన్, ఆర్ఐఓ వెంకటరమణనాయక్, రెడ్స్ సంస్థ భానుజా, ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం శ్రీలక్ష్మి, ఎన్టీఆర్ వైద్య సేవ కోఆర్డినేటర్ గంగాధర్ రెడ్డి, స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, డి.ఎస్.ఓ శోభారాణి, జిజిహెచ్ సూపరింటెండెంట్ డా.మల్లీశ్వరి, కమిటీ మెంబర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు



## ఎన్డీఏ కార్యాలయంలో మంత్రి సత్యకుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు



- కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, అభిమానుల అభినందనలు.....

**ధర్మవరం సెప్టెంబర్ 16 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, సత్యకుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు బుధవారం ధర్మవరం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్డీఏ కార్యాలయంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు మంత్రిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జన్మదినాన్ని పురస్కరించుకుని మంత్రి సత్యకుమార్ యాదవ్ తొలుత ధర్మవరం పట్టణంలోని శివానగర్‌లో ఉన్న శివాలయాన్ని సందర్శించారు. ఆలయ నిర్వాహకులు, భక్తులు ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం పరమశివునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో వర్ధిల్లాలని, ప్రజలకు ఎల్లప్పుడూ మంచి జరగాలని మంత్రి ఆకాంక్షించారు. ధర్మవరం నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి సర్వతోముఖాభివృద్ధి దిశగా ముందుకు సాగాలని పరమశివుడిని ప్రార్థించారు.

అనంతరం ఎన్డీఏ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఉమ్మడి అనంతపురం జిల్లా, ధర్మవరం నియోజకవర్గ అధికారులు మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి తమ అభినందనలు తెలియజేశారు. మంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని ఎన్డీఏ కార్యాలయం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. ప్రజలు, అభిమానులు, కార్యకర్తలకు స్వయంగా భోజనం వడ్డించారు. అనంతరం వారితో ఆత్మీయంగా మమేకమై యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి జన్మదిన వేడుకల సందర్భంగా ఎన్డీఏ కార్యాలయం వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండి ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.

## పెన్షన్ల దరఖాస్తుకు సెప్టెంబర్ 18 వరకు గడువు పెంపు.

- మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో.

**ధర్మవరం సెప్టెంబర్ 16, అనంత జనశక్తి న్యూస్:**

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద సామాజిక భద్రత పింఛన్లకు దరఖాస్తు చేసుకునే గడువును సెప్టెంబర్ 18 వరకు పొడిగించడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, ఎంపీడీవో వెంకటేశు తెలిపారు. ఇంకనూ పెన్షన్ కు అర్హత ఉండి దరఖాస్తు చేసుకోని వారు ఈ అవకాశమును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కూడా వారు స్పష్టం చేశారు.



## వాజ్‌పేయి స్మారక క్రికెట్ టోర్నమెంట్ విజేత డ్రాగన్ ఎలెవన్

- ఫైనల్‌లో పెనుకొండపై 65 పరుగుల తేడాతో విజయం.....

**ధర్మవరం సెప్టెంబర్ 16 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి స్మారకార్థం, ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ధర్మవరం పట్టణంలోని ఆర్డీటీ మైదానంలో నిర్వహించిన అటల్ బిహారీ వాజ్‌పేయి స్మారక క్రికెట్ టోర్నమెంట్ మూడో సీజన్ ఫైనల్ బుధవారం ఉత్కంఠభరితంగా జరిగింది. ఫైనల్ మ్యాచ్‌ను రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి,సత్యకుమార్ యాదవ్ వీక్షించారు.

ఫైనల్‌లో డ్రాగన్ ఎలెవన్, పెనుకొండ జట్లు తలపడగా.. తొలుత బ్యాటింగ్ చేసిన డ్రాగన్ ఎలెవన్ నిర్ణీత 15 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 239 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన పెనుకొండ జట్టు 15 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. దీంతో డ్రాగన్ ఎలెవన్ జట్టు 65 పరుగుల తేడాతో విజయం సాధించి టోర్నమెంట్ విజేతగా నిలిచింది.




విజేత డ్రాగన్ ఎలెవన్ జట్టుకు మంత్రి సత్యకుమార్ యాదవ్ రూ.లక్ష నగదు బహుమతి, విజేత ట్రోఫీని అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన పెనుకొండ జట్టుకు రూ.50 వేల నగదు బహుమతి, రన్నరప్ ట్రోఫీని అందించారు. ఫైనల్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన డ్రాగన్ ఎలెవన్ ఆటగాడు ఎం.ప్రశాంత్ ఉత్తమ ఆటగాడిగా ఎంపికయ్యారు. పెనుకొండ జట్టు ఆటగాడు ఆసిఫ్ అన్వర్ ఉత్తమ బౌలర్‌గా నిలిచారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. క్రీడలు యువతలో క్రమశిక్షణ, పట్టుదల, సమయస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. గెలుపు, ఓటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని యువతకు సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. క్రమశిక్షణతో నిరంతరం సాధన చేస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. ధర్మవరం నియోజకవర్గంలో క్రీడల్లో రాణించే యువతకు అన్ని విధాలా ప్రోత్సాహం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

టోర్నమెంట్ విజేత డ్రాగన్ ఎలెవన్, రన్నరప్ పెనుకొండ జట్లతో పాటు ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను మంత్రి అభినందించారు.

కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, బీజేపీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు జి.ఎం.శేఖర్, బీజేపీ సత్యసాయి జిల్లా ఇన్‌చార్జి కునిగిరి నీలకంఠ, క్రీడాకారులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాల విద్యార్థులు పారిశ్రామిక సందర్శన

- పరిశ్రమల సందర్శనలు వారి నైపుణ్యాలను పెంచడానికి ఎంతగానో తోడ్పడుతాయి.

**అగళి సెప్టెంబర్ 16,అనంత జనశక్తి న్యూస్:**

మండల కేంద్రమైన అగళి ఆదర్శ పాఠశాల 9,10,11,12వ తరగతిలో ఒకేషనల్ కోర్సులు బ్యూటీ అండ్ వెల్నెస్ చదువుతున్న విద్యార్థులను ఇండస్ట్రియల్ విజిట్ లో భాగంగా మండల కేంద్రమైన అగళిలో ఉన్న బ్యూటీ పార్లర్ కు బుధవారం విద్యార్థులు సందర్శించడం జరిగిందని ప్రిన్సిపాల్ విజయకుమారి ఒకేషనల్ కోర్స్ బ్యూటీ అండ్ వెల్నెస్ ఉపాధ్యాయురాలు నాగరత్నమ్మ తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాలలలో నేర్చు కోవడమే కాకుండా ప్రాక్టికల్ గా చూసినట్లయితే వృత్తిలో అనుభవం కలుగుతుందనే ఉద్దేశంతో ఇండస్ట్రియల్ విసిట్ ద్వారా విద్యార్థులకు మంచి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉద్యోగాలు కూడా తొందరగా వస్తాయని ఈ కోర్సులు మన అగళి మోడల్ స్కూల్ నందు మాత్రమే ఉండడం వల్ల ఇక్కడ విద్యార్థులకు అనుకూలంగా ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ విజయకుమారి మరియు ఒకేషనల్ కోర్స్ బ్యూటీ అండ్ వెల్నెస్ నాగరత్నమ్మ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే ఇలాంటి వృత్తి విద్యా కోర్సులు మరియు పరిశ్రమల సందర్శనలు వారి నైపుణ్యాలను పెంచడానికి ఎంతగానో తోడ్పడుతాయని తెలిపారు.




## "రెవెన్యూ క్లినిక్ "ప్రారంభం

- తహశీల్దార్ ప్రతాప్ రెడ్డి

**యాడికి , సెప్టెంబర్ 16, అనంత జనశక్తి న్యూస్ :**

పి జి ఆర్ యస్ అర్జీల పరిష్కార విషయమై కలెక్టర్ "రెవెన్యూ క్లినిక్" ను ప్రారంభించారని తహశీల్దార్ ప్రతాప్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతు "రెవిన్యూ క్లినిక్" కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వచ్చిన భూమి సంబంధిత,అన్ని రకాల ఫిర్యాదులను స్వీకరించి,పరిష్కరించడమైనదని, యాడికి మండలము నందు ఒక సంవత్సర కాలంనకు 364 పి జి ఆర్ యస్ అర్జీలు వచ్చినాయని, అన్ని అర్జీల పై విచారణ జరిపి, భూ వివాదములు, వెబ్‌ల్యాండ్ నందు పేరు నమోదు, 22ఏ భూములు, భూ రీసర్వే, రస్తా తగాదాలు, వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు.పరిష్కారములను త్వరితగతిన చేయుటకు నిర్ణీత సమయంలో చర్యలు తీసుకోనడం జరుగుచున్నదని తెలిపారు. ఇప్పటి వరకు 229 అర్జీలు పరిష్కరించడం జరిగిందని, ఆగస్ట్ నెలలో మొత్తం 17 పి జి ఆర్ యస్ అర్జీలు వచ్చినందున, అందులో ఇప్పటి వరకు 15 అర్జీలు పరిష్కరించడం జరిగిందని, మిగిలిన 2 అర్జీలు విచారణ దశలో ఉన్నాయని తెలిపారు. ఇప్పటివరకు అధిక శాతం ఫిర్యాదులను పరిష్కరించామని తెలిపారు.ప్రజలు భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ వేదికలను వినియోగించుకోవాలని సూచించారు.ప్రజలకు సంబంధించిన భూ సమస్యలను త్వరితగతిన పరిష్కారం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు, పాత్రికేయులు పాల్గొన్నారు.



## ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనం

**యాడికి , సెప్టెంబర్ 16, అనంత జనశక్తి న్యూస్ :**

మండల కేంద్రంలో ఉన్న కన్యకాపరమేశ్వరి దేవాలయం లో బుధవారం ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన కార్యక్రమం ను ఘనంగా నిర్వహించారు.శాస్త్రబద్ధంగా బట్టు స్వామి ఆధ్వర్యంలో వినాయకునికి అభిషేకం నిర్వహించి , 40 మంది ముత్తైదువులకు ఒడి బియ్యం కార్యక్రమం ను నిర్వహించారు. లడ్డు వేలంలో రూ. 20116 లకు పెండేకంటి పుల్లయ్య బ్రదర్స్ పాడినారు. వినాయకుని వెండి బొడ్డు బిళ్ళ వేలంలో కాసుల ప్రసాద్ దంపతులు రూ.13500 పాడి దక్కించుకోన్నారు. పెద్ద ఎత్తున వచ్చిన మహిళలు నృత్యాలు చేస్తూ,జై గణేష్ మహారాజ్ కు జై......అనే నామం మారుమ్రోగింది. పోలీస్ శాఖ వారి ఆదేశాల మేరకు ఉదయం 10 గంటలకే శోభాయాత్ర నిర్వహించి , పోలీస్ శాఖ కేటాయించిన చీములవాగుపల్లి నిమజ్జన ఘట్టాల దగ్గర వినాయకున్ని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ బంగారు బాల, సెక్రటరీ పవన్, యువజన సంఘం సభ్యులు రవి , కేదార్ నితిన్ రాఘవ సాయి, ఆర్యవైశ్య మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.



అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం


# గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**పుట్టపర్తి రూరల్ సెప్టెంబర్ 16**

**అనంత జన శక్తి న్యూస్.**

రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శ్రీ సత్య సాయి జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నాయకుల ఆధ్వర్యంలో
గ్రామ రెవెన్యూ సహాయకులకు సమస్యలపై బుధవారం నిరసన తెలుపుతూ శ్రీ సత్యసాయి జిల్లా డిఆర్ఓ కొండయ్యకు వినతి పత్రం అందజేశారు. పేస్కేలు అమలు చేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఎలుగా నియమించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉమ్మడి 13 జిల్లాల్లో సుమారు 20వేల మందికి పైగా గ్రామస్థాయిలో, గ్రామ రెవెన్యూ సహాయకులు పనిచేస్తున్నా మనీ, 10500 /రూ మాత్రమే వేతనం ఇస్తున్నారని, 2018 నా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 10,500 వేతనం పెంచారని నాటి నుండి నేటి



వరకు అదే కొనసాగుతుందని, కానీ ధరలు విపరీతంగా పెరిగిపోవడం వలన కుటుంబ పోషణ కష్టతరమవుతుందని దాని దృష్టిలో ఉంచుకొని వెంటనే జీతాలు పెంచాలని కోరారు.ప్రభుత్వంలో విఆర్ఎలు తీవ్రమైన నిర్లక్ష్యాన్నికి గురైరని. 10,500 వేతనంతో వీఆర్ఎల కుటుంబాలు బ్రతకడం నేటి పరిస్థితుల్లో కష్టదాయకమని
,కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాల కాలంలో వీఆర్ఎల సమస్యలను ప్రభుత్వం దృష్టికి అనేకసార్లు తీసుకురావడం జరిగిందనీ దీంతో విఆర్ఎల లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నదనీ, వీఆర్ఎలు మా న్యాయమైన సమస్యను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ ప్రభుత్వం మాదిరిగా రెగ్యులర్ చేసి పే స్కేల్ అమలు చేయాలని కోరుచున్నాము. అదేవిధంగా నామినీలుగా పనిచేస్తున్న వారందరికీ వీఆర్ఎలుగా నియమించాలని, వీఆర్ఎ లందరికీ 70% ప్రమోషన్ కల్పించాలని, వీఆర్ఎలుగా పనిచేసి మరణించిన కుటుంబాలలో అర్హులకు కారుణ్య' నియామకం కల్పించాలని, వీఆర్ఎలు అనేక రకాలుగా విధులు అనగా రీసెర్వేలు, ఎన్నికల విధులు,భూమిశిస్తులు,కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత కార్యాలయంలో వాచ్మెన్ డ్యూటీలు చేస్తూ అనేక రకాలుగా బాధ్యతలు పెట్టి, ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అదనపు డ్యూటీ నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు.
సమస్యలు ఆగస్టు చివరి నాటికి పరిష్కారం కాకపోతే నిరవధిక సమ్మెలోకి వెళ్లాలని సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయించిందనీ, తెలిపారు. ఈ సందర్భంగా వీఆర్ఏల సంఘం సత్యసాయి జిల్లా అధ్యక్షులు ఓబులేసు, గంగాద్రి, వేమ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా వినాయక నిమజ్జనం....

**యల్లనూరు, సెప్టెంబరు 16, అనంత జనశక్తి న్యూస్ ;**

మండల వ్యాప్తంగా వినాయక నిమజ్జన కార్యక్రమం బుధవారం ప్రశాంతంగా జరిగింది మొత్తం మండల వ్యాప్తంగా 100 పైగా విగ్రహాలను ఏర్పాటు చేయగా అన్ని గ్రామాలలో బుధవారమే నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేశారు. మూడు రోజులు పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రజలు ప్రత్యేక పూజలను నిర్వహించి, వర్షం కోసం పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

**నిమజ్జనానికి నీరు లేక....**

వినాయక పండుగ ను అన్ని గ్రామాలలోని ప్రజలు ఎంతో వైభవంగా నిర్వహించినప్పటికీ వినాయక నిమజ్జనానికి నీటి సౌకర్యం లేక యల్లనూరు గ్రామానికి చెందిన ప్రజలు స్వామివారిని చిత్రావతి నదిలో అలాగే నిలబెట్టి వదిలి పూజా కార్యక్రమాలను నిర్వహించారు.





## ముగిసిన నిమజ్జనం...

**పుట్లూరు, సెప్టెంబర్ 16, అనంత జనశక్తి న్యూస్;**

**మండల వ్యాప్తంగా బుధవారం వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. డబ్బు వాయిద్యాలతో బై బై గణేశా అంటూ గణనాథునికి వీడుకోలు పలికారు. సిఐ సత్యబాబు ఆధ్వర్యంలో ఎస్సై తన సిబ్బందితో కలిసి గ్రామాలలో ఎటువంటి సంఘటనలు జరగకుండా ప్రత్యేక బందోబస్తూ నిర్వహించి నిమజ్జ కార్యక్రమాన్ని పూర్తి చేశారు.**

# పోలీసులకు రైతులు ప్రత్యేక ధన్యవాదాలు

**అగళి సెప్టెంబర్ 16,అనంత జనశక్తి న్యూస్:**

మండల పరిధిలో రైతులుకు చెందిన కేబుల్ వైర్ మరియు స్టార్టర్ లను దొంగిలించిన దొంగలను కేవలం రెండు నెలల వ్యవధిలో పట్టుకొని 1000 మీటర్ల కేబుల్ వైర్లు, నాలుగు స్టార్టర్ లను రికవరీ చేసి, మండల పరిధిలోని 25మంది రైతులకు స్థానిక ఎస్సై.జి. రంగడు యాదవ్ అందించడం జరిగినది. ఈ సందర్భంగా మండల రైతులు మాట్లాడుతూ వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ వైర్ల తరచుగా చోరీలు జరుగుతుండటంతో రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలు, పంటల నష్టాన్ని ఎదుర్కొంటున్నారు. సరైన సమయంలో నీరందక చేతికి వచ్చిన పంటను కాపాడుకోవడానికి



రైతులు రాత్రింబవళ్ళు కష్టపడుతుంటే దొంగలు భోరు కేబుల్ వైర్లను స్టార్టర్ లను దొంగలించి మరింత తీవ్రంగా అన్యాయం చేస్తున్నారు. ఈ సందర్భంగా పై అధికారుల ఆదేశాల మేరకు స్థానిక ఎస్సై.జి.రంగడు యాదవ్ సిబ్బందితో కలిసి రంగంలోకి దిగి కేబుల్ దొంగలను పట్టుకొని అరెస్టు చేసి వారి నుండి కేబుల్ వైర్లను స్టార్టర్ లను స్వాధీనం చేసుకొని బుదవారం నష్టపోయిన రైతులకు అప్పగించారు. రైతులు చాలా సంతోషం వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పి సతీష్ కుమార్, మడకశిర సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎ. రాజకుమార్, ఎస్సై. జి.రంగడు యాదవ్, పోలిస్ సిబ్బందికు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా గణపతి నిమజ్జనం...

**నల్లచెరువు సెప్టెంబర్ 16 అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రంలోని అన్ని గ్రామాల్లో బుధవారం నాడు వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి పుర వీధుల్లో డప్పు వాయిద్యాలతో వినాయకున్ని ఊరేగించారు అనంతరం అంబేద్కర్ నగర్ లో ఉన్న వినాయక విగ్రహం వద్ద అక్కిగారి మల్లికార్జున 25 వేల రూపాయలకు లడ్డు పాట పాడి లడ్డును దక్కించుకున్నాడు. ఎటువంటి ఆ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎసై మక్బూల్ బాషా ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు ఈ కార్యక్రమంలో వినాయక మండపాల నిర్వాహకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఘనంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు

**- ప్రేమ్‌సదన్ చిన్నారులతో కేక్ కట్ చేసి నిత్యావసరాల పంపిణీ**

**హిందూపురం సెప్టెంబర్ 16 అనంత జనశక్తి న్యూస్**

హిందూపురం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని హిందూపురం లోని శ్రీ సత్యసాయి ప్రేమ్‌సదన్‌లో బీజేపీ నాయకులు ఆదర్శ్‌కుమార్ నల్లపేట ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.
బీజేపీ నంద్యాల జిల్లా ఇన్‌చార్జి పీడీ పార్థసారథి ముఖ్యఅతిథిగా పాల్గొని చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం వారికి నిత్యావసర వస్తువులు పంపిణీ చేసి వారితో ఆత్మీయంగా గడిపారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.
కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి ఉదయ్‌కుమార్, కురుబ భారతి, బద్రి, సునీల్, నాగరాజు, నరసింహ, ప్రాణేశ్ , అరవింద్, కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.




## భక్తిశ్రద్ధలతో , వినాయక. చవితి. మహోత్సవాలు

**అమడగూరు సెప్టెంబర్ 16, అనంత జనశక్తి న్యూస్**

అమడగూరు స్థానిక మండల కేంద్రంలోని, ఎస్సీ కాలనీ, బస్టాండు బీసీ కాలనీ, మరియు బలకవారిపల్లి, గ్రామంలో, తదితర ప్రాంతాలలో యువత గ్రామ ప్రజలు, ఆధ్వర్యంలో వినాయక చవితి పండగ పర్వదినాన పురవీధుల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేసి వినాయకుడికి భక్తిశ్రద్ధలత,3,రోజులు పాటు కొలువు తీర్చి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం వినాయక చవితి పండగ పర్వదినం రోజు సోమవారం, ఏర్పాటు చేసిన బొజ్జ గణపతి గణనాధుని నిమజ్జన వేడుకల్లో భాగంగా వినాయక విగ్రహాన్ని పురవీధుల గుండా తిప్పుతూ బాణాసంచా పేల్చుతూ ప్రతి గడపగడపకు వెళ్లి భక్తులకు దర్శనం ఇస్తారు. అనంతరం గణనాధునికీ భక్తులు కాయ కర్పూరం సమర్పించి మొక్కుబడులు కోర్కెలు తీర్చుకుంటారు. భక్తి శ్రద్ధలతో గణనాథుని, ట్రాక్టర్లో, ఊరేగింపుగా వెళ్లి,డీజే సౌండ్ తో డాన్సులతో చెక్కల భజనలతో బాణాసంచా పేల్చుతూ యువకులు పిల్లలు పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని జై గణేష్ జై మహారాజ్ అంటూ కేరింతలు మధ్య గణనాధుని ఊరేగింపుగా ఉత్సాహంగా సాగింది. అనంతరం కర్ణాటక ప్రాంతం బిల్లూరు, చెరువులో గణపతి స్వామివారి విగ్రహాలు యువకులు సంతోషంగా నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో యువకులు పిల్లలు పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## లెప్రసిపై ఇంటింటి సర్వే



**యాడికి , సెప్టెంబర్ 16, అనంత జనశక్తి న్యూస్ :**

మండల కేంద్రంలో లెప్రసీ కేస్ లోపై బుధవారం ఇంటింటి సర్వే కార్యక్రమంను వైద్య సిబ్బంది నిర్వహించారు. డిటెక్షన్ క్యాంపియన్ నిర్వహణ లో భాగముగా మండల కేంద్రంలో ఉన్న 15 వార్డు, 12వ వార్డు లో ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ పి రామచంద్ర ప్రజలతో మాట్లాడుతు ఎవరికైనా స్పర్శ లేని మచ్చలు , రాగి రంగు బుడపలు అరకాలు , అరచేతులు స్పర్శ కోల్పోయినచో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యాడికి హాస్పటల్ కు వచ్చి డాక్టర్ దగ్గర ఉచితంగా చికిత్స చేయించుకొని ఉచితముగా ఎం డి టి మందులు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రామ్ ప్రసాద్ గౌడు, ఆశాలు లక్ష్మీ ,నాగ సులోచన, వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక నిమజ్జనం



**యాడికి, సెప్టెంబర్ 16, అనంత జనశక్తి న్యూస్ :**

మండల కేంద్రంలో ను, గ్రామాలలో ను బుధవారం వినాయక నిమజ్జన కార్యక్రమం ను ఘనంగా నిర్వహించారు. వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుర వీధుల్లో మేళా తాళాలతో వినాయకున్ని ఊరేగించారు. జై భోలో గణేష్ మహారాజ్ కు జై అనే.... నామం మారుమ్రోగింది. ఎటువంటి ఆ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సి ఐ శ్రీనివాసులు,పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వినాయక మండపాల నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

## దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి వీసీకి అభినందనలు




**అనంతపురం, సెప్టెంబర్ 16, అనంత జనశక్తి న్యూస్**

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి, ఉద్యోగులకు సంబంధించిన పలు సమస్యలను బి.కె.ఎస్. ఆనంద్, ఓబులేసు, కొండయ్య, అశోక్ తదితరులు పలుమార్లు వీసీ ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్ దృష్టికి తీసుకెళ్లారు.సమస్యలను పరిశీలించిన వీసీ తగిన చర్యలు తీసుకుని పరిష్కారానికి కృషి చేశారు. ముఖ్యంగా విశ్వవిద్యాలయ బోధనేతర ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడంపై ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.అలాగే విశ్వవిద్యాలయంలోని బ్యాక్‌లాగ్ ఖాళీలు, పోస్టుల భర్తీ అంశాన్ని వీసీ దృష్టికి తీసుకురాగా, ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు చేపడతామని వీసీ హామీ ఇచ్చారు.దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన వీసీ ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్‌ను ప్రతినిధులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బి.కె.ఎస్. ఆనంద్, ఓబులేసు, కొండయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు కేబుల్ దొంగల అరెస్టు

**అగళి సెప్టెంబర్ 16,అనంత జనశక్తి న్యూస్:**

అగళి మండల పరిధిలో గత కొంత కాలంగా రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తూ, మండల పరిధిలో ఉన్న సుమారు 15 మంది రైతుల బోరుబావుల యొక్క కేబుల్ వైర్లను మరియు స్టార్టర్ లను దొంగిలించిన విషయంలో, పుట్టపర్తి జిల్లా ఎస్పి సతీష్ కుమార్ ఆదేశాల మేరకు, మడకశిర సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎ.రాజకుమార్ అద్వర్యంలో అగళి ఎస్సై.జి. రంగడు యాదవ్ తన సిబ్బందితో కలిసి కేబుల్ దొంగతనాల విషయాన్నీ సవాలుగా తీసుకోని దర్యాప్తు చేసి, అగళి మండలం, నందరజనపల్లి గ్రామానికి చెందిన తిప్పన్న మరియు యచ్.డి. హళ్లి తండా కు చెందిన ఆనంద్ లను బుదవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుండి సుమారు రూ.1,50,000/ల విలువ చేసే 500 మీటర్ల కేబుల్ వైరు మరియు రెండు స్టార్టర్ లను స్వాదినం చేసుకున్నారు. సంబందిత రైతులకు బుదవారం పై అధికారుల అనుమతి మేరకు స్థానిక ఎస్సై.జి. రంగడు యాదవ్ కేబుల్ వైర్లను, స్టార్టర్ లను అందించడమైనది.



# ప్రతి ఇంటా 'ఆశీర్వాద దీపం' వెలిగించాలి



**బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చింతా శరత్ కుమార్ రెడ్డి ఇందుకూరి సురేందర్ రెడ్డి, పిలుపు**

**అమడగూరు సెప్టెంబర్ 16( అనంత జనశక్తి న్యూస్ )**

అమడగూరు, భారత ప్రధానమంత్రి,నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 13 నుంచి అక్టోబర్ 17 వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా, ఈరోజు,సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు ప్రతి ఇంటిలో 'ఆశీర్వాద దీపం' వెలిగించి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారికి శుభాకాంక్షలు తెలియజేయాలని,బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి,చింతా శరత్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.బుధవారం అమడగూరు మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజాసేవకు అంకితమై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రిగా సుదీర్ఘకాలం, ప్రధాన మంత్రిగా సేవలందిస్తూ ప్రజల కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు.మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావడంతో పాటు, సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు మేకల శ్రీనివాసులు, మండల అధ్యక్షులు రామిశెట్టి వేమనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు ఇందుకూరి సురేంద్ర రెడ్డి, మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి, గంగులప్ప, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజా



**యాడికి, సెప్టెంబర్ 16, అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రంలోని బుగ్గరోడ్డు లో ఉన్నశ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం శ్రీ అయ్యప్ప స్వామి పడి పూజా కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీ అయ్యప్పస్వామి కి విశేష అభిషేకం చేసి, వివిధ పూల మాలలతో అలంకరణ చేసి, పూజలు నిర్వహించారు.సాయంత్రం శ్రీ అయ్యప్పస్వామి పడి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.అయ్యప్పస్వామి పాటలతోను, ఓం శ్రీ స్వామియే శరణం అయ్యప్ప అనే నామం మారుమ్రోగింది.అయ్యప్పస్వామి కి మహా మంగళహారతి ని సమర్పించారు.భక్తులకు తీర్థప్రసాదాలను , అందచేశారు.పడి పూజా కార్యక్రమం ను, భక్తులకు భిక్ష ను పి.ఓబులరాజు, కుటుంబం సభ్యులు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో గురుస్వాములు హరినాథ్ స్వామి, చిట్టి స్వామి, ఆలయ అధ్యక్షుడు నాగరాజు, పూజారి నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

# అర్బన్ టిడిపి కార్యాలయంలో ఘనంగా వినాయక నిమజ్జన వేడుకలు



- **కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి సతీమణి శ్రీ లక్ష్మి , ఎమ్మెల్సీ రమాదేవి**
- **కోలాహలంగా సాగిన ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమం**

**అనంతపురం సెప్టెంబర్ 16, అనంత జనశక్తి న్యూస్**

అనంతపురం అర్బన్ టిడిపి కార్యాలయంలో ప్రతిష్టించిన వినాయక మండపం వద్ద నిమజ్జన వేడుకలు అత్యంత వైభవంగా, కోలాహల వాతావరణంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సతీమణి దగ్గుపాటి శ్రీలక్ష్మి, కుమార్తె దగ్గుపాటి అశ్రిత , ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు, కార్యకర్తలకు అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం వినాయక విగ్రహాన్ని ఊరేగింపు వాహనంలో ఉంచారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు ఊరేగింపుగా కార్యక్రమంలో పాల్గొన్నారు. రంగులు చల్లుకుంటూ, డబ్బులు వాయిస్తూ నృత్యాలు చేసుకుంటూ ముందుకు సాగారు. బళ్లారి బైపాస్ మీదుగా భారీ పెన్నహోబిలం వద్దకు చేరుకుని వినాయక నిమజ్జనాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో పూర్తి చేశారు. ఈ వేడుకలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్ తో,వ్యక్తి మృతి

**ఆమడగూరు సెప్టెంబర్16( అనంత జనశక్తి న్యూస్ )**



అమడగూరు, మండల పరిధిలోని పూలుకుంట పల్లి గ్రామానికి చెందిన మస్తాన్ (45) విద్యుత్ షాక్ గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు పోలీసులు తెలిపిన వివరాల మేరకు మృతుడు మస్తాన్ మంగళవారం రాత్రి పూలుకుంటపల్లి సమీపంలో వ్యవసాయ పొలంలో జూదం ఆడుతుండగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు లైట్ ఆర్పి లైట్ వేయడంతో పోలీసులు వస్తున్నారని భయపడి పరుగులు తీసే క్రమంలో పక్కనే ఉన్న పొలంలో విద్యుత్ వైర్లు తగిలి అక్కడికక్కడే మృతి చెందారని వారు తెలిపారు మృతుడు భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు మృతుడికి భార్య కుమార్తె ఇద్దరు కుమారులు ఉన్నారు అని తెలిపారు

# కోర్టు కనికరించినా.. ప్రభుత్వం దయ చూపడం లేదు?



- **దిశ సమావేశంలో జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ ధ్వజం**
- **కోర్టు ద్వారా విడాకులు పొందినా 50 ఏళ్లు పైబడి ఉండాలన్న నిబంధనతో అర్హులకు పింఛన్లు ఇవ్వకుండా అన్యాయం**
- **విడాకులు పొందిన మహిళలు, వారి పిల్లల భవిష్యత్ ను ఈ ప్రభుత్వం ఏం చేయాలనుకుంటోంది?**
- **వయస్సుతో సంబంధం లేకుండా కోర్టు ద్వారా విడాకులు పొందిన మహిళలందరికీ పింఛన్లు ఇవ్వాలని డిమాండ్**

**అనంతపురం సెప్టెంబర్ 16, అనంత జనశక్తి న్యూస్**

'ఉదయం పెళ్లి జరిగితే..సాయంత్రానికే పెళ్లి పెటాకులై విడిపోతున్నారు. రెండు, మూడు నెలల్లోనే పరస్పర అంగీకారంతో విడాకులు కూడా తీసేసుకుంటున్నారు. మరి కొందరు పది, పదిహేనేళ్లు కాపురం చేశాక, పిల్లలు పుట్టాక విడిపోతున్నారు. అయితే అటువంటి మహిళలకు సామాజిక పింఛన్లు మంజూరు చేయాలంటే 50 ఏళ్లు పైబడి ఉండాలంటూ ప్రభుత్వం నిబంధన పెట్టడం దారుణమని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ అసహనం వ్యక్తం చేశారు. జిల్లా సమన్వయ, అభివృద్ధి కమిటీ(దిశ) సమావేశం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అధ్యక్షతన అనంతపురం జెడ్పీ ఆవరణలోని డీపీఆర్సీ భవన్ లో బుధవారం నిర్వహించారు. జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ సహా కలెక్టర్ ఆనంద్, జెడ్పీ సీఈఓ విజయలక్ష్మీ వేదికపై ఆశీనులయ్యారు. అన్ని శాఖల అధికారులతో పాటు దిశ కమిటీ సభ్యులు1 పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. ఒకవైపు భర్తతో విడిపోయిన బాధలో ఉంటే, మరోవైపు తమకు పుట్టిన బిడ్డల ఆలనాపాలన చూడటం మహిళలకు శక్తికి మించిన భారమవుతోందన్నారు. ప్రభుత్వం ఇచ్చే పింఛన్ వారి పిల్లల చదువుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పింఛన్లకు దరఖాస్తు చేసుకోండంటూ ప్రభుత్వం ప్రకటించగానే అనేక మంది గ్రామ, వార్డు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. అయితే అక్కడ నిబంధనల పేరుతో సిబ్బంది తిప్పిపంపిస్తున్నారని ఆరోపించారు. ఆన్ లైన్ లో దరఖాస్తు చేద్దామని ఓపెన్ చేయగానే.. 'తగిన వయస్సు లేకపోవడంతో పింఛన్ కు అర్హులు కాదంటూ' చూపిస్తోందని ఎంపీ, కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కోర్టు ద్వారా విడాకులు పొందిన మహిళలు, వారి పిల్లల భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకొని వయస్సుతో సంబంధం లేకుండా సామాజిక పింఛన్లు మంజూరయ్యేలా మానవీయ కోణంలో ఈ అంశాన్ని పరిశీలించాలని ఆమె సూచించారు. వికలాంగుల పింఛన్ల పంపిణీలోనూ అర్హులకు అన్యాయం జరుగుతోందని, అనర్హులకు మంజూరవుతున్న పింఛన్లు, అర్హులకు ఎందుకు మంజూరు కావడం లేదని కూడా ఆమె ప్రశ్నించారు. లోటుపాట్లను సవరించి అర్హులందరికీ న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

**అమ్మాయిలకు భద్రత లేకపోతే ఎలా?**

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలల్లో చదివే అమ్మాయిల భద్రతపైనా జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ ఆందోళన వ్యక్తం చేశారు. తరచూ అమ్మాయిలు గర్భం దాలుస్తూ, ప్రసవిస్తున్న సంఘటనలు వెలుగులోకి వస్తుంటే విద్యాశాఖ అధికారులు కళ్లు మూసుకున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురంలోని ట్రిలీస్ స్కూల్లో చిన్నారిపై జరిగిన ఘటనతో పాటు జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఉపాధ్యాయులే విద్యార్థినులపై లైంగిక దాడులు పాల్పడిన ఉదంతాలు తల్లిదండ్రులకు కునుకు లేకుండా చేస్తున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు సస్పెండ్ చేసి చేతులు దులుపుకోవడమే కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, మరొకరు ఇలాంటి ఘటనలు పాల్పడాలంటేనే భయపడేలా చర్యలు ఉండాలన్నారు. ఈ అంశంపై ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ జోక్యం చేసుకుంటూ అనంతపురంలోని ట్రిలీస్ స్కూల్లో జరిగిన దారుణాన్ని ఖండించారు. ఆ కేసు ఏమైందని డీఈఓను ప్రశ్నించారు. అటువంటి స్కూళ్ల అనుమతులను తక్షణం రద్దు చేయాలని ఆదేశించారు. అప్పుడే ఇటువంటి ఘటనలకు ఫుల్ స్టాప్ పడుతుందని ఎంపీ అన్నారు. బుక్కరాయసముద్రం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని తరగతి గదుల పైకప్పులు పెచ్చులూడి, ఇనుక కడ్డీలు కనిపిస్తున్నాయని, పిల్లల తలలపై పడి జరగరాని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని గిరిజమ్మ నిలదీశారు. వెంటనే అవసరమైన నిధులు కేటాయించి, మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అధ్వానంగా ఉందని, కోడిగుడ్ల చిన్నగా వస్తున్నాయని, బర్ఫీలు నాసిరకంగా ఉంటున్నాయని పత్రికల్లో కథనాలు వస్తున్నట్లు ఆమె ఆరోపించారు. ఇదే అంశానికి సంబంధించి గతంలో జరిగిన సమావేశాల్లోనూ అనేక సార్లు చర్చించడం జరిగిందని గుర్తు చేశారు. అయితే డీఈఓ ఎందుకు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలను మొక్కుబడిగా తనిఖీ చేస్తే సరిపోదని, అక్కడ మధ్యాహ్న భోజనం ఎలా ఉందో పరిశీలించాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలో తాగునీటి పథకాలకు నిర్వహణకు జెడ్పీ నుంచి కోట్లాది రూపాయలు ఇస్తుండగా, ఆర్. డబ్ల్యూ.ఎస్, మున్సిపాలిటీల నుంచి యూజర్ చార్జీలు వసూలు కావడం లేదని, దీంతో జెడ్పీ ఆర్థికంగా బలహీనపడిపోతోందని జెడ్పీ చైర్ పర్సన్ సభ దృష్టికి తెచ్చారు. 16వ ఫైనాన్స్ నిధులు రావడం లేదని, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి నిధులు వచ్చేలా చూడాలని ఎంపీ అంబికాను కోరారు.

**ఆ స్కూల్ ను సీజ్ చెస్, అనుమతి రద్దు చేయండి: ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఆదేశం**

అనంతపురంలోని ట్రిల్లిస్ స్కూల్ ను తక్షణం సీజ్ చేయాలని, దాని అనుమతి రద్దు చేయాలని ఎంపీ ఆదేశించారు. డీఈఓ విధిగా పాఠశాలలను తనిఖీ చేసి, అక్కడి లోటుపాట్లను గుర్తించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. జిల్లాలోని ప్రధాన సమస్యలను గుర్తించి, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో అధికారుల బాధ్యతను మరింత సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా సమస్యలను పరిష్కరించేందుకు వీలవుతుందని అభిప్రాయపడ్డారు. జల్ జీవన్ మిషన్ ద్వారా జిల్లాకు అవసరమైన నిధుల మంజూరు ప్రక్రియ వేగవంతమైందన్నారు. రాయలసీమ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ఫండ్ కింద గతంలో నిలిచిపోయిన నిధులను పార్లమెంట్లో ప్రస్తావించి తిరిగి ఏడాదికి రూ.50 కోట్లు వచ్చేలా కృషి చేసినట్లు తెలిపారు. ఎంపీ కోటా కింద చేపట్టి పూర్తయిన పనులను వెంటనే ప్రారంభోత్సవం చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో తాగునీరు, పశుగ్రాసం కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

**అధికారులు సూటిగా మాట్లాడాలి: కలెక్టర్ ఆనంద్**

అధికారులు తమ శాఖలకు సంబంధించిన చర్చ రాగానే నివేదికలు చదువుతూ సమయాన్ని వృథా చేస్తున్నారని కలెక్టర్ ఆనంద్ అసహనం వ్యక్తం చేశారు. గత సమావేశాల్లో ఏం చర్చించాం, సభ్యులు ఏం ప్రశ్నలు అడిగారు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలేంటి అనే అంశాలను సుత్తి లేకుండా సూటిగా, స్పష్టంగా చెప్పేలా ప్రతి శాఖ అధికారి సిద్ధమై రావాలని కలెక్టర్ ఆనంద్ స్పష్టం చేశారు. లేకపోతే నివేదికలు చదవడానికి, వినడానికే సమయం సరిపోతుందని, దీని వల్ల సమస్యలు పరిష్కారం కాకపోగా, కొత్త కొత్త సమస్యలు వస్తాయన్నారు. ఎల్.నినో పరిస్థితుల నేపథ్యంలో ఉద్యాన పంటల మొక్కలను బతికించాలని ఆదేశించారు. మహా ప్రస్థానం వాహనాల కోసం డ్రైవర్ల నియామకానికి అవసరమైన ప్రతిపాదనలు పంపాలని సూచించారు.



# మంత్రి కందుల దుర్గేష్ కు అభినందనల వెల్లువ

- **సెప్టెంబర్ 17 న నిడదవోలులోని లయన్స్ క్లబ్ లో మంత్రి కందుల దుర్గేష్ జన్మదిన వేడుకలు**
- **విజ్జేశ్వరం నుండి నిడదవోలు వరకు భారీ బైక్ ర్యాలీ**
- **లయన్స్ క్లబ్ ప్రాంగణంలో పుట్టినరోజు వేడుకల్లో పాల్గొననున్న మంత్రివర్యులు దుర్గేష్**

**నిడదవోలు సెప్టెంబర్ 16, అనంత జనశక్తి న్యూస్**



రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు కందుల దుర్గేష్ జన్మదిన వేడుకలను సెప్టెంబర్ 17వ తేదీన (రేపు) నిడదవోలు నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించనున్నట్లు మంత్రివర్యుల కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

ఈ సందర్భంగా రాజకీయ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీర మహిళలు, అభిమానుల నుండి మంత్రివర్యులకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.ఈ సందర్భంగా ఉదయం 8:30 గంటలకు విజ్జేశ్వరం గ్రామం నుండి ప్రారంభమై నిడదవోలు పట్టణం వరకు కూటమి నాయకులు, జనసైనికులు, అభిమానుల భాగస్వామ్యంతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించబడుతుంది. 10:00 గంటలకు నిడదవోలు పట్టణంలోని లయన్స్ క్లబ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొని, అభిమానులు, నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేయనున్నారు.ఉదయం 11:00 గంటల నుండి వేడుకలకు విచ్చేసే జనసేన సైనికులు, వీర మహిళలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరికీ లయన్స్ క్లబ్ ప్రాంగణంలో భారీ ఎత్తున భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ వేడుకలకు నియోజకవర్గం నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు, అభిమానులు తరలివస్తుండటంతో ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందుజాగ్రత్త చర్యగా భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు మంత్రి కార్యాలయం వెల్లడించింది.

# భాషే మానవ మనగడకు జీవనాడి




- **ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకుడు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్**

**వెంకటాచలం సెప్టెంబర్ 16,అనంత జనశక్తి న్యూస్**

భాషే మానవ మనుగడకు జీవనాడి అని, భాషా వినియోగం సాంస్కృతిక, ఆర్థికపరమైన పునాదులను బలపరుస్తుందని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకుడు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ పేర్కొన్నారు. ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకొని బుధవారం వెంకటాచలం మండలం సరస్వతి నగర్ లో ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు, సభాధ్యక్షులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ మాట్లాడుతూ భాషా ఉద్యమాలతో పాటు, ప్రతి ఉద్యమానికి తన సాహిత్యంతో ఊపిరి పోసిన మహనీయులు ప్రజాకవి కాళోజి నారాయణరావు అని కొనియాడారు. మాతృభాషను ప్రతి ఒక్కరూ ఆదరించాలని, భాషాపరంగా, సంస్కృతి పరంగా అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తెలుగులో మాట్లాడాలని, తెలుగు మాధ్యమంలో చదవాలని, తెలుగులోనే రాయాలని కోరారు. ముఖ్యఅతిథి, మల్లెల రామయ్య నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుజా షామిలి మాట్లాడుతూ భాష ప్రజల గుండెచప్పుడు అని, తెలంగాణ రాష్ట్రంలో ఒక విశ్వవిద్యాలయానికి ప్రజాకవి కాళోజి నారాయణరావు పేరు పెట్టడం గొప్ప విషయం అన్నారు. తెలంగాణ భాష, యాస ప్రత్యేకమైనవని కొనియాడారు. ఇతర భాషలను నేర్చుకోవడానికి సాంకేతికత ఎంతో దోహదపడుతోందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం కరీంనగర్ జిల్లా ఎస్ఆర్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ బూర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అచ్చ తెలుగుతనం తెలంగాణ భాష ప్రత్యేకమని కొనియాడారు. భాషలన్నీ గొప్పవేనని. మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ప్రధాన వక్త, శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వపు రిజిస్ట్రార్ ఆచార్య టి గౌరీశంకర్ మాట్లాడుతూ భాషలో మార్పు సహజమని, కాలాన్ని బట్టి, పాలకులను బట్టి భాష మార్పునకు లోనవుతుందని పేర్కొన్నారు. భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై, ప్రభుత్వాలపై ఉందని గుర్తుచేశారు. మాతృభాషలో విద్యాబోధనతోనే దేశాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఆంగ్లం నేర్వని ఎన్నో దేశాలు నేడు అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో ఉన్నాయని గుర్తుచేశారు. కనుక మాతృభాషలను ఆదరించాలని, భాషా వినియోగం పెరగాలని అన్నారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. తొలుత డాక్టర్ బడిగె ఉమేష్ ఆలపించిన జై తెలంగాణ గేయం అందరినీ అలరించింది. కార్యక్రమంలో కవులు, రచయితలు, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం విద్యాత్మక సిబ్బంది, పరిశోధకులు, కార్యాలయం సిబ్బంది, మల్లెల రామయ్య నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

- ప్రశాంతంగా కొనసాగిన శోభాయాత్రలు, నిమజ్జన కార్యక్రమాలు

**అనంతపురం సెప్టెంబర్ 16, అనంత జనశక్తి న్యూస్**

జిల్లా వ్యాప్తంగా బుధవారం పలు ప్రాంతాల్లో వినాయక నిమజ్జన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా కొనసాగాయి. సుమారు 3 వేలకు పైగా గణేష్ ప్రతిమలను నిమజ్జనం చేశారు.జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో విస్తృతంగా బందోబస్తు ఏర్పాటు చేశారు.ప్రధాన నిమజ్జన ప్రాంతాలైన చెరువులు, కాలువల వద్ద ప్రత్యేక రక్షణ బృందాలు, ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. శోభాయా



త్రలు సాగే మార్గాల్లో సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తుగా వాహనాల మళ్లింపు చర్యలు చేపట్టారు. భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసుల సూచనలు పాటిస్తూ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించేలా పోలీసులు చర్యలు చేపట్టారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని పోలీసులు కోరారు.

# పల్లెల్లో అభివృద్ధి పనులకు ఊతం



- రహదారులు, పంట కుంటలు, గోకులాలతో గ్రామీణ మౌలిక సదుపాయాల విస్తరణ

**అమరావతి సెప్టెంబర్ 16, అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం వివిధ కార్యక్రమాల ద్వారా ప్రాధాన్యం ఇస్తోంది. ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, రహదారుల నిర్మాణం, రైతులకు ఉపయోగపడే పనులు చేపడుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది.గ్రామ సభల ద్వారా స్థానిక అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులను చేపట్టే విధానానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. పల్లెపండుగ, పల్లెపండుగ 2.0 కార్యక్రమాల ద్వారా సీసీ రోడ్లు, తారు రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల పనులు చేపట్టినట్లు అధికారులు పేర్కొంటున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల పరిధిలో సీసీ రోడ్లు, పంట కుంటలు, గోకులాల నిర్మాణంపై సమీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా అధికారిక సమాచారం వెల్లడిస్తోంది.

**గిరిజన ప్రాంతాలకు రహదారి సౌకర్యం**

మారుమూల గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు వివిధ పథకాల కింద పనులు చేపడుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, మార్కెట్లకు రవాణా సౌకర్యం మెరుగుపరిచేలా రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నారు.

**రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం**

ఉపాధి హామీ పథకం ద్వారా పంట కుంటలు, భూగర్భ జలాల పెంపు, ఉద్యాన పంటల సాగు వంటి పనులు చేపడుతున్నారు. పంట కుంటల నిర్మాణం వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు సాగునీటి వనరులను పెంచేందుకు ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల్లో పంట కుంటలు, ఉద్యాన తోటలు, నీటి తొట్టెలు వంటి పనులు కూడా భాగంగా ఉన్నాయి.

**పాడి రైతులకు గోకులాలు.. పశువులకు నీటి తొట్టెలు**

పాడి రైతులకు, పశువుల సంరక్షణకు ఉపయోగపడేలా గోకులాలు, పశువుల నీటి తొట్టెల నిర్మాణాన్ని కూడా చేపడుతున్నారు. రాష్ట్రంలోని గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల్లో మినీ గోకులాలు, పశువుల నీటి తొట్టెలు, పశుగ్రాసం తదితర పనులకు అవకాశం కల్పించినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖల అధికారిక వివరాలు పేర్కొంటున్నాయి.గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, నీటి సంరక్షణ పనులు, పారిశుధ్యం, పశుసంరక్షణ, ఉద్యానవనాల అభివృద్ధి వంటి కార్యక్రమాలను సమన్వయంతో చేపట్టి గ్రామాల మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం



చర్యలు కొనసాగిస్తోంది.

# "సీమ"పై.. వర్షాభావం పిడుగు...!

(మొదటిపేజీ తరువాయి)

భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనాల ప్రకారం సెప్టెంబర్ 19వ తేదీ నాటికి నైరుతి రుతుపవనాలు ఉపసంహరించుకునే దశకు చేరనున్నాయి. దీంతో రాయలసీమలో ఈ సీజన్‌లో వర్షాలు కురుస్తాయన్న ఆశలు క్రమంగా అడుగంటుతున్నాయి. గడిచిన 25 ఏళ్లలో ఎన్నో కుండపోతలు సీమ ప్రాంతం చూసింది. గత పాతికేళ్ల వర్షపాత చరిత్రను పరిశీలిస్తే ఈ విషయం అవగతమవుతుంది. రాయలసీమలో వర్షపాతం ఏటా ఒకే విధంగా లేదని స్పష్టమవుతుంది. కొన్ని సంవత్సరాల్లో భారీ వర్షాలు, అసాధారణ వర్షపాత రోజులు నమోదైతే... మరికొన్ని సంవత్సరాల్లో వర్షాల విస్తరణ, తీవ్రత గణనీయంగా తగ్గింది.

2005లో ఒకే ఒక్కరోజు 200 మి.మీ. వర్షపాతం నమోదైంది. అలాగే 2006లో కూడా 253.8 మి.మీ. వర్షం కురిసింది. ఇక 2007లో శ్రీశైలం ప్రాంతంలో ఏకంగా 401.4 మి.మీ. వర్షపాతం నమోదైంది.

ఇటీవలి సంవత్సరాల్లోనూ భారీ వర్షాలు రాయలసీమను ముంచెత్తాయి. 2020లో కూడా ఒక్కరోజే 168.6 మి.మీ., 2021లో 142.2 మి.మీ., 2023లో కడప ప్రాంతంలో 170 మి.మీ., 2024లో మైలవరం డ్యామ్ వద్ద 130 మి.మీ. వరకు వర్షపాతం నమోదైన సందర్భాలున్నాయి.

అంటే రాయలసీమకు భారీ వర్షాలు కొత్తేమీ కాదు. అయితే 2026లో సమస్య మాత్రం భారీ వర్షం కురవలేదు అని చెప్పడం కంటే... వర్షాలు కురవనే లేదు అని చెప్పడం కరెక్టు. అసలు వర్షాలు క్రమం తప్పకుండా కురవకపోవడంతో సీమ జిల్లాలన్నింటినీ కరవు కమ్మేసింది.

లోటు వర్షపాతమే...

సెప్టెంబర్ 14 నాటికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ గణాంకాలు పరిశీలిస్తే... రాయలసీమలోని పలు జిల్లాల్లో రుతుపరమైన వర్షపాతం గణనీయమైన లోటులో ఉంది.

కర్నూలు — 49 శాతం లోటు
నంద్యాల — 56 శాతం లోటు
అనంతపురం — 51 శాతం లోటు
శ్రీ సత్యసాయి — 65 శాతం లోటు
వైఎస్సార్ కడప — 60 శాతం లోటు
అన్నమయ్య — 79 శాతం లోటు
చిత్తూరు — 65 శాతం లోటు.

ఇందులో అన్నమయ్య జిల్లాలో నమోదైన 79 శాతం లోటు పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

ఈ గణాంకాలను బట్టి చూస్తే... ఇది ఒకటి రెండు ప్రాంతాలకు పరిమితమైన వర్షాభావం కాదు. రాయలసీమలోని విస్తృత ప్రాంతాల్లోనే వర్షపాతం లోటు కొనసాగుతోంది.

*సెప్టెంబర్...
సీమకు కీలక నెల !*

భారత వాతావరణ శాఖ ( ఐఎండీ ) 1971-2020 సాధారణ వర్షపాతం వివరాల ప్రకారం... రాయలసీమలో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సీజన్ మొత్తం సాధారణ వర్షపాతం సుమారు 408.5 మిల్లీమీటర్లు. అందులో...

జూన్ — 72.3 మి.మీ.
జూలై — 92.1 మి.మీ.
ఆగస్టు — 107.3 మి.మీ.
సెప్టెంబర్ — 136.8 మి.మీ.

అంటే నైరుతి రుతుపవనాల సీజన్‌లో రాయలసీమకు సాధారణంగా అత్యధిక వర్షపాతం అందించే నెల సెప్టెంబర్ మాత్రమే.

అందుకే సెప్టెంబర్‌లో కురిసే వర్షాలు రాయలసీమకు ప్రాణాధారం.

అందువల్ల సెప్టెంబర్ నెల వర్షాలు పంటలు, చెరువులు, రిజర్వాయర్లు, భూగర్భజలాలు, వాగులు, నదుల ప్రవాహాలకు అత్యంత కీలకం.

ఏటా ఒకేలా ఉండని వర్షపాతం...

రాయలసీమలో జూన్-సెప్టెంబర్ మధ్య నమోదైన వర్షపాతాన్ని పరిశీలిస్తే వివిధ సంవత్సరాల మధ్య భారీ వ్యత్యాసాలు కనిపిస్తాయి.

2007 — 656 మి.మీ.
2018 — 253 మి.మీ.
2019 — 460 మి.మీ.
2020 — 756 మి.మీ.
2021 — 488 మి.మీ.
2022 — 486 మి.మీ.
2023 — 357 మి.మీ.
2024 — 483 మి.మీ.

ఈ గణాంకాలు రాయలసీమ వర్షపాతం ఎంత హెచ్చుతగ్గులకు లోనవుతుందో చెప్పకనే చెబుతున్నాయి.

వర్షపాతం ఒక్కటే కొలమానం కాదు !

అయితే ఒక సీజన్‌లో మొత్తం ఎన్ని మిల్లీమీటర్ల వర్షం కురిసిందన్నది మాత్రమే రాయలసీమ నీటి పరిస్థితిని నిర్ణయించదు.

ఎన్ని భారీ వర్షపు రోజులు వచ్చాయి ?
వర్షాలు ఎంత విస్తృతంగా పడ్డాయి ?
ఎంత తరచుగా కురిశాయి ?
పరివాహక ప్రాంతాల్లో వర్షం ఎంత పడింది ?
ఆ వర్షానికి అనుగుణంగా వాగులు, నదుల్లో ప్రవాహం ఏర్పడిందా ? లేదా ?
చెరువులు, రిజర్వాయర్లకు నీరు చేరిందా ? లేదా ?
ఇలాంటి అంశాలన్నీ కీలకమే.

ఒక ప్రాంతంలో భారీ వర్షం కురిసినా... అదే సమయంలో పరివాహక ప్రాంతాల్లో వర్షం లేకపోతే పెద్దగా నీటి నిల్వలు ఏర్పడకపోవచ్చు. మరోవైపు విస్తృత ప్రాంతంలో మోస్తరు వర్షాలు విడతలవారీగా కురిస్తే నేలలోకి నీరు ఇంకడం, చెరువులు నిండడం, భూగర్భజలాలు పుంజుకోవడం వంటి ప్రయోజనాలు కలగవచ్చు.

**రైతుకే కాదు... నీటి వ్యవస్థకూ దెబ్బ**

2026లో కనిపిస్తున్న ప్రధాన సమస్య వర్షపాతం లోటుతో పాటు వర్షాల విస్తరణ, చురుకుదనం, పరివాహక ప్రాంతాల్లో వర్షాల కొరత కూడా కావడం ఆందోళన కలిగిస్తోంది. దీని ప్రభావం వ్యవసాయం పైనే పరిమితం కాదు. చెరువులు, రిజర్వాయర్లు, వాగులు, నదులతో పాటు పెన్నా పరివాహక ప్రాంతం, కృష్ణా ఆధారిత నీటి వ్యవస్థలు, భూగర్భజలాలపై కూడా దీని ప్రభావం పడే అవకాశం ఉంది. వర్షాలు తక్కువగా ఉంటే సాగునీటి లభ్యత తగ్గుతుంది. భూగర్భజలాలపై ఆధారపడే ప్రాంతాల్లో బోర్లు మరింత లోతుకు వెళ్లాల్సి వస్తోంది. చెరువులు, చిన్న నీటి వనరులకు తగినంత నీరు చేరకపోతే గ్రామీణ నీటి భద్రత పైనా ప్రభావం పడుతోంది.

కుండపోత కాదు...
విస్తృత వర్షాలే అవసరం

రాయలసీమకు వర్షం అవసరం. కానీ ఒక్కరోజు కుండపోత వర్షం కురవడం మాత్రమే సమస్యకు పరిష్కారం కాదు.

ఒక్కరోజు భారీ వర్షం నేలను తడపొచ్చు...
కొన్ని వాగుల్లో ప్రవాహాన్ని పెంచొచ్చు...
కానీ రాయలసీమ మొత్తం నీటి పరిస్థితిని మార్చాలంటే విస్తృత ప్రాంతంలో, విడతలవారీగా, తగిన విరామాలతో, నిలకడగా వర్షాలు కురవాలి.

అది జరిగితేనే చెరువులు, రిజర్వాయర్లు, నదులు, భూగర్భజల వనరులకు ప్రయోజనం చేకూరుతుంది. ఈ నేపథ్యంలో 2026 రాయలసీమ వర్షపాతం చరిత్రలో మరో ప్రత్యేక సంవత్సరంగా నిలుస్తుందా ? లేక చివరి దశలో వచ్చే వర్షాలు పరిస్థితిని కొంతమేర మార్చగలవా ? అన్నది సెప్టెంబర్ నెల చివరి రోజుల్లో ఏర్పడే వాతావరణ పరిణామాలపైనే ఆధారపడి ఉంటాయి.

రాయలసీమ ఆకాశం వైపు చూస్తోంది...
వర్షం కోసం మాత్రమే కాదు — తన నీటి భవిష్యత్తు కోసం కూడా !

# ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియడం లేదు

**కోవూరు, సెప్టెంబర్ 16, అనంతజనశక్తి న్యూస్**

కోవూరులో టీడీపీ కార్యకర్తలు, నేతల సమన్వయ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. నెల్లూరులో తనకు పలికిన స్వాగతం ఎప్పటికీ మర్చిపోలేనని అన్నారు. ఎన్టీఆర్ పార్టీ స్థాపించిన సమయంలో తొలి కార్యకర్తగా బుచ్చిరెడ్డిపాలెంకు చెందిన బెజవాడ పాపిరెడ్డి ఉన్నారని గుర్తుచేశారు.

డబ్బులు ఎంతో మంది సంపాదిస్తారని.. అయితే ప్రజలకు సేవ చేయాలనే ఆలోచన వీపీఆర్ దంపతుల్లో చూశానని లోకేశ్ అన్నారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే వారు రాజకీయాల్లోకి వచ్చారని పేర్కొన్నారు. జిల్లాలో ఒక నాయకుడు తమ పార్టీ గెలవకపోతే రాజకీయ సన్యాసం చేస్తానని శపథం చేశారని, ఇప్పుడు ఆయన ఏమయ్యారని ప్రశ్నించారు. టీడీపీ మహిళలను గౌరవిస్తుందని లోకేశ్ అన్నారు. వైఎస్ భారతి గురించి సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన టీడీపీకి చెందిన వారిని కూడా తాను జైలుకు పంపించానని చెప్పారు. కార్యకర్తే పార్టీకి అధినేత అని పేర్కొన్నారు.

రాష్ట్రంలో 45 వేల మంది కార్యకర్తలు, కోటి 60 లక్షల ఇళ్లకు 'గడప గడపకు' వెళ్లారని లోకేశ్ తెలిపారు. పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని కార్యకర్తలు సమర్థంగా పూర్తి చేయాలని సూచించారు. సంక్షేమం, అభివృద్ధి అనేది జోడి ఎద్దుల బండిలా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తాయని అన్నారు. రాష్ట్రం పరిశ్రమలు, పెట్టుబడులకు



వేదికగా మారుతోందని పేర్కొన్నారు.

ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని వారు కూడా తనను ప్రశ్నిస్తున్నారని లోకేశ్ అన్నారు. ఐదేళ్ల పాటు డీఎస్సీని పట్టించుకోని వారు ఇప్పుడు దాని గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. డీఎస్సీపై మాట్లాడే వారు తనతో చర్చకు రావాలని, తాను చర్చకు సిద్ధంగా ఉన్నానని సవాల్ చేశారు. కూటమి ప్రభుత్వంపై జరిగే ప్రతి కుట్రను కార్యకర్తలు తిప్పికొట్టాలని లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పార్టీ చేస్తున్న ప్రతి మంచి పనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

2029 ఎన్నికల్లోనూ కూటమి ప్రభుత్వం కలిసి పోటీ చేస్తుందని లోకేశ్ అన్నారు. ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని, ఎన్నికల్లో గెలిస్తేనే ప్రజలకు మరింత సేవ చేయగలమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ ఎన్నికలు జరిగినా ఎన్డీయే జెండా ఎగరాలని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా టీడీపీ నూటికి నూరు శాతం విజయం సాధించేలా కార్యకర్తలు పనిచేయాలని నారా లోకేశ్ పిలుపునిచ్చారు.

# మారెమ్మ జాతరలో పాల్గొన్న టీడీపీ నాయకుడు ధర్మతేజ



– భక్తిశ్రద్ధలతో మారెమ్మ దేవికి ప్రత్యేక పూజలు

**శెట్టూరు, సెప్టెంబర్ 16 (అనంత జనశక్తి న్యూస్)**

మండల పరిధిలోని బసంపల్లి, అడవి గొల్లపల్లి గ్రామాల్లో నిర్వహించిన మారెమ్మ దేవి జాతర వేడుకల్లో టీడీపీ నాయకుడు దేవినేని ధర్మతేజ పాల్గొన్నారు.స్థానిక టీడీపీ నాయకుల ఆహ్వానం మేరకు, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సూచనలతో ధర్మతేజ జాతర వేడుకలకు హాజరై మారెమ్మ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, టీడీపీ నాయకులు ఆయనకు స్వాగతం పలికారు.జాతర సందర్భంగా గ్రామాల్లో భక్తుల సందడి నెలకొంది. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ధర్మతేజ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఆ విధానం ఆపేయండి అడ్వాన్స్ టిప్ వ్యవహారం




## క్యాబ్ అగ్రిగేటర్లను ఆదేశించిన కేంద్రం

**న్యూఢిల్లీ, అనంత జనశక్తి న్యూస్**

క్యాబ్ బుక్ చేసుకునే ముందే డ్రైవర్‌కు టిప్ చెల్లించే విధానాన్ని నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వం అగ్రిగేటర్లను ఆదేశించింది. ఈ విధానం వినియోగదారులను తప్పుదోవ పట్టిస్తోందని.. ఇదో అన్యాయ వ్యాపార పద్ధతి అని వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖరే తెలిపారు. రైడ్ పూర్తయిన తర్వాత టిప్ ఇవ్వడం వినియోగదారుడి ఇష్టంపై ఆధారపడి ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. ముందుగా టిప్ ఇవ్వకపోతే రైడ్‌ను యాక్సెప్ట్ చేయరు అనే భావన ప్రయాణికులకు కలిగించొద్దని చెప్పారు. ఈ అంశంపై జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్ కు అనేక ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు.

ఈ నేపథ్యంలో ఇప్పటికే ర్యాపిడోపై సీసీపీఏ చర్యలు తీసుకుంది. రూ.10 లక్షల జరిమానా విధించింది. రైడ్ బుకింగ్ సమయంలో అదనంగా రూ.10, రూ.20, రూ.30 యాడ్ చేయాలని యాప్ సూచిస్తున్నట్లు గుర్తించింది. ఎక్కువ మొత్తం చెల్లిస్తే రైడ్ లభించే అవకాశం పెరుగుతుందని సందేశాలు ఇస్తున్నట్లు పేర్కొంది. రైడ్ బుకింగ్ సమయంలోనే దూరం, సమయం, ట్రాఫిక్, టోల్ వంటి వివిధ అంశాల ఆధారంగా ఛార్జీ నిర్ణయిస్తారని సీసీపీఏ తెలిపింది. ఆ తర్వాత అదే రైడ్‌కు అదనంగా చెల్లించాలని కోరడం సమర్థనీయం కాదని పేర్కొంది. ఈ విషయమై ఉబర్, ఓలాపై కూడా దర్యాప్తు కొనసాగుతోందని నిధి ఖరే తెలిపారు.

# భద్రతా కారణాలతో ఈవెంట్ రద్దు



(మొదటి పేజీ తరువాయి)

గంటల తరబడి క్రమశిక్షణతో క్యూలైన్లలో వేచి చూసిన అభిమానులకు ఈ నిర్ణయం తీవ్ర నిరాశను మిగిల్చింది.

**మైకులో అనౌన్స్‌మెంట్ చేసిన సీఎం బృందం**

అనుమతులు లేకపోవడం, భద్రతాపరమైన ముప్పు పొంచి ఉండటంతో విధిలేని పరిస్థితుల్లో కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి బృందానికి చెందిన ఒక ప్రతినిధి మైక్ ద్వారా ప్రకటించారు. "ప్రజా భద్రతను దృష్టిలో ఉంచుకుని, సరైన అనుమతులు లేకపోవడం వల్ల ఈ కార్యక్రమాన్ని ఇక్కడితో నిలిపివేస్తున్నాం" అని ఆయన అభిమానులకు స్పష్టం చేశారు. తమ అభిమాన నటుడు, రాజకీయ నాయకుడిని చూసేందుకు హోటల్ పరిసరాల్లో గంటల తరబడి పడిగాపులు కాసిన అభిమానులు ఈ ప్రకటనతో ఆవేదనకు గురయ్యారు. "తమిళనాడులో జరిగే కార్యక్రమాలకు వచ్చే వారితో పోలిస్తే.. ఇక్కడకు చాలా తక్కువ మందే వచ్చారు. పోలీసులు భద్రత దృష్ట్యా నిర్ణయం తీసుకోవడం సహేతుకమే అయినప్పటికీ.. ఎంతసేపటి నుంచో వేచి ఉన్న అభిమానులకు ఇది ఎంతో బాధాకరం" అని ఒక యువ అభిమాని పేర్కొన్నాడు.

**రాష్ట్రానికి రూ. 12,300 కోట్ల పెట్టుబడులు..**

తమిళనాడు రాష్ట్రానికి విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు సీఎం విజయ్ నేతృత్వంలోని ఒక ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందం యూకే పర్యటన చేపట్టింది. తమిళనాడును ఆసియాలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగింది. అయితే ఈ పర్యటన సమయంలో దాదాపు రూ. 12,300 కోట్ల విలువైన పలు కీలక అవగాహనా ఒప్పందాలపై సంతకాలు చేసినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం అధికారికంగా వెల్లడించింది. ఈ భారీ పెట్టుబడుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 9,400 కంటే ఎక్కువ ఉన్నత స్థాయి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అధికారులు భావిస్తున్నారు. ఈ విజయవంతమైన బ్రిటన్ పర్యటనను ముగించుకుని బుధవారం సీఎం విజయ్ తిరిగి భారత్‌కు చేరుకోనున్నారు.

అనంత జనశక్తి
గురువారం | అనంతపురం
17.09.2026


# M.S.సుబ్బులక్ష్మిగా రష్మిక.. కమల్ హాసన్ చేతుల మీదుగా షురూ



ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు ఎం.ఎస్.సుబ్బులక్ష్మి జీవిత కథతో తెరకెక్కనున్న సినిమా లాంఛనంగా ప్రారంభమైంది. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందనున్న ఈ సినిమాలో సుబ్బులక్ష్మి పాత్రలో రష్మిక మందన నటిస్తోంది. ఈ సినిమాకు 'ఎం.ఎస్' అనే పేరు ఖరారు చేశారు. 'ఏ లెగసీ ఆన్ స్క్రీన్' అనేది ఉప శీర్షిక.

సుబ్బులక్ష్మి 116వ జయంతిని పురస్కరించుకొని చెన్నై వేదికగా సినిమాను లాంఛనంగా ప్రారంభించారు. అగ్ర కథానాయకుడు కమల్ హాసన్ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్‌నిచ్చారు. అనిరుధ్ సంగీతం అందించనున్నారు. ఈ చిత్రాన్ని అల్లు అరవింద్, రాక్‌లైన్ వెంకటేశ్, బన్నీ వాస్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



# ప్రెగ్నెన్సీ క్రేవింగ్స్.. ఇష్టమైన ఆహారం ఇదే: సమంత



తల్లి కాబోతున్న ఆనందంలో ఉన్నారు స్టార్ హీరోయిన్ సమంత . గర్భధారణ సమయంలో తాను ఇష్టంగా తీసుకుంటున్న ఆహార పదార్థాల గురించి తాజాగా అభిమానులతో ఆమె పంచుకున్నారు. తనకు దక్షిణాది సంప్రదాయ వంటకాలంటే ఎంతో ఇష్టమని వెల్లడించారు.

సోనీ విళ పంచుకున్న ఓ పోస్ట్‌లో.. జీవితాంతం ఒకే రకమైన ఆహారం తినాల్సి వస్తే ఏం ఎంచుకుంటారు? అని సమంతను అడగ్గా, ఉదయం అల్పాహారంగా ఇడ్లీ, మధ్యాహ్నం భోజనంలో పెరుగన్నం, రాత్రికి దోశ తినేందుకు ఇష్టపడతానని ఆమె బదులిచ్చారు. "ప్రస్తుతం గర్భంతో ఉన్నందున నాకెక్కువగా ఇవే తినాలనిపిస్తోంది. భవిష్యత్తులో నా ఇష్టాలు మారొచ్చు" అని ఆమె సరదాగా చెప్పకొచ్చారు.

ఇక, సమంత గతేడాది దర్శక-నిర్మాత రాజ్ నిడిమోరును కోయంబత్తూరులోని ఈషా యోగా కేంద్రంలో వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇటీవల సీమంతం వేడుక కూడా సంప్రదాయబద్ధంగా జరిగింది. కాగా, గత జూన్‌లో.. ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన 'మా ఇంటి బంగారం' సినిమా సక్సెస్ మీట్‌లో తాను తల్లి కాబోతున్న విషయాన్ని సమంత అధికారికంగా ప్రకటించారు. చేతిలో ఉన్న ప్రాజెక్టులు పూర్తయ్యాక సినిమాల నుంచి చిన్న విరామం తీసుకోనున్నట్లు ఆమె అప్పట్లోనే వెల్లడించారు. ప్రస్తుతం సమంత 'సెలబ్రిటీ మాస్టర్ చెఫ్ తమిళం' కార్యక్రమానికి హోస్ట్‌గా వ్యవహరిస్తుండగా.. రాజ్ & డీకే తెరకెక్కించే భవిష్యత్ ప్రాజెక్టుల్లోనూ ఆమె భాగం కానున్నట్లు తెలుస్తోంది.

# రూ.350 కోట్ల స్టార్.. చర్చంతా ఆమె బరువుపైనే..!

బాలీవుడ్ బ్యూటీ కత్రినా కైఫ్ పేరు చెప్పగానే అందం, అభినయంతో పాటు ఆమె ఫిట్‌నెస్ గుర్తొస్తుంది. రెండు దశాబ్దాల నుంచి అగ్రహీరోలకు జోడీగా మెప్పిస్తూ.. 'కే బ్యూటీ' బ్రాండ్‌తో వ్యాపార రంగంలోనూ తనదైన స్థానాన్ని సొంతం చేసుకున్నారు. ఇంత గుర్తింపు సాధించిన ఆమె గురించి ఇప్పుడు సోషల్ మీడియాలో జరుగుతోన్న చర్చ మాత్రం విస్మయానికి గురిచేస్తోంది.

ఇటీవల అంబానీ ఇంట జరిగిన వినాయక చవితి వేడుకలకు భర్త విక్కీ కౌశల్‌తో కలిసి కత్రినా హాజరయ్యారు. ఆ ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. తల్లి అయ్యాక కత్రినా చాలా హుందాగా ఉన్నారంటూ కొందరు కామెంట్ చేయగా.. మరికొందరు మాత్రం ప్రసవానంతరం ఆమె శరీరాకృతిలో వచ్చిన మార్పులపై వ్యాఖ్యలు చేశారు. గతంలో ఉన్న ఫొటోలతో పోలుస్తూ ఆమె బరువు గురించి మాట్లాడుతున్నారు. 'ఆమె పని అయిపోయింది.. వృద్ధాప్యం వచ్చేసింది' అంటూ ట్రోల్స్ చేస్తున్నారు.

దీంతో మహిళలతో పాటు పలువురు అభిమానులు కత్రినాకు మద్దతుగా నిలుస్తున్నారు. 2025 నవంబర్‌లో ఈ నటి బాబుకు జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. ప్రసవం తర్వాత శరీరంలో మార్పులు సహజమే. ప్రతి మహిళ తిరిగి మునుపటి రూపంలోకి రావడానికి పట్టే సమయం ఒకేలా ఉండదు. కత్రినా విషయంలోనూ అదే జరిగింది. ఈ సమయంలో ఆమెపై ట్రోల్స్ రావడంపై అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓ తల్లి శరీరాకృతిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమంటూ ప్రశ్నిస్తున్నారు. ఒక మహిళను గౌరవించడంలో.. ఆమె రూపం మాత్రమే ప్రామాణికం కాదని.. ప్రతిభ, విజయాలే అసలైన కొలమానాలని అంటున్నారు.

2003లో 'బూమ్' చిత్రంతో కత్రినా కైఫ్ తన కెరీర్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి ఎన్నో హిట్ సినిమాల్లో నటించారు. ఆమె ఒక్కో ప్రాజెక్ట్‌కు రూ.10 కోట్లకు పైగా పారితోషికం తీసుకుంటారని.. 2024 జీక్యూ ఇండియా నివేదిక వెల్లడించింది. ఇక మరోవైపు ఆమె బ్రాండ్ 'కే బ్యూటీ' 2025-2026 ఆర్థిక సంవత్సరంలో రూ.350 కోట్ల విలువైన అమ్మకాలను నమోదు చేసిందని అంచనా. ఆమె సాధించిన ఈ విజయాల గురించి మాట్లాడుకోకుండా బరువుపై విమర్శలు రావడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



# కోర్ గ్రూప్‌ను సెలెక్ట్ చేయండి.. 'బెస్ట్ 11'తో ఆడించండి: యువీ



వన్డే ప్రపంచ కప్ 2027 ఎడిషన్‌కు కేవలం ఏడాది వ్యవధి మాత్రమే ఉంది. ఇప్పటికీ స్క్వాడ్‌పై మేనేజ్‌మెంట్ ఓ స్పష్టతకు రావడంలేదు. సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీకి ఆడతారా? లేదా? అనేది తెలియదు.

ఈ క్రమంలో భారత మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ మేనేజ్‌మెంట్‌కు ఓ కీలక సూచన ఇచ్చారు. ఆఖరి క్షణాల్లో స్క్వాడ్‌లో మార్పులు చేయొద్దని హెచ్చరించాడు.

"రాబోయే ఏడాది మొత్తం ఒకే జట్టుతో మ్యాచులు ఆడించాలి. ఆ టీమ్‌తోనే వరల్డ్ కప్ బరిలోకి దిగాలి. అంతేకానీ, మరికొద్ది రోజుల్లో మెగా టోర్నీ ఉందనగా మార్పులు చేయొద్దు. మీరు ఎంత మందినైతే ఎంపిక చేస్తారో అది 16 లేదా 20 అయినా సరే వారందరికీ ఈ సంవత్సరం వ్యవధిలో అవకాశాలు ఇవ్వాలి. ఇప్పుడు ఎక్కువగా టీ20 క్రికెట్ ఆడుతున్న వేళ.. ప్రతి ఆటగాడికి 50 ఓవర్ల గేమ్ అలవాటు తగ్గిపోతోంది. మళ్లీ వారిని రిథమ్‌లోకి తేవాలంటే అవకాశాలు ఇవ్వడమే మార్గం. వరల్డ్ కప్ కోసం సన్నద్ధమయ్యేందుకు తగినంత సమయం కేటాయించాలి. మనం పంపించే జట్టు వరల్డ్ కప్‌ను గెలవగలదని నమ్మకం ఉంచుదాం. ఆటగాళ్లకు అండగా నిలుద్దాం. ఓడినా.. గెలిచినా మద్దతు ఇస్తూనే ఉందాం" అని యువీ సూచించాడు.

**అదే వ్యత్యాసం**

"ప్రతి జట్టూ భిన్నమైన ప్లేయర్లతో కూర్పుతో బరిలోకి దిగుతుంది. కొన్ని జట్లలో ఎక్కువ మంది ఆల్‌రౌండర్లు ఉంటారు. మరికొన్నింట్లో స్పెషలిస్ట్ బ్యాటర్లు, బౌలర్లకు అవకాశం. ఏదైనా సరే అత్యుత్తమ కాంబినేషన్‌తోనే వెళ్లాలి. ఇక రిజర్వ్ బెంచ్‌పైనా బలం ఉండాలి. మ్యాచ్ గెలిపించగలరని మీకు అనిపించే అత్యుత్తమ 11 మంది ఆటగాళ్లతోనే మీరు బరిలోకి దిగాలి. వన్డే ప్రపంచ కప్‌లో ఆస్ట్రేలియా జట్టు ఎందుకు విజయవంతమైన జట్టుగా మారిందంటే.. ఇదే కారణం. ఆ టీమ్‌లో అంతా మ్యాచ్ విన్నర్లే. ఇబ్బందుల్లో ఉంటే అందరూ తలో చేయివేసి నడిపిస్తారు. కనీసం ఒక్కరైనా బాధ్యత తీసుకొని చివరి వరకూ ఉండేందుకు ప్రయత్నిస్తారు" అని యువీ విశ్లేషించాడు.

# పాక్ బ్యాటర్‌ను వెనక్కి నెట్టి.. మళ్లీ రెండో స్థానంలోకి అభిషేక్

ఐసీసీ టీ20 బ్యాటింగ్ ర్యాంకుల్లో భారత ద్వయం అదరగొట్టేస్తోంది. ఇషాన్ కిషన్ (913) అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. అభిషేక్ శర్మ (862) ఒక ప్లేస్ ముందుకొచ్చి రెండో ర్యాంకుకు చేరాడు. ఈ క్రమంలో పాకిస్థాన్ ఆటగాడు షహిబ్జాద ఫర్హాన్ (848)ను వెనక్కి నెట్టాడు. అఫ్గాన్‌తో రెండు టీ20ల్లో అభిషేక్ హాఫ్ సెంచరీతో కలిపి 121 పరుగులు చేశాడు. ఇక వన్డేల్లో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (801) టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. టెస్టుల్లో హ్యారీ బ్రూక్ (861)దే అగ్రస్థానం.

**టాప్ -5లోకి వరుణ్**

అఫ్గాన్‌తో తొలి టీ20 మ్యాచ్ ఆడాక.. గాయపడి సిరీస్‌కి దూరమైన వరుణ్ చక్రవర్తి (678) బౌలింగ్ విభాగంలో ఐదో ప్లేస్‌కు చేరాడు. రెండు స్థానాలను మెరుగుపర్చుకున్నాడు. భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా (650) ఏడు స్థానాలు ఎగబాకి పదో ర్యాంకుకు చేరాడు. టీ20 విభాగంలో రషీద్ ఖాన్ (744) అగ్రస్థానంలో నిలిచాడు. వన్డేల్లోనూ అతడిదే టాప్ ర్యాంక్.

# వసతి సమస్యే కాదు.. కంటైనర్లను అలవాటు చేసుకున్నాం: శరత్ కమల్



ఆసియా క్రీడలకు వేళైంది. ఇప్పటికే భారత జంబో టీమ్ జపాన్‌కు చేరుకుంది. అయితే, అక్కడ వసతి సదుపాయాలపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. చిన్న కంటైనర్లలో అథ్లెట్లకు బస కల్పించడం సరైంది కాదని వ్యాఖ్యలు వినిపించాయి. ఈ క్రమంలో భారత డిప్యూటీ చెఫ్ ది మిషన్ శరత్ కమల్ అక్కడి వసతులపై స్పందించాడు. తమకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదని.. కంటైనర్లను భారత అథ్లెట్లు త్వరగానే అలవాటు చేసుకుంటారని తెలిపాడు. మొత్తం 501 మంది అథ్లెట్లు, 265 మంది అధికారులతో కూడిన భారత్ బృందం ఆసియా క్రీడల కోసం వెళ్లింది.

"స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సూచనల మేరకు ఆటగాళ్ల కోసం భారత్‌లోనే కొన్ని కంటైనర్లను ఏర్పాటు చేశాం. అందులో ఉండేలా తర్ఫీదు ఇచ్చాం. కాబట్టి, ఆసియా క్రీడల సందర్భంగా అథ్లెట్లు ఎలాంటి ఇబ్బంది పడరని అనుకుంటున్నా. అక్కడ ఉన్న క్రూయిజ్ షిప్స్ వంటి నమూనాలను ఇక్కడ తయారు చేయించి వినియోగించాం. ప్లేయర్లూ అలవాటు చేసుకున్నారు. అయితే, వారు కొన్నింటిని ఆశించడం తప్పలేదు. వారికి నచ్చజెప్పాం. ఇక్కడ అన్నింటికంటే ముఖ్యమైంది నాణ్యమైన ప్రదర్శన ఇవ్వడం. టీటీలో కనీసం ఒక్క మెడల్ అయినా గెలుచుకోవాలి. గత ఎడిషన్‌లో మహిళల విభాగంలో ఒకటి గెలిచాం. ఈసారి ఆ సంఖ్య పెరిగితే బాగుంటుంది. పురుషుల డబుల్స్‌లో మనుష్, మానవ్ బాగా ఆడుతున్నారు. ఇప్పుడు వారిద్దరూ ప్రపంచంలోనే నంబర్ 2 జోడీ. మెడల్ గెలిచే అవకాశాలు ఎక్కువే" అని శరత్ వెల్లడించారు.

సెప్టెంబర్ 19 నుంచి ఆసియా గేమ్స్ మొదలవుతాయి. ఈసారి కూడా క్రికెట్‌లో రెండు పతకాలు భారత్‌కే వస్తాయనేది విశ్లేషకుల అంచనా. గత ఏషియన్ గేమ్స్‌లో పతకాల సంఖ్య సెంచరీ (107) దాటింది. ఈసారి అంతకంటే ఎక్కువ పతకాలను గెలుచుకోవాలని భారత్ భావిస్తోంది.

# జ్వెరెవ్‌దే యుఎస్ ఓపెన్



యుఎస్ ఓపెన్‌లో అమెరికా ఆటగాడు గెలవాలని ఎంతగానో ఎదురుచూసిన స్థానిక అభిమానులకు టాప్ సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) నిరాశకు గురిచేశాడు. ఈ ఏడాది అద్భుత ఫామ్‌లో ఉన్న అతడు పురుషుల సింగిల్స్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఫైనల్లో జ్వెరెవ్ 6-3, 7-6 (7-2), 5-7, 6-2తో ఎనిమిదో సీడ్ షెల్టన్ (అమెరికా)పై విజయం సాధించాడు. జ్వెరెవ్ ఫైనల్లో 9 ఏస్‌లు, 35 విన్నర్లు కొట్టాడు. నాలుగుసార్లు ప్రత్యర్థి సర్వీసును బ్రేక్ చేశాడు. "మేమెంత శ్రమించామో, ఎంత బాధపడ్డామో దేవుడు చూశాడనుకుంటా. ఇన్నేళ్ల కష్టానికి 2026లో ఫలితం లభించింది" అని మ్యాచ్ అనంతరం తన జట్టును ఉద్దేశించి జ్వెరెవ్ వ్యాఖ్యానించాడు. ఈ ఏడాది అతడు గెలిచిన రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్ ఇది. ఫ్రెంచ్ ఓపెన్ కూడా కైవసం చేసుకున్నాడు. 2003లో ఆండీ రాడిక్ తర్వాత యుఎస్ ఓపెన్ టైటిల్‌ను అమెరికా ఆటగాడు గెలుచుకోలేదు.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314